
ంధ్రపత్రిక

త్ర వార పత్రిక



4 అణాలు
24-6-'53


NDHRA PATRIKA ILLUSTRATED WEEKL



అందాల సౌధం

ఫోటోలు—శ్రీ కె. సి. ఎమ్ ఈశ్వరబాబు (మద్రాసు)

అయోమార్గం



సంవత్సర చందా
రు. 12-0-0
విడిప్రతిక 4 అ.

ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక

Founder : K. NAGESWARA RAO

సంపుటము 45
సంచిక 48
24.6-53

విజయ జ్యేష్ఠ శుద్ధ ద్వాదశి; బుధవారం



"స్వామి అంగుష్ఠానంద"

ఫొటో — శ్రీ కె. వెంకటేశ్వరరావు, ఏలూరు.

విషయానుక్రమణిక

పంచతంత్రం:
సంధి-విగ్రహం
(బొమ్మల కథ)

ఆంధ్రపత్రిక సచిత్రవారపత్రికలో 1953 జూలై 1 వ తేదీ సంచికతో ప్రారంభించి సీరియల్‌గా సంధి - విగ్రహం బొమ్మలకథను ప్రచురించ బోతున్నామని పాఠకులకు తెలుపుటకు సంతసించుచున్నాము.

—సంపాదకుడు

కాలక్షేపం

మంచివి పండువెన్నెలలు;—
మంచివి పుష్పవనప్రదేశముల్;—
మంచిది సాధుసంగము సమాగత
సౌఖ్యము;—చాటువాక్యముల్
మంచివి;—మంచి దశ్రుయుత
మానవతీముఖము;—ఈ సమస్తమున్
మంచిది కా; దనిత్యమని
మానసవృత్తి నెఱుంగువారికిన్.

తా॥ పండువెన్నెలలు మంచివే - పూలతోటలుఉండే ప్రదేశములు రమ్యమైనవే- సాధువులు పండితులు మొదలైన సత్పురుషుల సాంగత్యసౌఖ్యము మంచిదే; - చాటుపద్యములు అనుకవిత్వము విని వినోదించడం సంతోషకరమే - ప్రణయకోపము చేత కన్నులనీరు నించి జాలిగొల్పెడి స్త్రీముఖము మనోహరమైనదే - కాని, యీ సమస్తమున్నూ అనిత్యమని మనస్సులో స్థిరమైన భావమేర్పడిన వారికి మాత్రము యీ సమస్తమున్నూ మంచిది కాదు.

ఏదైనా, శాశ్వతంగా పర్మనెంటుగా చిరకాలాలపాటు అక్కరకు వచ్చేదిగా ఉండాలని కోరడం మంచిది. కాని, పర్మనెంటు ఉద్యోగం లభించక పూర్వము, టెంపొరరీ ఉద్యోగమైనా సరే లభిస్తే చాలునని యెంచి అక్టింగు మాస్టాగా మొట్టమొదట ప్రవేశిస్తాడు. క్రమేణా, పర్మనెంటు ఉద్యోగం ఒకటి ఖాళీవచ్చినప్పుడు, యీ అవకాశం అతనికి లభిస్తుంది. ప్రారంభములో కొద్ది జీతం యివ్వబడి నప్పటికీ, కొంతకాలమైన పిమ్మట పెద్ద హోదాలోకి వెళ్ళవచ్చు. గెజెటెడ్ ఆఫీసర్లు కావచ్చు. నెలకు రూ 10 లు. జీతానికి ప్రవేశించి చివరకు రూ 1,000 జీతమువరకు గడించి పుష్కలంగా పెంచను పుచ్చుకొని "కృష్ణా! రామా!" అంటూ నిక్షేపంగా కాలక్షేపం చేసిన వాళ్ళున్నారు. అందువల్ల ఖాయమైన ఉద్యోగం ప్రారంభదశలో లభించకపోయి నప్పటికీ, ఉత్తరోత్తరా వృద్ధిలోనికి రాగల అవకాశాలు ఉండగలవనే ఆశతో ఏదో ఒక ఉద్యోగంలో ప్రవేశించడం అవివేకం కాదు. "ఉద్యోగం పురుషలక్షణం" అనే సూత్రమును అనుసరించి, ఆరంభదశలో అక్టింగు ఉద్యోగమైనా సరే చేయవలసినదే. ఎందుచేతనంటే, ముందుగానే, హరిః ఓం అంటూనే కాలుపెట్టగానే పర్మనెంటు ఉద్యోగం ఎంత పరీక్షా ప్యాసయినా, ఎంత ప్రవీణుడైనా, ఎంత ప్రజ్ఞావంతుడైనా ప్రాప్తించడం అసామాన్యం, అసాధ్యం.

ఇంతకూ, యీ "పర్మనెంటు" అనే మాటకు మాత్రము పర్మనెంటయిన అర్థం కన్పించడం లేదు.

వెంకాయమ్మగారు అనే ఒక పండు ముత్తయిదువ ఉండేది. ఆమెకు సత్తుగిన్నెలంటే అమితమైన ప్రీతి. ఈరోజులలో ఆ సత్తుతప్పెలలు గాని, సత్తుగిన్నెలు గాని కంచుకాగడా వేసి వెతకినా దొరకవు. పూర్వము యీ సత్తుగిన్నెలు అనేక విధాలుగా ఉపయోగపడేవి. మజ్జిగ వగైరా పుల్లని వస్తువులు సత్తుగిన్నెలలో పోసుకుంటే కిలుము ఎక్కకుండా మజ్జిగ నిరాక్షేపణగా నిక్షేపంగా నిల్వఉండేది. చింతపండు పులుసు పెట్టిన కూరలు దానితో వండుకొనుటకు వీలుగా ఉండేది. ఇత్తడిగిన్నెలతో వండవలెనంటే, ఆ గిన్నెలకు లోపల సీసముపూయించి కళాయి చేయించవలసి ఉంటుంది. ఆ గిన్నెలకు చేయించిన కళాయి స్థిరంగా ఉండదు. అది అశాశ్వతమైనది. అయిదారు మాసాలు అయినపిమ్మట, కళాయి అంతా పోయేది. తిరిగి కళాయి పూసేవానికోరకు ఎదురుచూస్తూ ఉండాలి. వాడు ఎంత ఎరిగియున్న వాడైనప్పటికీ, వాడి కళాశాస్త్ర మాహాత్మ్యం ఏమిటో గాని, ఆ కళాయి "పూత మెరుంగులున్ పసరు పూసు తొడంగులు" అన్నట్లుగా, భోగం మెరుగులూగున, పాత్రకు

దాసు వామనరావు

వెండితో వెల్ల వేసినట్లుగా మెరుస్తూ ఉంటుంది. అదివరకు పనికిరాని పాత్రకు కళాయి పూయగానే కొత్త కళ వస్తుంది. తళతళలాడుతుంది. భాండానికి దూరమైన పుణ్యాంగన నాలుగో రోజున స్నానం చేసి యింట్లోకి వచ్చినట్లుగా, అదివరకు అపవిత్రమైనట్లుగా భావింపబడిన పాత్రకు పవిత్రత వస్తుంది. అదివరకు అపాత్రమైనది ఇప్పుడు పాత్రమవుతుంది. కాని, నెలనెలకూ యింటికి దూరమయ్యే మనిషి లాగున నెలనెలకూ యీ పాత్రకు పవిత్రత పోయి, తిరిగి కళాయి చేయించవలసిన గతి పట్టుతూ ఉండవచ్చు. ఆ కళాయి పూత మెరుగు స్థిరమైన కళ కాదు. అది అంత అస్థిరంగా ఉండుటకు కారణమేమిటి యని పరిశోధిస్తే, ఆ మర్మంఅంతా కళాయి పూసేవానిలోనే ఉన్నదని వెంకాయమ్మగారు వాదించేది. ఆ మర్మశాస్త్రం ఆమెకు తెలిసినట్లుగా యింకెవ్వరికీ తెలియదు. ఆ కళాశాస్త్రం తెలిసిన ఆ కళాయి కర్మకారులతో వాదించడానికి ఆమె సముజ్జీగా ఉండేది. ఇంతకూ, వెంకాయమ్మగారి అనుభవసిద్ధాంతమేమిటంటే, "ఈ కళాయిశాస్త్రం అంతా వట్టి మోసం - వట్టి అసత్యం - కళాయి అనేది అనిత్యం. కనుక, యీవిధంగా వీళ్ళను నమ్ముకొని వృధా వ్యయం చేయడంకంటె, శాశ్వతంగా స్థిరంగా ఉండేటటువంటి సత్తు గిన్నెలను కొనుక్కోవడం ఉత్తమం. సంసారాలు బాగుపడాలంటే, సత్తు గిన్నెలకంటె మరొక సాధనోపాయం లేదు. శాశ్వతమైనదేదో దానిని గ్రహించాలి - అశాశ్వతమైన దానిని గర్హించాలి. కనుక, కళాయి గిన్నెలను గర్హించి సత్తుగిన్నెలను గ్రహించడమే ముక్తిమార్గం." అల్యూమినియం గిన్నెలు అమలులోనికి వచ్చిన నాటికి వెంకాయమ్మగారికి చాలా వయస్సు వచ్చింది. కాని యీ అల్యూమినియం గిన్నెలను ఆమె కోడలు కొని ఉపయోగించడం ఆమె మాచింది. "ఎందుకు యీ అరోమయం గిన్నెలు కొంటావు?" అని చీవాట్లు పెట్టేంది. ఆ గిన్నెలు చిల్లిపడిపోవడం అరిగిపోవడం అతి సులభం. అతిత్వరగా క్షీణించి క్షయమయ్యేపాత్రలను చూస్తే ఆమెకు సత్యాగ్రహం అత్యాగ్రహం వచ్చేది- "ఇంటినిండా రోగిష్ఠి సంతానం లాగున ఎందుకీ చిల్లిపడిన అరోమయం గిన్నెలు?" అని ప్రశ్నించేది. "వీటిని మాటు పెట్టి మరమ్మతుచేయించడానికి కూడా వీలు లేదు. ఈ క్షయపాత్రలు యిన్ని కొనడం కంటే, శాశ్వతంగా అక్కరకువచ్చే అక్షయ పాత్రగా భారీ సత్తు గిన్నె ఒక్కటి కొనుక్కో అమ్మాయి!" అని చివాట్లు పెట్టేది. వెంకాయమ్మ జీవితం సుఖంగానే గడచిపోయింది. ఆమె సత్యకాలపు మనిషి - జవసత్త్వలు గల సత్తుకాలపు మనిషి - ఇటీవల "ఎవర్ సిల్వర్" గిన్నెలు (నిత్య రజతపాత్రలు) అనేవి ఆవిర్భవించాయి - ఇవి అల్యూమినియం గిన్నెలకంటె ఎక్కువ శాశ్వతంగా ఉంటాయి. సత్తు గిన్నెలంత బరువు ఉండవు. ఇత్తడిగిన్నెలవలె కళాయిచేయిస్తూ ఉండనక్కరలేదు. కాని, యీ నిత్యరజత పాత్రలకు వెలహెచ్చు - ఇంట్లోకి ఎవడైనా దొంగవాడు ప్రవేశిస్తే వెండిబంగారాలపై ముందుగా కన్ను వేసి వాటిని మూట కట్టుకొనిపోతాడు. అటువంటివి కన్పించని పక్షంలో తత్తుల్యమైన నిత్య రజతపాత్రలను సంగ్రహిస్తాడు. అంతేగాని, యిత్తడి గిన్నెలకోసం వాని మనసు మెత్తపడదు. "భార్యా రూపవతీ శత్రుః" అన్నట్లుగా ఎవర్ సిల్వర్ గిన్నెలు సాక్షాత్తు వెండి కొండయగు కైలాసగిరిమీదనుంచి తయారై దిగివచ్చిన వెండిగిన్నెలవలె ధగద్ధగాయమానంగా మెరుస్తూఉన్న నిత్యరజత పాత్రల మీద కన్ను వేయకమానడు. ఈకారణంచేత పాతకాలపు ముత్తయిదువయైన వెంకాయమ్మగారు "నిత్యరజతపాత్ర"లను కూడా నిరసించి అవి "అనిత్యరజతపాత్రలే" యని సిద్ధాంతీకరించేది.

"సత్" అంటే ఏమిటో "అసత్" అంటే ఏమిటో గ్రహించడమే, జ్ఞానం అన్నారు.

"చదువనివా డజ్ఞుండగు
చదివిన సదసద్వివేక
చతురత గలుగున్."

అనే మాట భాగవతం చదివిన వాళ్ళందరికీ భావగతం అవుతుంది. "సత్" అంటే, "సత్యం"- ఏదైతే, నిజమైనదో, అదే నికరమైనది. అదే నిలకడైనది. సత్యమైన దేదో, అదే శాశ్వతమైనది. చక్కని గులాబీరంగు చాయ అద్దినటువంటి చీర చాలా బాగా ఉన్నదని మనం కొనవచ్చు. కాని, ఆరంగు, ఆ చాయ ఉతికితే పోతుందా ఉంటుందా? అనే పరిశీలన చేయాలి. రెండుమూడుసార్లు ఆచీరెను చాకలికి వేసినపిమ్మట, ఆ గులాబిరంగు అంతా పోయి, చీర వెలవెలపోతుంది. అది నిజమైన గులాబీరంగు కాదని మన ముఖము కూడా వెలవెలపోతుంది. వెలిసిపోనటువంటి గులాబీరంగు నిజమైన సత్యమైన గులాబీరంగు కనుక, స్థిరంగా నిత్యంగా ఉండేది ఏదో అదే సత్యమైనది. శాశ్వతమైన నిజమైన సృష్టిధర్మం ఏదో, జీవిత ధర్మం ఏదో గ్రహించాలి. "సత్" అంటే ఏమిటో "అసత్" అంటే ఏమిటో గ్రహించడంకోసమే శాస్త్రాలన్నీ శోధించడం. కాని, యీ శాస్త్రాలన్నీ చదివిన కొలదీ అంతు తెలియని అగాధంగా ఉన్నాయి. ఈ శాస్త్రాలన్నీ శోధించాలంటే, మన జీవితకాలం చాలదు.

"శాస్త్రము లపారములు
మన్కి క్షణికతరము"

కంటి ముందర జరుగుతూఉన్న విషయములనే సరిగ్గా అర్థం చేసికొనలేకుండా ఉన్నాము. కర్నూలును ఆంధ్రదేశానికి రాజధానిగా ఎందుకు నిర్ణయించారో అర్థం కాకుండా ఉంది. ప్రత్యక్షంగా మన కండ్లఎదుట జరుగుచున్న కథ మనకు బోధపడడం లేదు. అటువంటి సందర్భంలో నన్నయభట్టు వైదీకియో నియోగియో నిజం ఎట్లా తెలుస్తుంది? దేశచరిత్ర ఎంత చదివినా, ఎంత పరిశోధించినా నిజం నిశ్చయంగా నిర్ధారణకావడంలేదు.

శ్రీకృష్ణదేవరాయలు కన్నడపువాడా? శుద్ధ తెనుగువాడా? చరిత్ర గ్రంథాలు చదివినవారే ఆంధ్రమాతసాక్షిగా ఒట్టువేసి, ప్రమాణంచేసి, ఆయనఆంధ్రమహీపతిఅని నీళ్లు నములకుండా మూఖాముఖి నిలువబడి చెప్పలేకపోతున్నారు. చరిత్ర పరిశోధన ఎంత చేసినా, వేదములు ఏనాటివో యీనాటికీ తెలియక పండితులు వితండవాదాలుచేస్తూనే ఉన్నారు. భూమిని త్రవ్విన కొలదీ సరికొత్త పాత నగరాలు బయటపడుతున్నాయి - మొహింజోదారోమహానగరం సింధునదీ ప్రాంతంలో త్రవ్వుతూ ఉంటే బయటపడింది. అది అయిదువేల ఏండ్లనాటి నగరం అంటారు. ఆనగరంలో అనేక అంతస్థుల మేడలు ఉన్నాయి. రస్తాల ప్రక్కను మురుగునీటికాల్వ లున్నాయి. ఆ నగరం పరిపాలించిన రాజు లెవరో తెలియలేదు. భూమిని త్రవ్వినకొద్దీ, చరిత్ర పరిశోధన చేసినకొద్దీ, నిజం తెలిసికొనడం నీ తరమా? నా తరమా? అన్నట్లుంది. రాజుల చరిత్రలు రోజులకొలదీ చదివినప్పటికీ, వారి సచ్చరిత్ర ఎంతవరకో వారి దుశ్చరిత్ర ఎంతవరకో నిష్పాక్షికంగా, ప్రత్యక్ష ప్రమాణంగా మన కంటికి ఎన్నడూ సాక్షాత్కరించదు. రాజు అనేవాడు రాజ్యాంగతంత్రం ఎంతయినా చేస్తాడు. కార్యసాధకుడైన తర్వాత పంచతంత్రం అంతా ప్రయోగిస్తాడు. మిత్రభేదం మిత్రద్రోహం కూడా చేస్తాడు. మడి కట్టుకొన్న మహాఋషివలె మంత్రాలు చదువుతూ కూర్చుండడు. గోవులను స్త్రీలను రక్షించడానికి కత్తి కట్టిన శివాజీ చక్రవర్తిని "కొండ ఎలుక" అని ఇంగ్లీషువారు వర్ణించారు. హిందూధర్మ ప్రతిష్ఠాపకుడనియు, భవానీ భక్తుడనియు, మన దేశభక్తులు వర్ణించారు. కాని, శివాజీచేసిన రాజ్యాంగ తంత్రం

★ కాలక్షేపం ★

అంతా స్తనశల్య పరీక్ష చేస్తేనే తప్ప ఎవరితో ఎంత నిజాయితీగా ప్రవర్తించాడో, అతని జీవిత చరిత్రలో క్షీరమెంతవరకు ఉన్నదో నీరమెంతవరకు ఉన్నదో మనకు బోధపడదు.

ఈవిధంగా ఒక్కొక్క విషయం శోధించడం అంటే మనకు యీజన్మలో యీ జీవితకాలంలో అది పూర్తి అయ్యే పనికాదు. ఒకవేళ ఏదైనా అద్భుతమైన మేధాశక్తివల్లను, దేవికటాక్షం వల్లను, మనము సకల విద్యాపారంగతులమై సకలశాస్త్రములను శోధించినప్పటికీ, చివరకు బోధపడేది ఒక్కటే విషయం అని శంకరాచార్యులంతటి మేధానిధి అన్నాడు. వ్యాకరణశాస్త్రం, శబ్దశాస్త్రం మొదలైనవి కంఠోపాఠంచేస్తూ కాలహరణం చేయవద్దన్నాడు. "డు కృఞ్ కరణే" అనేటటువంటి వ్యాకరణసూత్రములను కంఠోపాఠం చేయడంవల్ల, ఆ శాస్త్రపాండిత్యం నిన్ను రక్షించదు అన్నాడు. "ఈశాస్త్రజ్ఞానం నిన్ను రక్షించదు. నీకు స్థిరమైన ఆత్మసౌఖ్యం, ఆత్మశాంతి యివ్వదు. గనుక గోవిందుని భజనచేయవలె" నన్నాడు. "భజగోవిందం! భజగోవిందం! మూఢమతే" అన్నాడు.

"ఓమూఢాత్ముడా! గోవిందుని భజించు!" అని శంకరునివంటి కోవిదుడు అన్నాడు. కాని, అటువంటి హితోపదేశం చేసేటటువంటివాడే యీ కాలంలో "వట్టి భజగోవిందం" అనిదూషిస్తోంది లోకం. భజగోవిందశ్లోకంలో "భజగోవిందం" అనేమాట తర్వాత మనకు కన్పించేది "మూఢమతే!" అను శబ్దం తప్ప మరొకటి లేదు. అందువల్ల "భజగోవిందం" అనగానే దాని తర్వాత వచ్చే శబ్దమే కుశాగ్రబుద్ధులమైన మనకు స్ఫురిస్తుంది. ఇంత కుశాగ్రబుద్ధులమైన మనము యీరోజున "భజగోవిందం" అనేటటువంటి మహోపదేశ వాక్యమును "మూఢమతి" అనే అర్థంలో అవలీలగా ఉపయోగిస్తున్నాము. వాడు వట్టి "భజగోవిందం" అంటే, వాడు వట్టి "మూఢమతి" అని అన్వయిస్తున్నాము. "భజగోవిందం" అని ఉపదేశించినవాడే వట్టి 'భజగోవిందం' అంటున్నాము.

అయితే మన కుశాగ్రబుద్ధివల్ల మనకు కలిగే పెద్ద సందేహం ఒకటి ఉంది. జీవితమే ఖాయమైనది కాదని సిద్ధాంతీకరించినప్పుడు యీ జీవుడు ఖాయమైన స్థిరమైన, నిత్యమైనదానికోసం ఎందుకు ప్రయత్నించాలి? కాయం ఖాయం కాదు అని అంగీకరించిన పిమ్మట, ఈ శరీరానికి ఖాయమైన వాటితో గాని, నిత్యమైనవాటితో గాని, నిమిత్తం లేదు. ఆ మాట నిజమే. సత్తుగిన్నె ఎంత శాశ్వతమైనదో, ఆమాత్రపు సత్తు కూడా అనిత్యమైన యీ శరీరానికి లేదు. సత్తుగిన్నె కొన్ని తరాలవరకైనా ఉంటుంది. కాని యీ తనువు అరోమయం గిన్నె కన్న అరోమయమైనది. గుండె ఆగిపోతే చాలు - పండువంటి గిన్నెకు బెజ్జం పడినట్లే. రామకృష్ణ పరమహంసవంటి పరమయోగి కూడా తనువు చాలించాడు. శ్రీ రమణమహర్షి దేహం కూడా పండి రాలిపోయింది. అరవిందయోగి అరవిందములవంటి కన్నులు మూసికొని, కాసారంలో కన్పించకుండా పోయిన

క మ లం క లే సే అంతర్ధానమైనాడు. అటువంటి మహాయోగులు పరమహంసలు శాశ్వతమైన దేదో నిత్యమైన దేదో గ్రహించి దానికొరకే జీవితం అంతా "కృష్ణార్పణం" అన్నారుగదా! అటువంటివారు శాశ్వతంగా శాశ్వతమైన దానినే అనుభవిస్తూ శాశ్వత జిరాయితీ హక్కుదారులవలె అనుభవిస్తూ ఉండలేదు ఎందుచేత?

ఇక్కడే ఉంది అసలైన సమస్య – ఈ అశాశ్వతమైన శరీరంలో ఉన్న జీవుడు కొంత యోగసాధకంగాని, తపస్సుగాని, ధర్మజిజ్ఞాసగాని చేసి, పర్మనెంటు గెజెటెడ్ ఆఫీసర్ ఉద్యోగం ఒకటి సంపాదించాడు. అందువల్ల యీ తాత్కాలిక టెంపొరరీ ఉద్యోగం అనే ఉపాధిలో నుంచి నిష్క్రమించి, మరొక శాశ్వత నిత్యానందపదవికి ఆ జీవుడు వెళ్లిపోయినాడు. ఇదే మనశాస్త్రాలు, మన ఋషులు, ఆ ఋషుల శిష్యప్రశిష్యులు చిరకాలంగా మనకు చెప్పినటువంటి సమాధానం. కాని ఈసమాధానంతో మనం సామాన్యంగా సమాధానపడం. ఈ టెంపొరరీ ఉపాధిలో నుంచి వెళ్ళిపోయిన జీవుడు ఎక్కడకు ట్రాన్సుఫరు అయినాడు? ఏ లోకంలో ఏం చేస్తూఉంటాడు? అదంతా పరలోక విషయం. ఈ పారలౌకిక విషయం చర్చించేటప్పుడు మన లౌకిక ఉపమానాలు గాని, లౌకికజ్ఞానం గాని చాలవన్నారు. "బ్రహ్మానంద పదవిని" జీవుడు పొందినప్పుడు ఏమవుతాడు? ఏ స్థితిలో ఏవిధంగా ఉంటాడు? అనే విషయముపై వివరించి చెప్పడానికి, బ్రహ్మానందపదవిని పొందిన వాడెవ్వడూ మనవద్దకు తిరిగి రాడు. ఎవరెస్టు శిఖరం ఎక్కినవాళ్ళు తిరిగివచ్చారు గాని, పరమాత్మతో ఐక్యమైన జీవాత్మ తిరిగిరాదు. అందువల్ల, సదరు "పునరావృత్తి రహిత శాశ్వత బ్రహ్మైకవల్యావాప్తి" అంటే ఏమిటో విప్పిచెప్పడానికి, గం॥ భా॥ స॥ వెంకాయమ్మగారికికూడా సాధ్యమయ్యేది కాదు. కాని, ఆమె జీవితమంతా శాశ్వతమైన దేదో స్థిరమైన దేదో అస్థిరమైన దేదో గ్రహించి ప్రవర్తించవలెనని చెవి నిల్లుకట్టుకొని ఘోషిస్తూ సంసారం చక్కగా దిద్దుకుంటూ వచ్చింది.

వెంకాయమ్మగారి కంటె నాలుగేళ్ళు ముందుగానే ఆమె భర్త శోభనాచలంగారు స్వర్గస్థులైనారు. ఆయనకు శూల నొప్పి తరుచు వస్తూఉండేది. ఎప్పుడు బాధ వచ్చినా, ఆయన ప్రాణం తల్లడిల్లిపోయేది. బ్రతుకుతాడనే ఆశ ఉండేది కాదు. అందువల్ల ఆయన అదివరకే తనన ఆస్తిని కుమారులకూ కూతుళ్లకూ భార్యకూ వేర్వేరుగా పంచివీలునామా వ్రాసిఉంచుకున్నాడు. తన తనువు అశాశ్వతం అని గ్రహించి స్థిరమైన ఏర్పాటు ఏదో ఆలోచించి ఆప్రకారంగా వీలునామా రిజస్టరు చేయించాడు. తన తనువుకంటే తన స్థిరాస్తి స్థిరమైనదని ఆయనకుగల లౌకికజ్ఞానంతో ఆయన గ్రహించి కట్టుదిట్టమైన పనిచేశాడు.

ఒకనాడు సాయంకాలం ఆయనకు మామూలుగా వచ్చే పరిణామశూల అపరిమితంగా వచ్చింది. ఈసారి ఆయన ప్రాణప్రయాణం నిశ్చయమన్నారు వైద్యులు కూడా. స్టేషనుకు వెళ్ళి టికెట్టుకొని రైలు తప్పినదని తిరిగి యింటికి వచ్చినట్లుగా ఈసారి ఆయన ప్రాణప్రయాణం తప్పదన్నారు. కాని వర్జ్యం వారం చూడకుండా హఠాత్తుగా ప్రయాణమయ్యేటట్లుగా ఉంది ఆయన స్థితి. వెంకాయమ్మగారు అనేక పర్యాయములు యిటువంటి గుండెదడలు అనుభవించింది. వెర్రి ఏడ్పులు ఏడిస్తే ఏమీ ప్రయోజనంలేదని గ్రహించింది. ఈ ప్రమాదోన్మాదములకు అతీతమైన గుండె నిబ్బరం ఆమెకు ఏర్పడింది. "తనువులశాశ్వతంబు లిక తామసమేల కృశించి యేడ్వగా?" అనే తత్వజ్ఞానం ఆమెకు కలిగింది. అశాశ్వతమైన దేదో గ్రహించింది. అశాశ్వతమైనవి అల్యూమినియం గిన్నెలు. అశాశ్వతమైనవి కళాయి గిన్నెలు. శాశ్వతమైనది సత్తుగిన్నె. సత్తు ప్రభావం తెలిసిన మనిషి అసత్తుఅయినదానికోసం శోకించదు. పదికాలాలపాటు ఉండేది ఏదో తెలిసి పదిలంగా కాపాడుతుంది. శోభనాచలంగారి ప్రాణోత్క్రమణ సమయంలో పంచాంగం చూడవలసిందని తమ్మునితో చెప్పింది. ధనిష్టా నక్షత్రం అన్నాడు. నక్షత్రం ఏమీ బాగా లేదు. ఆ పెద్దఘటం వెళ్ళిపోగానే ఇల్లుకూడా విడిచిపెట్టవలసిన స్థితి వస్తే చాలా దుర్ఘటం అవుతుంది. ఎందుచేతనంటే, వెంకాయమ్మగారు ఎంతో శ్రద్ధగా పెట్టిన ఆవకాయ జాడీలు రెండూ, మాగాయ జాడీ ఒకటి, ఉసిరికాయజాడీలు రెండూ, చింతకాయ జాడీ ఒకటి ఇవన్నీ మైలపడిపోవలసి వస్తుంది. ఏడాది పొడుగునా, పదిమంది పిల్లా మేకా ఉన్న పెద్ద సంసారానికి ఊరగాయలు లేకపోతే ఎట్లా గడుస్తుంది?

ఆ జాడీ లన్నీ అటకమీద ఆవిడ భద్రంగా దాచిఉంచింది. శోభనాచలం గారిని క్రిందపెట్టేలోపుగా, వెంకాయమ్మగారు వసుక దొడ్లో నూతివద్ద స్నానంచేసి ఆ తడి బట్టలతోనే అటకమీద కెక్కి జాడీలన్నీ జాగ్రతగా క్రిందకు దించి ప్రక్కయింటి శరభమ్మగారి వంటగదిలోకి చేర్చింది. ఆంజనేయులవారు సంజీవి పర్వతం మోసికొని వెళ్ళినట్లుగా నిమిషాల మీద చేర్చింది ఆ జాడీలన్నీ మైల పడిపోకుండా.

భర్త అంటే ఆమెకు ఉన్న భక్తియందు కించిత్తయినా లోపం ఉన్నదని గాని కళంకం ఉన్నదనిగాని, వేలెత్తి చూపగల వాడు యీ మహిలో నహి. కాని, ఆమె తత్వం ఎటువంటిదంటే, భర్తయందు అనురాగం, భర్తయందు ఆసక్తిఉండడం మంచిదే కాని, ఆయన దేహస్థితి చూచినప్పుడు ఆమెకు ఊరగాయ జాడీలకంటె ఆయన ఘటం అనిత్యంగా కన్పించేది. అందువల్ల "అసత్" అని తెలిసినటువంటి వస్తువు మీద వ్యామోహం వృద్ధిచేసికొనడం శుద్ధ బుద్ధి తక్కువపని యనిన్ని మంచిది కాదనిన్నీ ఆమె గ్రహించింది.

అందువల్ల ఒకదానికంటె యింకొకటి ఏది ఎక్కువకాలం ఉంటుందో దానినే నమ్మి ఉండాలని ఆమెకు గల సత్తు అసత్తు విచక్షణ జ్ఞానంతో ఆమె నిశ్చయించుకొన్నది. కాని, ఆమె వట్టి మొద్దుసత్తెప్పాల కాదు. ఉపనిషత్తులు కూడా యీ విషయమే ఘోషిస్తున్నాయి.

"అసతో మా సద్గమయ"

[అసత్తు అయినటువంటి దానిలోనుంచి సత్తు అయినటువంటి దానిలోనికి నన్ను నడిపించుము.] ఆమె గ్రహించిన అనుభవ సిద్ధాంతం కూడా అదే. తక్కువకాలం ఉండేదానికై భ్రమపడక ఎక్కువకాలం ఉండేదానిని భద్రంగా చూచుకోండి అని ఆమె సదా వాదించింది.

కనుక, "ఈసమస్తమునో మంచి గా కాదు—" ఎవరికయ్యా అంటే—

"అనిత్యమని మానసవృత్తి కాంచు నారికిన్"

★

బంధు విరోధం

"అమ్మా నాన్నా ఇవాళ మెయిల్లో వస్తారు కాబోలు" అన్నది శశిరేఖ తాంబూలం అందిస్తూ.

"ఆఁ...అలాగ రాశారుగా?" అన్నాడు సుబ్బారావు.

"రాశారు" అన్నది శశిరేఖ చేతులు దులుపుకుంటూ.

"ఇంతకీ అసలు విషయం తేలలేదుగా?" అన్నాడు సుబ్బారావు నోటిలోని ఆకులు సరిచేసుకుంటూ.

"ఏమిటదీ?"

"పిల్లాడికి పేరేం పెట్టడమూ? అని."

శశిరేఖ చిన్నగా నవ్వింది. "అది ఓ పెద్దప్రశ్నా?" అన్నది.

"సరే...నా పెళ్ళికి నేనూ రావాలా అన్నట్లుంది...అసలు పేరేం పెట్టాలో తేలకుండా బారసాల ఏమిటి?"

"జరిగిన బారసాలలన్నీ పేర్లు పెట్టకుండానే జరిగాయా?"

"భేష్! చదువుకున్నదాని వనిపించుకున్నావ్!"

శశిరేఖ ముఖం మరికొంచెం ఎర్రబడింది. తన చదువు విషయం సుబ్బారావు ఎప్పుడూ హేళన చేస్తూనే ఉంటాడు.

"పోనీ మీరు చదువుకున్నారుగా! మీరు చెప్పండి" అన్నది శశిరేఖ కొంచెం ఎత్తిపొడుపుగా.

"అదిగో...కోపం వచ్చింది...కాని చంద్రకాంతి ఎర్రనౌతుందా?" అన్నాడు సుబ్బారావు.

శశిరేఖ చిన్నగా నవ్వుతూ, "ఊఁ...పేరునిబట్టే చంద్రకాంతి వస్తుంది కాబోలు...తెలివితేటలు!" అన్నది.

"నా కళ్లు పెట్టుకు చూడూ!"

"చిన్నపిల్లాడల్లే..."

"చిన్న పిల్లాళ్లకి వెన్నేలా, అమ్మయిలూ ఏం తెలుస్తాయో!"

"ఇంక చాలించండి బాబూ!"

"అది సరేకాని, నీపేరు మీవాళ్లుచాలా ఆలోచించి పెట్టారుగా!"

"మీకో నమస్కారం స్వామీ...పేర్ల గొడవలు వదిలేస్తారా?"

"అరే! పేర్లలోనే అంతా ఉంది. రేపు మనకి కావాల్సింది అదే...ఇంతకీ మన అబ్బాయి పేరు..."

"మీరు ఆలోచించిపెట్టుకోండి. దానికి నన్నడిగేదేమిటి?"

"బాగుంది...నిన్ను కాక మరెవరి నడగడం?...కార్యేషుదాసీ కరణేషుమంత్రీ.. అననే అన్నారు"

"అంటే అననీండి. కాని నన్నేమీ అడగమాకండి"

"ఏం?"

"నాకొద్దు బాబూ ఆ నిష్ఠూరం" అంటూ శశిరేఖ లేచింది పోడానికి.

చెయ్యిపట్టుకుని ఆమెని కూర్చోబెడుతూ, "నిష్ఠూరం?...ఏంటది?" అన్నాడు సుబ్బారావు.

"నేను చెప్పినట్లు మరేదో చేసేశారనీ, దానిమూలంగా తమకీర్తి కేదో అపకారం జరిగిందనీ అందరూ అనుకోడానికి, నాకెందుకిది?" అంది శశిరేఖబలవంతాన కూర్చుంటూ.

శ్రీ ఇచ్ఛాపురపు జగన్నాథరావు

"నీమాటలు నాకు బోధపడడం లేదు శశీ!" అన్నాడు కొంచెం ఆశ్చర్యంగా, బాధగా, సుబ్బారావు.

అతని ముఖంలోని భావాలని చూసి కొంచెం బాధగా శశి, "మీరు మరీ అమాయకులు...ఏం తెలీదు"అన్నది.

"చెప్పుశశీ!...మనవాడిపేరు మనం పెట్టుకోడానికి పైవాళ్ళ నిష్ఠూరంఏమిటి?"

"అదికాదండీ...మీనాన్న పేరు పెట్టుకోవాలని మీ అమ్మ అనుకుంటారు...మా నాన్న పేరు అని ఆయన అనుకుంటారు. ఇంక వెంకట్రాజు తాతయ్యా, సుదర్శనం మామయ్యా, రంగారావు మామయ్యా, వాళ్ల ఆస్తులు కలుపుకుంటాంకదా, వాళ్ళపేర్లెందుకు పెట్టుకోకపోవాలి? అనుకుంటారు."

"నువ్వేం అనుకుంటావు?"

"నేను ఏమీ అనుకోను. వాడు బ్రతికి బాగుండాలికాని ఏపేరైతేనేం?...కాని, నిష్ఠూరం రాకుండాఉంటే చాలునని..."

"ఇంత తతంగం ఉందా శశీ!"

"ఆఁ......అతురాలా ఉందండీ. ఎవరి పేరు పెట్టుకుంటే వాళ్ళని గౌరవించినట్లు గదా! అందుకని ప్రతీవాళ్ళూ తమ పేరే పెట్టుకోవాలని అనుకుంటూంటారు. అందులో మనలా కలిసే ఆస్తులూ అవీ ఉంటే ఇంక చెప్పకోనక్కర్లేదు!"

"నిజమే శశీ...ఇవన్నీ నేను ఆలోచించలేదు. నామకరణం అంటే వెనకాల ఇన్ని ముళ్లు ఉంటాయని నేను కలగనలేదు"

"పాపం! మీకేం తెల్సును!"

"అయితే, వీళ్ళందరిలో ఎవరో ఒకరి పేరు పెట్టక తప్పదన్నమాట!" అన్నాడు సుబ్బారావు.

"ఊఁ...మీరేం అనుకున్నారు?"

"నేను - ప్రకాశరావు పేరు పెట్టుకోవాలని అనుకున్నాను శశీ!"

"ప్రకాశరావు!"

"ఔను శశీ.....వాడింకా అక్కడే, నాకోసం బాధ పడుతున్నాడు. ఆ రాత్రి డ్యూటీ నాది పడింది. తప్పకుండా ఎనిమీ పాట్రల్ కంటాక్ట్ చేస్తానని తెలుసును. నేను తిరిగి వెనక్కి వస్తానన్న ధైర్యం లేక ఆలోచిస్తూంటే—"

"ఔను - చెప్పారు."

"మరోసారి చెప్పనీ శశీ...వాడప్పుడు ఏం చేశాడో తెలుసునా? నా బదులు తను డ్యూటీ వేయించుకున్నాడు. కొద్ది మైళ్ళ దూరంలో ఎనిమీ బ్లాస్టూ, ఆ కాంతి, మెరుపులలాగా, నా రాబోయే తుఫానుకీ సూచనల్లాగా కనిపించసాగాయ్...

"వద్దన్నాను. బలవంతంగా పోయాను. నన్ను రూమ్‌లో ఉంచి తాళంవేసి వెళ్ళిపోయాడు. ఆ క్షణంలో వాడి త్యాగం నాకళ్ళకి కట్టినట్లు కనిపిస్తూంటుంది. నాది ఒక్క ప్రాణం తమ్ముడూ! తెగించి వచ్చాను. వెళ్తాను' అని చెప్పి వెళ్లేడు. పాపం మరికొద్ది గంటల్లో ప్రిజనర్ అయాడు!

"ఎలా మరిచేది శశీ? నా జీవితం వాడి భిక్ష. ఆరాత్రి నేను బయటికి వెళ్లిఉంటే."

వారిస్తూ శశిరేఖ..."ఔను" అన్నది.

"ఈమాత్రం కృతజ్ఞత చూపకపోతే నాకు మనశ్శాంతి ఉండదు శశీ. ఏమనవనీ.. నేను అలా చెసితీరుతాను."

నిశ్శబ్దంగా శశి బయటికి వెళ్లిపోయింది.

* * *

"ఏమమ్మాయ్! కులాసాగా ఉన్నావా?"

శశిరేఖ తండ్రీ తల్లీ అనుకున్నట్లు మెయిల్లోనే వచ్చారు. వాళ్ళకి శశిరేఖ ఒక్కర్తే కూతురు. ఆయన ఇంకా రిటైరు కాకపోడాన్న అప్పుడూ అప్పుడూ వొచ్చి చూసిపోతూంటారు.

"ఆఁ...బాగానే ఉన్నాం నాన్నా.."

"అత్తనేదీ ?"

"ఊళ్లోకి వెళ్ళారల్లేఉంది...వస్తారు."

అంతదాకా అన్నీ బాగానే ఉన్నాయ్. అప్పుడు తల్లి నెమ్మదిగా అసలు విషయం కదుపుతూ: "నాన్న పేరు మార్చకుండా పెట్టిస్తున్నావా ?" అన్నది.

శశిరేఖ ఒక్కసారి తెల్లబోయింది; ఇంత త్వరగా ఈ ప్రశ్న వస్తుందని ఆమె అనుకో లేదు. తల్లి ఆమె ముఖలక్షణాలని గ్రహించ లేదు కాబోలు; సాగించింది;

"మాకుమాత్రం ఎవరున్నారే ? కడుపు చల్లగా వాడిపేరున ఆయనని జ్ఞాపకం ఉంచుకో..."

"దాంతో వేరే చెప్పాలిటే ?" అని సర్దాడు తండ్రి.

"అవును లెండి."

శశిరేఖ ఏమీ సమాధానం ఇవ్వలేదు. ఆ మౌనం అనంగీకారంగా ఆమె చూపింది; అర్థాంగీకారంగా వాళ్ళు తీసుకున్నారు.

ఒకటో ముల్లు గుచ్చుకున్నది.

మర్నాటికి మిగిలినబంధువు లందరూ వచ్చారు. ఇల్లంతా సందడిగాఉన్నది.

ఉదయం సుబ్బారావుని పక్కకి పిలిచి, రంగారావు అన్నాడు: "చూడూ; అబ్బాయి నా పేరు నిలబెడతాడుకనుక వాడిపేర ఓ ఎడ్యుకేషన్ ఎండోమెంటు కడదా మను కుంటున్నాను. ఏకంగా నీ లో తీసికో మంటావు!" అని.

"ఆమాట తరువాత ఆలోచిద్దాంలెండి" అన్నాడు సుబ్బారావు, అవతల నిశ్చయా నికి ఆశ్చర్యపడుతూ.

"అదేమన్న మాటోయ్! ఎవరిధర్మం వాళ్ళు నిర్వర్తించాలి; మనం ఒకరి కొకరు కావలసినవాళ్లంగా !" అని అన్నాడు.

అతని దగ్గరనించి తప్పించుకొనేసరికి తలప్రాణం తోకకివచ్చింది సుబ్బారావుకి. నిజమే - తనకితను కావల్సినవాడు; అభి మానం ఉంది; కాని, ఈ పేరంటం బల వంతం ఏమిటి?

అలా ఆలోచిస్తూనే గది బయటికి వచ్చే సరికి దగ్గుకుంటూ వచ్చి వెంకట్రావు తాతయ్య, "ఇలారా అబ్బాయ్; నీతో కొంచెం మాటలాడాలి" అన్నాడు.

ఆ ఆడబోయే మాటలేవో సుబ్బారావుకి ముందే తెలుసు ; కాని, ఆయనని కాదనే ధైర్యం అతనికిలేదు. వెనకాలనే వెళ్లాడు.

"చూడు సుబ్బారావూ...సాంప్రదాయం కాదంటారా ఎవళ్లైనా ?" అన్నాడు తాతయ్య చెట్టుకి ఆనుకుని నిలువబడుతూ.

"ఎందుకు కాదంటారు తాతా !" అన్నాడు సుబ్బారావు; మరోమాట అన డానికి వీలులేక.

"ఔనౌను...నాకు తెల్సు...నువ్వు



"బాబుగారు—సరీగా నాలుగుసంవత్సరాల క్రిందట ఒక దావా పెద్దది గెల్చుకున్నారు కాదూ ?"

చాలా బుద్ధిమంతుడివి...చిన్నప్పటినించీ నీసంగతే వేరు. అందరిలా కాదు..."

తాతయ్య దగ్గాడు. సుబ్బారావు పడ బోయే పిడుగుకోసం కాసు కూర్చు న్నాడు.

"చూడూ.. వంశంలో పది కాలాలు బాగున్న వాళ్ళూ, పెద్దవాళ్ళని చూసి వాళ్ల పేరు పెట్టుకోవడమూ, వాళ్ళ మాట విన డమూ పూర్వంనించీ వచ్చిన సాంప్రదాయం ...నువ్వు కాదనవనుకో...అయినా పెద్ద వాళ్ళు చెప్పాల్సిన విధి..."

సుబ్బారావు మాట్లాడలేదు. నెమ్మదిగా వెను దిరిగి ఇంటిలోకి వెళ్ళిపోయాడు— తోటలో కూర్చున్న తాత దగ్గు వింటూనే.

బంధు విరోధం

ఒక్కొక్కరి కోరిక - తను పేరు కొడుక్కి పెట్టుకోమని - అతనికి ఒక్కొక్క తాడు లాగా మెడకి బిగుసుకుంటూన్నది.

అయినా పేరులో ఏమున్నది?

ఆ ప్రశ్నని తానే ఎదుర్కొలేకపోయాడు సుబ్బారావు. ఏముందని తాను ప్రకాశరావు పేరు పెట్టుకుందా మనుకున్నాడు? అదొక కృతజ్ఞతా విధానం... పెద్దవాళ్ళ ఉద్దేశంలో అంతే.

ఏ పేరు పెట్టినా బంధువు లందరితోనూ విరోధం వచ్చేలా ఉంది......ఎంతమంది పేర్లు కలిపి పెట్టినా, తన మిత్రుడి మాట ఏమిటి? అతనిని మరిచిపోవడం ఎలాగ?

బహుశా ఈ బారసాల తరవాత వీళ్ళందరికీ తనమీద కోపం వస్తుంది......బంధు విరోధం. ఎందు కొచ్చిన రభస?

ఇస్సురంటూ తల చేతిలో పెట్టుకున్నాడు సుబ్బారావు. శశిరేఖ అక్కడికొస్తూ, "ఎందుకండీ! అలా ఉన్నారు?" అన్నది.

"ఏముంది. పేరు! పేరు—పేరు!!" అన్నాడు సుబ్బారావు.

శశిరేఖ చిన్నగా నవ్వింది..."'నా పేరు' అనండి" అన్నది.

"నేను నవ్వలేను శశీ! తల తిరుగుతోంది" అన్నాడు సుబ్బారావు.

"ఏం అక్కర్లేదు......నిర్విచారంగా కూర్చోండి" అన్నది శశి.

"ఔను......నిర్విచారం!" అన్నాడు సుబ్బారావు వ్యంగ్యంగా.

"కాదండీ - నిజంగానే. అంతా మారిపోతుంది గా! చూస్తూ కూర్చోండి" అన్నది.

"ఎలాగ?" అన్నాడు సుబ్బారావు ఆశగా.

"తెలుస్తుందిగా..."

ఇంతట్లో శశిరేఖని తల్లి పిలుస్తూ వచ్చింది. బలవంతంగానైనా ఆమె ఉద్దేశం తెలుసుకుందామనుకున్న సుబ్బారావుకి అది సాధ్యం కాలేదు.

*　　*　　*

"నమస్కారమండి!"


సుబ్బారావు తలయెత్తి చూశాడు. కొంచెం మాసిన గడ్డమూ, ఎర్రటికన్నులూ, ఎవరబ్బా?

"ఎవర్రోయ్?"

ఠీవిగా అడిగాడు రంగారావు.

"నేను జ్యోతిష విద్వాంసుణ్ని.. కేరళం నుంచి వచ్చాను" అన్నాడు ఆగంతుకుడు.

"అలాగా?"



ఒకరోజున ఒక న్యాయస్థానానికి అతిపొట్టివాడొకడు వచ్చాడు. అతని వెనకాలే ఆరడుగుల ఎత్తు, అందుకు తగ్గలావు వున్న ఒకామె కోర్టు హాలులోకి వచ్చింది.

జడ్జిగారు ఆపొట్టి మనిషిని అడిగాడు "ఆవిడ నీ భార్యయేనా?" అని. ముద్దాయి 'అవున'న్నాడు

"ఆవిడను నువ్వు కొట్టినట్లు ఒప్పుకొంటున్నావా? లేదా?" అని జడ్జిగారు అడిగారు.

"ఒప్పుకొంటున్నా న"ని ముద్దాయి సమాధానం యిచ్చాడు.

జడ్జిగారు, ముద్దాయికి ఏభైరూపాయల జరిమానా విధించారు. జరిమానా చెల్లించి దంపతులిద్దరూ కోర్టుదాటి వెళ్లాక, బెంచిగుమాస్తా జడ్జిగారిని అడిగాడు "పాపం! ఆపొట్టాయన పెళ్లాన్ని కొట్టినందుకు అంత జరిమానా వేశారేం?" అని.

"ఎబ్బే! ఆతడు పెళ్లాన్ని కొట్టినందుకు కాదు; కొట్టానని కోర్టులో దబాయించినందుకు అంత జరిమానా వేశాను. అంతే!" అన్నాడు జడ్జి.

"చిత్తం."

ఆగంతుకుడు అరుగుమీద కూర్చుని గంభీరంగా రంగారావు కళ్లలోకి చూశాడు. ఆ చూపుకి, ఊర్ధ్వకాయుడూ, గంభీరుడూ అయిన రంగారావుకూడా చలించినట్లయింది.

తరువాత అతను చిరునవ్వు నవ్వాడు.

"బాబుగారు - సరిగా నాలుగు సంవత్సరాల క్రిందట ఒక దావా పెద్దది గెల్చుకున్నారు...కాదూ?" అన్నాడు జ్యోతిష్కుడు.

"అవును"

రంగారావు చాలా ఆశ్చర్యపడ్డాడు. స్వతహాగా అతనికి జ్యోతిషంలో నమ్మకం హెచ్చు; అందరికీ అంతే. కాని, ఈ ఆగంతుకుడు క్రమంగా అతని పుట్టుపూర్వోత్తరాలూ అవీ తు, చ, తప్పక చెప్పేసరికి అతని ఆశ్చర్యానికి మేరలేకపోయింది.

"భవిష్యత్తు ఏమైనా చెప్తావా?" అన్నాడు రంగారావు.

ఆగంతుకుడు చిరునవ్వు నవ్వాడు.

"ఇలా ప్రక్కకి దయచెయ్యండి..." అన్నాడు.

కొద్ది నిముషాలయ్యాక రంగారావూ, జ్యోతిష్కుడూ తిరిగివచ్చారు. రంగారావు ముఖం కొంచెం పాలిపోయి ఉంది. కాని, ఆలోచనతో గంభీరంగానే ఉంది.

"ఇదిగో నీపారితోషికం...చాలా ఉపకారం చేశావు" అంటూ రంగారావు అయిదు రూపాయిలనోటు ఒకటి అతనిచేతికి ఇవ్వబోయాడు. కాని జ్యోతిష్కుడు అతనికి నమస్కరిస్తూ, "ఒక్క అర్ధరూపాయి; అంతకన్న ముట్టను" అన్నాడు.

అందరూ విస్తుపోయారు. వెంకట్రాజు తాతయ్య త్వరగా తన చెయ్యి అందించి, "నా చెయ్యిచూడూ!" అన్నాడు.

ఆరోజంతా జ్యోతిష్కునితో గడిచిపోయింది అక్కడి అందరికీ. సుబ్బారావుకి మాత్రం ఏమీ తోచలేదు. శశి అతనికి కనపడనూ లేదు.

"నక్షత్రనామ్నా..."

పురోహితుడు చెప్పిన ప్రకారమూ రాశాడు సుబ్బారావు. ఆ నిముషం దగ్గరకు వస్తూన్న కొద్దీ అతని చెయ్యి వణుకుతూంది. తాను ప్రకాశరావు పేరు కొడుక్కి పెట్టక తప్పదు; బహుశా అందరూ కోపంగా బయటికి నడవకా తప్పదు...

"మాసనామ్నా......"

మరికొంచెం దగ్గరికి వచ్చాడు...వచ్చే కొద్దిక్షణాలలో ఈ బంధువులతో - వాళ్లలోని పెద్దలతో తనకి దెబ్బలాట... తప్పదు. ప్రతివాడూ తన పేరు పెట్టుకుంటారనే ఆశతో ఎదురు చూస్తున్నారు...వీళ్లందరికీ...

"వ్యావహారిక నామ్నా......"

తృళ్లిపడ్డాడు సుబ్బారావు. ఆక్షణం వచ్చేసింది. పోనీ...ఏమైనా సరే...... మిత్రుడ్ని ఎలా మరిచిపోవడం? ఆరాత్రి... దూరంగా ఎనిమీ ఫైర్...తన డ్యూటీ... ప్రకాశరావు...

"ప్రకాశరావు"

గొణిగాడు సుబ్బారావు. అతనికి చెమట పోసింది. అనేశాడు. మరి జరగనీ అనుకున్నాడు.

ముమ్మాటూ ప్రకాశరావు పేరు రాశాడు. తన కొడుక్కి ఆ పేరు పెట్టుకున్నాడు. చాలు. ఏం జరిగినా జరగనీ.

అందరూ ఆశీర్వచనానికి అక్షతలు వేశారు. ఎవ్వరూ బయటికి పోలేదు...అతనికి కొంచెం ఆశ్చర్యం వేసింది.

* * *

అందరూ వెళ్ళిపోయారు సాయంత్రానికి. ఆశ్చర్యం ఏమిటంటే, ఎవ్వరూ నిష్ఠూరం వెయ్యలేదు. తిరిగి ఆ విషయమే స్పృశించలేదు. ఎంతో ఆనందంగా వెళ్ళిపోయారు!

ఇంక సుబ్బారావు ఈ అవ్యక్త కారణాన్ని తెలిసికోకుండా ఉండలేకపోయాడు. ఇందులో ఏదో తప్పుగా జరిగి ఉండాలి...ఏమిటది?

శశిని అడిగాడు.

"ఎందుకూ? అంతా సవ్యంగా జరిగిందిగా?" అన్నది శశి.

"ఆఁ...కాని, ఎలాగ? అని"

"ఏమో!"

"ఛట్...చంపక, చెప్పు."

అతను భరించలేని ఆశ్చర్యంతో బాధపడుతున్నాడు. శశిరేఖకే జాలివేసింది.

"అందరూ తమ పేరు మనవాడికి పెట్టుకోడానికి భయపడ్డారు" అన్నది.

"ఏం??"

"జ్యోతిష్కుడు ఒక్కొక్కళ్ళకీ ఏం చెప్పేడంటే, మీ మనవడికి మీ పేరు పెడితే - మీకు ఆ కీడు తగులుతుందీ; ప్రాణభయం" అని...

"అరె! ఎందుకలా..."

"తెలివి!...ఆ జ్యోతిష్కుడెవళ్లంటారూ?"

"ఎవరూ?"

"మా పెత్తల్లి కొడుకు..నాటకం ఏక్టరు."

"నాటకం ఆడించావన్నమాట..."

"ఆఁ...బంధువిరోధం రాకుండా..."

ఇంతట్లో బారసాలకి రాలేని ఓ తాతయ్య వచ్చిపడ్డాడు. అతను వీళ్లందరూ వెళ్ళిన రైల్లో దిగిఉంటాడు.

"రా తాతయ్యా!" అంటూ ఆహ్వానించారు.

"వస్తాగానీ, నేను మీకేం అపకారం చేశాన్రా?"

"అపకారం?"

"ఆఁ...వాడికి నాపేరెట్టారటగా?... అహఁ...నా ప్రాణంపోతే మీకేం మిగిలిందిరా? నాకు తెలీకుండా...ఒరే... ఎంతవాళ్లురా!"

తెల్లబోయాడు సుబ్బారావు. గోల చేసి చేసి పచ్చి మంచినీళ్లు ముట్టకుండా తిరిగి వెళ్ళాడు.

సుబ్బారావు శశివైపు ప్రశ్నగా చూశాడు. ఆమె తల దించుకుని బయటికి నడిచింది.

'ఒక్క తాతయ్యకన్న చాలామంది తాతయ్యలు ఎక్కువగా?' అనుకుంటూ సుబ్బారావూ లోనికి నడిచాడు. ★

అప శృతి

ట్రాయిలెట్ చేసికొన్న ముఖాలు పాడైనాయి.
వొళ్ళు హూనమైంది.
పెధవ బండి ఒకటే కుదుపులు బాధగా.
అసలు దీంట్లో రాకుండా బస్సుకు వెళ్తే ఎంతో హాయిగా ఉండేది.
గుడ్డలంతా దుమ్ముధూళీ
నీ మీసాలూ నువ్వూ నీ టుముకులబండీ
లంఖణాలబండి
ఏమిటీ కూమా నీగొడవ

నాగొడవేమీ లేదు. నీ మీసాలదే గొడవ.
ఏం!
మీసాలపై నిమ్మకాయను నిలపడం ఔట్ ఆఫ్ డేట్!
ఔట్ ఆఫ్ డేట్.
ఔను యీనాటి ఫాషన్లో మీసాలే అనవసరం.
అనినీ భావన!
కాదు. అప్‌టుడేట్ ఫాషన్ నవనాగరి కులశాసనం.
మరి మీసాలుంటేనో
ఒప్పుకోరు ఏమాత్రం ఒప్పుకోరమ్మాయిలు.
ఆధునికయువతులు పెండ్లిగానిపడుచులు.
ఏమిటయ్యా నీ వెటకారం.

అబ్బాయిలంతా కూర్చొండి.
అరే యిక్కడ కూర్చొబెట్టారేం.
మరెక్కడ్రా
పెండ్లికూతురు రాదూ. హార్మోనియం వాయించదూ.
అదంతా బ్రాహ్మల కోమట్ల యిండ్లలో.
నోరుమూసుకొని కూర్చో
మరి నేనెక్కడ
నువ్వూ అమంచంమీదే మీ అన్న గారితోబాటు తగలడూ
యిదేమిటయ్యా అపశబ్దం
మొదట్నుంచీ ఉండేదే
అరుగో వచ్చేశారు
యికనైనా నోరు మూసుకో,
అమ్మాయిలు వచ్చారు
మలయమారుతం విరిసింది
సంగీతం పాటా వచ్చా .
మా యింట్లో యీ అలవాటు లేదండీ
కానైతే చక్కగాఉన్నా రమ్మాయిలు
ఎంత సౌందర్యం
ఎంత సౌకుమార్యం
వెన్నెల విరిసినట్లే ఉంది.
కలువలు కదిలినట్లున్నాయ్
నవ్వులు పువ్వుల్లాగున్నాయ్
వరహాల మూట
బంగారు బొమ్మ
వజ్రాలరాశి
వయ్యారిభామ
మరి నేనూ పెండ్లికొడుకునైతే
ఎంతబాగుండేది.
ఏమి టాలోచిస్తున్నావ్.
ఆ మీసాలు మెలిపెట్టవద్దయ్యా
ఆ బీడీముక్క పారేయవయ్యా
ఏమిటా పోజు, శుద్ధ బడుద్ధాయిలా
ఎందుకలా గుర్లురుముతావ్
మానర్స్ తెలియవు
అంతా రసాభాస
యిక్కడా నీ గొడవేనా
వుస్. మెల్లిగా మాట్లాడవయ్యా
యిక్కడా రిహార్సల్స్!

యిది నాసుడికారం
ఇది అభ్యాసంలేని మీలాంటి కుర్ర కుంకలభావన
యిక అరవద్దు
ఊరువచ్చేసింది
అదుగో ఆడాబా యిల్లు. అదే పెండ్లిళ్ళు మనం చూడబోయే...
దిగండబ్బాయిలూ తరువాత మాట్లాడు కొందాం.

....

వచ్చారమ్మ వచ్చారు. చూడడానికే వచ్చారు
ఎవరే
పెండ్లికొడుకులే వచ్చారు నిను పెండ్లి చేసికొని పోతారు.
నోర్మూయ్. వాగితే పండ్లూడగొడతా
దిగండి బాబూ దిగండి
అరే బండబ్బాయీ అసామానంతా లోగిట్లో ఉంచు.
ఎండవేడి భరించరాదు
ఎవరే అక్కడా. కాళ్ళు చేతులూ కడుక్కోండి. మిట్టమధ్యాహ్నం
ఎవరక్కడ సుబ్బిగా. ఆమంచం యిక్కడ వాల్చు. మీ అమ్మగారితో చెప్పు వంట త్వరగా...

....

సుఖాంతం

శ్రీ బసిరెడ్డి ఈశ్వరరెడ్డి

ఎలా ప్రవర్తించాలో తెలియదు, పైగా విసుర్లు.

ఎక్కడ పోయినా ఒకటే బాధ
యావజ్జీవం ఘోషిస్తాయి
బీడీముక్క పారేస్తే బాధేమీ లేదు.
మీసాలు మెలివెట్టకుంటే నష్టమేమీ లేదు.

ఏమైనా బాధపడాలి
ఆ మాపుల్లో ఎంత తీపి
ఆ నడకలో ఎంత వయ్యారం
అదృష్టం ఉండాలి
నొసట వ్రాసిఉండాలి

....

ఎందుకలా డాన్సు చేస్తున్నావ్ సిసింద్రీ
మరి తమలాంటి ప్రభువుగారివద్ద డాన్సు చేయకుంటే...
ఎగతాళా
తప్పతప్పు దాసురాలిని క్షమించవలెను.
సరేగానీ కథ ఏమైంది
ఏకథ!
మీ అక్కయ్యగారు మా అన్నయ్యగారిని......
అద్భుతంగా వరించారు
నిజంగా మా అన్నయ్యగారు బాగా లేరూ.
చాలా బాగా ఉన్నారు. మన్మథులు మెచ్చురాళ్లు.
అంటే
అంటే, కొంటే, తింటే, కోతిలాగున్నారు
మరి నేనూ!
కొండముచ్చులాగున్నావు
ఆసి నీ సిగ దరగా! నిన్నేం చేస్తానో చూడు జుట్టు పట్టుకొని...

....

మరేం అమ్మాయిలూ నాదగ్గరా సంకోచమా
ఏం చెప్పమంటావన్నయ్యా
మరేం లేదమ్మా అబ్బాయిలు మీకు నచ్చారా లేదా ?
ఏ అబ్బాయి?
"   " ఆయన ఎలాగున్నాడు.
బాగా ఉన్నాడు. మీసంపై నిమ్మకాయ నిలపవచ్చు
మరి "   " ఆయన?
ఫరవాలేదు. అరచేతితో జాంబవంతునిలా ఆకాశాన్నందుకొంటారు.
యింతేనా మీ అభిప్రాయం
అంతే నన్నయ్యా

....

ఏమైంది మామా అంతా సైటేనా-
కాయా పండా
శికారా బికారా
కాయా లేదు పండూ లేదు



"మీసాలపై నిమ్మకాయను నిలపడం ఔట్ ఆఫ్ డేట్"

వాళ్లొప్పుకొన్నారా లేదా
కథ అడ్డం తిరిగింది. చేసిందంతా నిష్ఫలమైంది.
వాళ్లొప్పుకోలేదా
తధిగిణతోం. నేను ముందే అనుకొన్నాను. అనుకున్నట్లే జరిగింది
నేను బయలుదేరే ముందే అనుకున్నాను
మంచిపనే జరిగిందిలే
ఏమైనా అందగత్తెలు
ఎందుకండీ సౌందర్యం ఆ డాన్సుకత్తెలు సంసారం చేస్తారా
ఏం సౌందర్యమండీ. ఆ బక్కపల్చనమ్మాయ్ గాలికి ఎగిరిపొయ్యేట్లుంది
చిన్నపిల్ల మరిన్నూలం
భగవంతుడు రక్షించాడు తప్పిపోయింది పీడైంది
అంతా మనమేలుకొరకే. అంతా మేలుకొరకే.

ద్రాతుపండ్లు పుల్లన ★

తారతమ్యం

సూర్యం ఇలా చెప్పాడు:

"నేను నా అక్షరాభ్యాసం అయిన రోజుకి ఐదేళ్ళ ఐదు నెలల ఐదు రోజులవాణ్ణి. పరయ్య మేష్టారిచెయ్యి మంచిదని మానాన్న ఆయనను పట్టణానికి రప్పించాడు. ఆయన నాచేత ఓనమాల వరకడి దిద్దించాడు. "నాదగ్గర చదువుకున్న వాళ్ళు తాలూకా తహశీల్దారు లయారు. నువ్వు జిల్లాకలెక్టరవాలి. తెలిసిందా పంతులూ!" అని పరయ్య మేష్టారు నాతో అనటం నాకు బాగా గుర్తు.

మానాన్న అప్పటికీ ఇప్పటికీ తాలూకా గుమాస్తాగా పనిచేస్తూనే ఉన్నాడు. వినా వంశప్రతిష్ఠని నిలబెట్టాలనే దీక్షతో మా నాన్న - పరయ్య మేష్టారికి రానూ పోనూ ఖర్చులక్రింద రూపాయలూ, తాంబూలంలో వరహాతోబాటు పరికొత్త పంచెల చాపు పళ్ళెంమధ్య మడతపెట్టి నాచేత ఇప్పించాడు. ఆయన ఆనందం అప్పటికి నా ఆనందంలాగే ఉండింది. అల్పసంతోషులు వారు. అదేవిధంగా పరయ్య మేష్టారు సంతృప్తిని ముఖంలో, కళ్ళతో ప్రకటించి నన్ను, జిల్లాకలెక్టరు అవమని మరోకసారి దీవించారు.

నన్ను బడికి పంపించారు. అరుగుమీద ఉన్నది ఆ ఆఖరి తరగతి ఆ బడిలో, వీధిని పోయే బండ్లని, సైకిళ్ళని, మిఠాయిబండ్లనీ చూస్తూ మేం అఆలు దిద్దేవాళ్ళం. పలక అరిగినా కాని పదం పలికేదికాదు. మేష్టారు కుముడిలా కొట్టేవాడు. సాయంకాలం అయ్యేసరికి మా అమ్మమ్మ వాతలకి ఏదో వైద్యం చేసేది.

"రోజూ పసిపిల్లవాణ్ణి మేష్టారు కొడుతున్నాడండి. కాస్త మన పిల్లాణ్ణి కొట్టొద్దని చెప్పిరండి" అని మా అమ్మ నాన్నతో చెపుతూండేది.

"మేష్టారికి పిల్లలమీద ముద్దుంటే మొద్దులౌతారు. తన మన తారతమ్యం ఉండకూడదు బడిపంతుళ్ళకి. దెబ్బలు తగులుతూంటేగాని దృష్టి పలకమీద ఉండదు. నీ పిల్లాడేం కరిగిపోడులే" అంటూండేవాడట మానాన్న.

నాకు అరుగుబడి ఎప్పుడు విరగడౌతుందా అని అనిపిస్తూండేది. వీపుమీద పడినచోటే కొత్తిదెబ్బ పడుతుండటంవల్ల వీపు మొద్దుబారింది. దెబ్బల విలువ తగ్గింది. మేష్టారు కొట్టడానికి చెయ్యెత్తితే కొత్తలో ముందుగానే గొంతెత్తేవాళ్ళం. ఇప్పుడు, అంతా కూడబలుక్కున్నట్టు, పంతులు దెబ్బకి పలుకూ ఉలుకూ వినబడకుండా చేశాము.

గుణింతాలు వచ్చాక మేం ఒకటో క్లాసులోకి వచ్చామనిపించింది. కాని, పంతులు మారలేదు. దెబ్బలు మాయలేదు.

"చదువుకున్నవాడి వంటిమీద వెన్న కరుగుతుందిరా నాయనా! చదువంటే అంతవేడి. అందుకే వారం వారం తలంటిపోసుకోవాలి" అంటూండేది మాఅమ్మమ్మ.

"చదువు వేడి కాదే అమ్మమ్మా! దెబ్బల వేడియే వెన్న కరిగిస్తుంది" అనేవాణ్ణి నేను.

"చక్రవర్తి"

ఏడాది గడిచింది. ఎక్కాలు చదవడం ప్రారంభమైంది. ఎక్కాలు గుక్క త్రిప్పకుండా వప్ప చెప్పేవరకూ పంతులు వదిలేవాడు కాదు.

ఆ ఏడు నాకు బాగా జ్ఞాపకం. మానాన్నకి అమలాపురం బదిలీ అయింది. అయిష్టంతోనే నాన్న ఆ ఊరికి వెళ్ళాడుకాని, మమ్మల్ని నాలుగు నెలలపాటు మాఊళ్ళోనే ఉంచేశాడు.

నాన్న లేని కారణంగా నాలో అల్లరి ఎక్కువైంది. నాకు మా మేనమామ గార్డియన్. ఆయన ఉదయమే ఇంటివద్దసంధ్య వార్చుకుని కాఫీ త్రాగి మా వీధికి వచ్చి మమల్ని చూసి కప్పు కాఫీ త్రాగి మరీ వెడుతుండేవాడు.

మా మామయ్య నాకు చాల భీకరంగా కనుపించేవాడు. ఆ దృష్టివల్లే నాలో మార్పు వచ్చింది. బడికి వెళ్ళినా, ఇంటికి వచ్చినా కాని అటుపంతులు, ఇటు మామయ్యా కింకరుల్లా కనుపించేసరికి నాకు అల్లరిఎక్కువైంది. సాయంకాలం మామయ్య రాడు, పంతులూ ఉండడు. నాన్న ఊళ్ళో లేడు. అందుచేత పంజరంలోని పక్షికి స్వేచ్ఛ వచ్చేది. చెల్లెలు, అక్కా కొనుక్కున్న బొమ్మల్ని, అల్లుకున్న ఊలు పటాల్ని ధ్వంసంచేసేవాణ్ణి. నా కిప్పటికీ జ్ఞాపకం; మా అక్కయ్య నాపై కోపంతో "వాడో భస్మాసురుడు" అని పళ్లు బిగించి అంటూ ఉండడం.

తెల్లవారగానే మామయ్య వచ్చి మా ఇంట్లో రెండోసారిగా కాఫీ ఆరగిస్తుండగా అక్కా చెల్లెళ్లు ఐక్యకంఠంతో ఈ భస్మాసురునిపై అభాండాలు చెప్పేవారు. మొదట్లో మామయ్య నాపై హుంకరించాడు. అదేం పనిచేయలేదు. రెండోరోజు వీపుమీద ఒక దెబ్బవేశాడు. అదీ పాత దెబ్బల్లో, సముద్రంలో ఉద్దరిగెడు మంచినీళ్లు కలిసినట్లుగా కలిసిపోయింది. మూడోరోజు మేష్టారితో మంతనాలు సాగించాడు మామయ్య. ఆరోజు సాయంకాలం మామయ్య, అలవాటు తప్పించి మాయింటికి వచ్చాడు.

నేను డాబామీదకు వంగిన సీతాఫలం చెట్టుకొమ్మను లాగి పండ్లకు బుట్టలు కడుతుండగా మామయ్య "ఒరేయ్ సూరిగా!" అని అరిచాడు. మా ఇల్లంతా అతని స్వరం ప్రతిధ్వనించింది.

క్రిందకు దిగి వచ్చాను. మామయ్య నిటారుగా నిలచున్నాడు. అతని కాలుదగ్గర కర్రబండ, చేతిలో గొలుసూ ఉన్నాయి. ఇప్పుడు అతని ఆకృతిని తలచుకుంటే ఇన్స్పెక్టర్ జావెర్ట్‌లా నా కంటికి అతను కనబడతాడు. మధ్యయుగం అనాగరికతకి అతనొక చిహ్నంలా కనుపిస్తాడు.

నన్ను గట్టిగా పట్టుకుని చేతికి గొలుసు కట్టి గుదిబండ తగిలించాడు. ఆనాడు శనివారం కావటంవల్ల ఇంత కఠినశిక్ష నాకు పడింది. ఆరాత్రి ఆగ్రహంవల్ల అన్నం తినలేదు.

ఆదివారం నేను వసారాలో కూర్చున్నాను - బండమీద. పొద్దున్నే మా అమ్మ కాఫీ తెచ్చింది.

"రాత్రి అన్నం కూడా తినలేదు. కాఫీయేనా త్రాగరా నాయనా!" అంది అమ్మ.

"నేను తాగనే... వెధవ కాఫీ... నా కొద్దు" అంటూ కాఫీని ఒలకపోశాను.

"అదేంరా వెర్రితండ్రీ! కొంచెం ఓవల్టీను తాగుతావా?"

"తాగనే... తాగనంటే తాగను"

"నా తండ్రివి కదూ!" అంటూ అమ్మ నన్ను బుజ్జగిస్తూ ఇటూఅటూ చూసి ఎవరూ లేరని గ్రహించి నా చేతిలో పావలా కాసు పెట్టి రహస్యంగా 'దాచుకో. రేపే మన్నా కొనుక్కు తిను. లేకపోతే బైస్కోపు చూడు" అంది.

"నా కొద్దే నీ వెధవ పావలా!"

"అరవకురా...ఏం కావాలో చెప్పు."

"రూపాయి కావాలే......కాన్వాస్ జోళ్ళు కొనుక్కుంటా" అన్నాను.

"సరే...ఇస్తాలే...కాఫీ తాగుతావా?"

"ఊఁ."

ఆ ఆదివారాన్ని మాత్రం నేను నాజీవితం లో మరువలేను. ఉదయమే మామయ్యవచ్చి రెండోసారి కాఫీ ఆరగిస్తూ నన్ను పరామర్శించి వెళ్ళాడు.

"బుల్ డాగ్ లా పెట్టావేంరా ముఖం" అన్నాడు నవ్వుతూ మామయ్య.

"అదేమిట్రా అన్నయ్యా, అల్లుడికి బండ శిక్షే కాకుండా పేర్లు పెడుతున్నావేంరా" అన్నది మా అమ్మ.

ఆమె అన్నమాటలకు మామయ్య జవాబు చెప్పలేదు. నన్నోసారి పరిశీలించి వెళ్ళిపోయాడు.

రూపాయి బిళ్ళ జేబులో పడింది. అమ్మ అన్నం తినిపించింది. కడుపునిండా తిన్నాను. చెల్లీ, అక్కయ్యా అన్నాలు తిని వసారాలో నాకు ఎదురుగా కూచున్నారు. అక్కయ్య ఊలుతో బొమ్మలు అల్లుతోంది. చెల్లి కొత్త ఆట బొమ్మని అలంకస్తూంది.

అక్కయ్య అల్లుతున్న బొమ్మని చెల్లెలు విమర్శగా చూసి చూసి నా వైపు చూసి నవ్వింది.

"ఎందుకే నవ్వుతావు భడవా" అని కసిరాను.

"నీబొమ్మే అల్లుతోందిరా అక్క" అంది నవ్వుతూ చెల్లి.

"ఆ కోతిబొమ్మ కాదే ఇది కృష్ణుడిబొమ్మ. రోలుకి కట్టింది కృష్ణుణ్ణి వాళ్ళమ్మ, ఈడ్చుకుంటూ తాటిచెట్లవద్దకు వచ్చాట్ట కృష్ణుడు. ఆ బొమ్మ" ఇది అన్నది అక్కయ్య.

"ఐతే అన్నయ్య కూడా కృష్ణుడేనే" అంది చెల్లి.

"ఛా, ఫో, నోర్ముయ్" అన్నాను నేను.

"ఎందుకురా దానిని అలాకసురుతావ్?" అంది అక్క.

"నేను దగ్గిరికి రాలేనని ఏవో కూతలు కూస్తోందిచూడు...రేపు నీబొమ్మని పీకిపీకి పారెయ్యకపోతే చూడు" అన్నాను.

"నీకుదిబండ ఊడితేకదా!" అంది అక్కయ్య.

"బళ్ళోకెలా వెడతాడే అన్నయ్య?"



"బుల్ డాగ్ లా పెట్టేవేం రా ముఖం"

"వీపుమీద బండపెట్టుకుని పోతాడే" అంది అక్కయ్య నవ్వుతూ.

"నవ్వకండి, మీకుకూడా బండలు వేయిస్తా" అన్నా.

"మేం చదువుకోంగా" అంది అక్కయ్య.

"అల్లరి చెయ్యంగా" అంది చెల్లి.

"చదువురాని చవటలు మీరు" అన్నా కోపంగా ఏదీ గతి లేక.

"చవట, గివట అనకు ఒరేయ్" అంది అక్కయ్య.

"ఏం చేస్తావేం?"

"అమ్మా చూడవే వీణ్ణి...తిడుతున్నాడూ..." అని కేకేసింది అక్కయ్య.

"ఏమిట్రా అల్లరి...పెళ్ళీడు పిల్లని తిట్టొచ్చా..." అంటూ వచ్చింది అమ్మ.

"అమ్మా! వీళ్ళనికూడా రేపట్నుంచి బడికి పంపించవే."

"వాళ్ళకెందుకురా చదువు?"

"ఏం నాకేనా చదువు?"

"ఔను...నువ్వు మగాడివి...ఉద్యోగం చెయ్యొద్దూ...వాళ్ళకి ఎందుకు చదువు? చాకలిపద్దు చాతనౌతే చాలు."

"అలా కాదే అమ్మా వీళ్ళనికూడా రేపట్నుంచి బడికి పంపించు...ఊఁ...ఊఁ...

★ తారతమ్యం ★

బండ వేయిస్తాను వాళ్ళ మేష్టారితో చెప్పి" అన్నాను.

"నీ ఏడుపు అది...నీకు పడిందికదా బండ...మాకెందుకు పడలేదని. మేం బడికి వెళ్ళక్కర్లేదోయ్ వెర్రి తమ్ముడూ!" అంది అక్కయ్య నవ్వుతూ.

"ఔనౌనోయ్" అంది చెల్లి చంకలు చరుచుకుంటూ.

"అమ్మా! చూడవే వీళ్లనీ.." అన్నాను.

"ఒసేయ్ మీరు ఊరుకోండి పుణ్యం ఉంటుంది" అంటూ అమ్మ వెళ్ళిపోయింది.

రెండు నిమిషాలసేపు మౌనం వహించాము అంతా.

అక్కయ్య తాను అల్లుతున్న బొమ్మని చెల్లికి చూపిస్తూ "ఈ కిష్టుడికి బలే శిక్ష పడింది లేవే...అల్లరి పిల్లలలికి అలాగే శాస్తి జరగాలి" అంది.

నాకు అరికాలిమంట నెత్తికెక్కింది.

"నాన్న రానీయండి......కంసుణ్ణీ, ఈ రాధల్ని చంపేస్తాను" అన్నాను.

"కంసు డెవరే అక్కయ్యా!" అంది చెల్లి.

"మామయ్యో"

"రాధ లెవరే?"

"మనమే నే!"

"నా పేరు, నీ పేరు రాధలు కాదుగా" అంది చెల్లి.

"వాడి చదువు అలా వెలిగిపోతోంది" అంది అక్కయ్య.

కోపంతో లేచాను. బండ నెత్తబోయాను. ఆడపిల్ల లిద్దరూ అదృశ్యమయారు.

సోమవారం ఉదయం మామయ్యని ఒప్పించి అమ్మ నాకు శిక్షను సడలించింది. ఆ సాయంకాలమే నేను కాన్వాస్ జోడు కొనుక్కోగా బేడ మిగిలింది. "లంకాదహనం" సినిమాకు వెళ్ళాను. అణా మిగిలితే ఒక సోడా తాగి అర్ధణా పకోడీలు తిని ఒక డబ్బుతో ఇంటికి రాత్రి చేరాను.

మా అమ్మ నా రాకకోసం ఎదురు చూస్తోంది. నేనేం కోపగించుకుని అఘాయిత్యం చేస్తానో అని ఆమె బెంగపెట్టుకుంది. నాన్న ఆనాడే శెలవు పెట్టి మమ్మల్ని చూడటానికి వచ్చాడు. నాన్నకు నా విషయమంతా అమ్మ చెప్పినట్లుంది. ఇద్దరూ వీధి అరుగుమీద కూర్చున్నారు.

నాకు చాల ఆకస్మికంగా నాన్న కనపించడంతోటే "నాన్నా! నాకేం తెచ్చావ్?" అన్నా – చనువుగా.

చాలరోజులు నాన్న నాకు దూరంగా ఉండటంవల్ల నాలో ఈ చనువు అప్రయత్నంగా వచ్చింది.

"కోటయ్య కాజాలు తెచ్చాన్రా" అంటూ నన్ను దగ్గరకు తీసుకున్నాడు నాన్న.

"నాన్నా......మామయ్య మంచివాడు కాదు..." అని గునుస్తూ అన్నాను.

"అమ్మ చెప్పిందిలే అంతా......ఔను గాని...అక్కనీ చెల్లినీ నేను లేనప్పుడు కొట్టి తిట్టి అల్లరిపెట్టవచ్చా? తప్పుకదూ!" అన్నాడు నాన్న.

"నిజం నాన్నా!" అన్నాను.

రాతిబండ అఘాయిత్యానికీ, రాళ్ళను కరిగించే ఆప్యాయతకీ తారతమ్యం తెలుసుకున్నాను. ★



ఒకనాడు ఆయన్ని, ఆయన పెళ్లాం సంతకెళ్లి ఆవకాయల జాడీలు కొనుక్కు రమ్మంది. ఆయన ఒక కొట్లోకి వెళ్లాడు. అక్కడ జాడీలు తలక్రిందులుగా పేర్చి పెట్టివున్నాయి. ఒకజాడీ పైభాగాన్ని తడిమి "అరె! దీనికి మూతిలేదే" అనుకొనాడు. ఇంకోదాన్ని పైకెత్తి అడుగు తడిమి "చిత్రం! దీనికి అడుగుకూడా లేదు" అనుకొన్నాడు.

—శ్రీ పి. సీతారామయ్య (మద్రాసు)

(సీరియల్ నవల)

సత్యత

శ్రీ పినిశెట్టి శ్రీరామమూర్తి

24

రవి అరెష్టు చాలా ఆశ్చర్యంగా జరిగింది. రవి ఉద్రిక్తంగా రావడం చూసిన జమీందారు గది యివతలనుండి వాళ్ళ సంభాషణలు కొంతవరకూ విన్నాడు. వారిరువురమధ్యకూ వస్తే; విషయం ఏవిధంగా అడ్డంగా తిరుగుతుందో ఊహించాడు. పైగా వాళ్ళ ఉభయులు ఏమాతారో తెలుసుకున్న జమీందారు తిన్నగా ఫోనుదగ్గరకు వెళ్ళి, అపాయపరిస్థితి అనీ, ద్రోహులు దౌర్జన్యంగా యింట్లో ప్రవేశించారనీ, ఆందోళనకరంగా పోలీసు స్టేషనుకు ఫోను చేశాడు.

రాము కుర్చీలోపడిన చాలా సేపటివరకూ స్పృహలోకి రాలేకపోయాడు. రవి కాస్సేపు నిశ్శబ్దంగా చూశాడు. రాము మళ్ళీ కదలలేదు. రవిలో కక్షు తిరుగుమొగం పట్టలేదు. తిరిగి హాలులోకి వచ్చాడు. హాల్లో ఎవరూ లేరు. అటు యిటూ కాస్సేపు కర్తవ్యం గురించి ఆలోచిస్తూ పచారుచేశాడు. గడియారం గంటలు కొట్టడం ప్రారంభించింది. సరిగ్గా తొమ్మిదయింది. రవికి పెళ్లి గుర్తుకు వచ్చింది. తిన్నగా కాంపౌండులోకి వచ్చి, క్రింద పడిన సైకిల్ తీశాడు. గేటు ముందు పోలీసు లారీ వచ్చి ఆగింది.

కారు ధ్వని విన్న జమీందారు మిద్దె దిగి క్రిందకు వచ్చి, నేరస్తుడుగా రవిని చూపించాడు. దానికి సాక్ష్యంగా నిస్సత్తువగా కుర్చీలో పడిఉన్న రామును చూపించి అరెష్టు చేయించాడు.

పలుకుబడిలోఉన్న గంగాధరం పలుకు, ప్రత్యక్ష సాక్ష్యంతో సహా పోలీసువారి దృష్టిలో విలువ పొందింది. రవిని సంకెళ్లు వేసి లారీ ఎక్కించిన తర్వాత ఉన్నతోద్యోగి జమీందారుకు వందనం అర్పించి లారీని నడిపించాడు.

జమీందారు సంతుష్టిగా నవ్వి మల్లయ్యను పిలచి, సైకిలుతోబాటు ఈ శుభవార్తను ధర్మయ్యకు అందజేయమన్నట్లుగా చెప్పి రాము గదిలోకి వెళ్ళాడు.

అప్పుడే పార్వతమ్మ తీసుకవచ్చిన మంచి నీళ్ళు తాగి రాము మామూలుగా కూర్చొని ఉన్నాడు.

"దెబ్బ తగిలిందా" వచ్చిన జమిందారు సరళంగా ప్రశ్నించాడు.

రాము కుర్చీమీదనుంచి లేచి "లేదు" అంటూ వెళ్ళి మంచంమీద పడుకోబోతూ, మళ్ళీ ఏదో గుర్తుకు వచ్చినవాడిలా కూర్చొని "రవి ఏడి" అని అడిగాడు.

"ఎందుకూ?" జమిందారు తిరిగి ప్రశ్నించాడు.

"అబ్బే!" అంటూ మంచంమీద పడుకొని, "క్షమాపణ కోరుకుందామని" అంటూ అటు తిరిగి పడుకున్నాడు.

ఈ వార్త విన్న వెంటనే కృంగిపోయి మంచం పట్టిన ధర్మయ్య మళ్ళీ లేవలేదు. ధర్మయ్యకు జ్వరతీవ్రతవల్ల మనస్సు స్థిమితంగా లేక, పెళ్ళిలో జరిగిన సంగతులు గురించే సర్వదా గొణుక్కుంటున్నాడు.

మూడవరోజున శాంతమ్మ కబురు విని వచ్చిన వైద్యుడు ధర్మయ్యను పరీక్షచేసిన మీదట, శాంతమ్మను ఆశ్చర్యంగా చూస్తూ "ఇంత ముంచుకు వచ్చేవరకూ ఏంచేశారు" అని ప్రశ్నించాడు.

శాంతమ్మ ఏమి సమాధానం చెబుతుంది. కాస్సేపు అగమ్యంగా చూసి "జబ్బేమిటంటారూ?" అని ఆందోళనగా అడిగింది.

"సన్నిపాత జ్వరం."

శాంతమ్మ ఒక్కసారి కంపించింది. ఆ జ్వరం ఎంత భయంకరమైందో, భర్త బ్రతికుండగా ఆయన నోటినుండి చాలాసార్లు వింది.

"నేను కొన్ని మాత్రలు పంపిస్తాను. రెండు గంటలకోసారి అల్లపు రసం అనుపానంతో వేయండి. ఆపైన భగవంతుని దయ" అని ఆయుర్వేద వైద్యుడు తిరుగుమొగం పట్టాడు.

తండ్రి మంచం దగ్గరగా తలవంచుక కూర్చున్న లక్ష్మి కూడా ఈమాటలు వింది. బరువుగా ఒక్కసారి నిట్టూర్చింది. ఈ మూడు రోజులనుంచీ ఆమె పచ్చి మంచి నీళ్ళు కూడా నోట్లో పోసుకొని ఎరుగదు. శాంతమ్మ ఆమె నిరాహారదీక్షకు చాలా వ్యధ పడింది. రెండు మూడుసార్లు ఆమెను భోజనం చేయవలసిందిగా ప్రాధేయ పడింది. కాని శాంతమ్మ మాటను లక్ష్మి ఏ విధంగానూ మన్నించలేకపోయింది.

వైద్యుడు పంపించిన మందు ఆయన చెప్పినట్లుగానే ఉపయోగిస్తోంది. కాని ఏ విధమైన ఉపశాంతీ లేదు. ఈరోజు ఆ పరాకు మాటలు కూడా లేవు గొంతులో గురక ప్రారంభించింది. ఈలక్షణాలు గుర్తించిన శాంతమ్మ భయకంపితురాలైంది. ఏమి చేయడానికీ ఆమె మనస్సు పాలుపోలేదు. ఈ సమయంలో మగబిడ్డ ఆధారంగావుంటే; అనేక విధాల ఆమెకు ధైర్యంగా ఉండేది. రవిమీదకు ఆమె దృష్టిపోయింది. ఈనాలుగురోజుల్లో రవిగురించి ఏవిధమైన సంగతులూ శాంతమ్మకు తెలియలేదు. ఈ విపరీత విపత్కర పరిస్థితుల్లో కొంపలో కదలకుండా కూర్చోడం ఏవిధంగానూ శాంతమ్మకు శాంతి నివ్వలేకపోయింది.

తండ్రికాళ్లదగ్గర్నే అహోరాత్రాలూ నిరాశపూరితంగా, ఉదాసీనంగా కూర్చున్న లక్ష్మిదగ్గరకు శాంతమ్మ వచ్చింది. ధర్మయ్య గురక మరీ హెచ్చుగావుంది.

"లక్ష్మి నేను వెంటనే వస్తాను, అమందు వేస్తూవుండు" అంది. లక్ష్మి బలహీనంగా తలపంకించింది. కాని ఎక్కడకని కూడా ఆమె అడగలేదు. సూర్యాస్తమాన సమయంలో శాంతమ్మ యిల్లు విడచింది.

హాలులో చుట్టకాలుస్తూ కూర్చున్న జమిందారు, అప్పుడే వెలిగిన లైట్ల వెలు

★ దత్తత ★

గుల్లో తెల్లటి ముసుగుతో గుమ్మం ఎక్కుతున్న శాంతమ్మను రాశాడు. జమిందారు పలకరింపుకోసం శాంతమ్మ కొన్నేపు నిలబడి చూసింది. గుర్తించి కూడా జమిందారు పలుకరించ లేదు. శాంతమ్మే ధైర్యంచేసుకొని హాలులోకి వెళ్ళింది.

"ఎందుకొచ్చారు?"

ఇదివరలో రాము చిన్నతనాన, శాంతమ్మపై ఈలాంటిప్రశ్నే విసిరాడు. కాని అప్పుడు ఆమాటలో ఇంత ఈర్ష్య, ఈలాంటి కఠినత ఆమెకు స్ఫురించలేదు.

"మా రవిని జైల్లో పెట్టించడానికి కారణం?"

"నేరంచేసినందువల్ల"

"ఏమిటా నేరం?"

"అది ప్రభుత్వానికి నివేదించవలసిన విషయం"

"తల్లినైన నేను వినకూడని పాప మేం చేశాను" అంది శాంతమ్మ. ఆమెకంఠంలో అణచుకుంటోన్న ఆవేశం సూచనా ప్రాయంగా ధ్వనించింది.

జమిందారు నవ్వి "తండ్రిఉంటే తప్పకుండా చెప్పేవాడినే, ఆడవాళ్ళు విని బాధపడ్డం తప్ప మీవల్ల ఏం కాదు" అన్నాడు. శాంతమ్మ కొన్నేపు నిశ్శబ్దంగా వుంది. తరువాత ఆనిశ్శబ్దాన్ని చీల్చే బరువైన చిట్టూర్పు విడచింది.

"అపాయ పరిస్థితుల్లో మిమ్మలను ఒక కోరిక కోరడానికి వచ్చాను" అని మెల్లగా అంది.

"ఏమిటది?"

"లక్ష్మిపెళ్ళి ఆగిపోయింది"

ఈసంగతి జమిందారుకు పెళ్లినాటి రాత్రే తెలిసింది. ఆగి పోయిన కారణం కూడా తెలుసు 'ఎందు కాగింది?' అని ప్రశ్నిస్తే ఆ సమాధానం ఎంత సూటిగా-ఘాటుగావస్తుందో గంగాధరానికి తెలుసు, అందుచేతనే ఆమాటకు వివిధమైన సమాధానంగాని, సానుభూతిగాని తెలుపలేకపోయాడు.

"మా అన్నయ్యకు సంధి"

"ఆ లాగా" మెల్లగా అన్నాడు జమిందారు.

"లక్ష్మిపరిస్థితి కూడా ఏమీ బావుండ లేదు"

"ఏమీ?"

జమిందారుకు ఈ ప్రశ్న వేయడానికి నోరెలావచ్చిందా అని శాంతమ్మ మనస్సు అనుకుంది. అయినా శాంతమ్మ స్వాంతాన్ని అదుపులోనే పెట్టుకొని "ఆరోజునుంచి అన్నాహారాలు లేవు" అంది.

"సరే! నన్నిప్పుడేం చేయమన్నారు?" విసుగ్గా అడిగాడు.

"రవిని విడుదల చేయిస్తే..."

"వీలుకాని పని"

"మీరుతలుచుకుంటే..."

"నావల్లకాదు" విసురుగా కుర్చీ మీదనుంచి లేచాడు జమిందారు. శాంతమ్మకేసి తీక్షణంగా చూశాడు" తప్పునకు శిక్షలేకపోతే ఒప్పనేది ప్రపంచంలో ఏనాడో మాసిపోయేది...శాంతమ్మగారూ! ఎంతమంది పైకి మీ అబ్బాయిని దౌర్జన్యంగా పంపిస్తారు?"

ఈ మాటతో శాంతమ్మలో శాంతం సన్నగిలింది. ఈ వాక్యంలో ఏలాంటి విష

పూరిత అసత్యం నిండిఉందో గ్రహించింది. జమిందారు అంతటితో ఊరుకోలేదు. "ఎంతకాలం పరుల సొమ్ములతో జీవించాలని కోరతారు."

"ఆగండి!" శాంతమ్మ కంఠధ్వనిలో ఎంత శక్తిఉందో ఏలాంటి తీక్షణతఉందో జమిందారు యిప్పుడే గ్రహించాడు. దేదీప్యంగా ప్రజ్వరిల్లుతోన్న ఏదోకాంతి, ఆమె కళ్లల్లో, లైటువెలుగులద్వారా ప్రస్ఫుటంగా ప్రతిబింబించడం చూడగలిగాడు.

జమిందారు మనస్సుపై, ఎవరో చరచినట్లుగా, విచిత్రానుభూతికూడా పొందాడు. విహ్వలుడుగా నిలబడి, విచిత్రంగా శాంతమ్మకేసి చూస్తున్నాడు.

"న్యాయంగా మాట్లాడ్డం మరచిపోతున్నారు...ఎవరిపైకి ఎవరు దౌర్జన్యంగా పంపారు? ఎవరిసొమ్ము ఎవరు అక్రమంగా తిని జీవిస్తున్నారు..." ఈ మాటనేవరకూ ఆమె కంఠం బింకొన్ని వీడలేదు. కాని వెంటనే ఆమె కళ్ళల్లో నీటిపొరలు అలుముకున్నాయి కంఠం గద్గదికమైంది. ఉద్రిక్తంగా - హెచ్చుతగ్గుల స్థాయిలోవచ్చే స్వరంతో ఈలా అడిగింది" "మీరే దౌర్జన్యంగా నా బిడ్డను జైలుకు పంపించారు. అన్యాయంగా అన్నయ్యకు డబ్బు ఆశపెట్టి, లేని కల్యాణాన్ని కల్పించి, డబ్బు ఇవ్వక దగాచేసి, ఆ పిల్ల జీవితాన్ని ఎందుకూ గాకుండా చేశారు... అన్నయ్య అవసాన కాలానికి దారి చూపించారు."

"శాంతమ్మా" ఇక నిగ్రహించుకోలేని కోపంతో బిగ్గరగా అరచాడు. హాలంతా ప్రతిధ్వనించింది. ప్రక్కగాఉన్న గది తలుపుకూడా కొస్త కదిలినట్లుగా కనిపించింది. స్తంభాలమాటున దాగిన నౌకర్లుకూడా ఒకసారి తల ఎదుటకువంచి భయంగా చూశారు. పార్వతమ్మ మిద్దె మీదనే మెట్లు దగ్గరగావచ్చి నిలబడి ఆత్రంగా చూస్తోంది.

అయితే చమ్మగిల్లిన కళ్ళతో చూస్తున్న శాంతమ్మను ఈ ధ్వని ఏ విధంగానూ భయకంపితం చేయలేదు.

"వెళ్ళిపొండి" ఆ వేశంలో వచ్చిన ఆయాసంద్వారా, కంపించే వేలును గుమ్మం వైపు చూపుతూ మెల్లగానే అన్నాడు జమిందారు.

"వెళ్ళను."

"సరే!" ఏమాలోచించాడో, తల నొక్క సారి పంకించి, గిరుక్కున వెనక్కు తిరిగాడు జమిందారు, తొందరగా మేడమెట్లు ఎక్కుతున్నాడు.

ఈ పరిస్థితిలో శాంతమ్మకు ఏమి చేయాలో తోచలేదు. క్షణంపు వెనక్కు తిరిగిన జమిందారుని చూస్తూ వుండిపోయింది. అలా నిలబడ్డంవల్ల వచ్చే ప్రతిఫలం ఏమీలేదని తెలుసుకుంది. సిగ్గుపడ్డం కూడా ఈ స్థితిలో ఏలాంటి కార్యభగ్నాన్ని కలిగిస్తుందో తెలుసుకుంది. తొందరగా జమిందారు ననుసరించే మేడమెట్లు ఎక్కింది.

పదిమెట్లు ఎక్కినతర్వాత, శాంతమ్మ వచ్చే అలికిడి విని జమిందారు ఆగి శాంతమ్మ వైపు తిరిగాడు. క్రోధావేశాలతో నిండిన మొగంతో శాంతమ్మకేసి ఎర్రగా చూశాడు.

"మా రవిని రక్షించండి" అంది శాంతమ్మ.

"ఇప్పుడేం ప్రాణాపాయం లేదుగా."

"అబ్బాయికి లేదని నాకు తెలుసు, కాని వాడు లేకపోవడంవల్ల కొందరికి ప్రాణాపాయం కలిగే స్థితి వచ్చింది...వాణ్ని విడుదల చేయించండి."

జమిందారు ఉగ్రుడయ్యాడు. కళ్లు పెద్దవి చేశాడు. ఒక మెట్టు శాంతమ్మమీద ఉరుకుతున్నంత వడిగా దిగాడు. కంఠాన్ని కూడా హెచ్చుచేసి "వీలులేదని చెప్పాను...బిడ్డకు తగిలిన తల్లిలాగునే నీ చర్య కూడా నీచంగా కనిపిస్తోంది. దీనికికూడా శిక్ష అనుభవిస్తావ్" అంటూ మరోమెట్టు దిగి "ఛా!" అన్నాడు.

శాంతమ్మ కంగారుపడింది. జమిందారు మీదికి వచ్చేంత దగ్గిరగావచ్చాడు. వెనక్కి అడుగువేయడంలో కాలు తేలిపోయింది. శాంతమ్మ మెట్ల మీద నుంచి దొర్లుకుంటూ వచ్చి చావిట్లో పడిపోయింది.

జమిందారు ఆదృశ్యంచూసి ఎర్రబడిన మొగంతో భయంకరంగా నవ్వాడు. మేడమెట్లు పైకి వెళ్లి పార్వతమ్మను చూసి "బైటకు పంపించి గేటుతాళంవేయించు" అని చెప్పి లోపలకు వెళ్ళిపోయాడు.

రాము ఎప్పుడు వచ్చి శాంతమ్మ దగ్గరగా కూర్చున్నాడో, ఆత్రంగా దిగివచ్చిన పార్వతమ్మకు తెలీదు.

శాంతమ్మ క్రిందపడిన వెంటనే స్పృహ తప్పలేదు. కాని నుదుట చిన్నగాయం తగిలి రక్తం స్రవిస్తోంది. మెల్లగా లేచి కూర్చొని చైతన్య విహీనంగా మేడమెట్లు కేసి చూస్తోంది.

జమిందారు కంఠధ్వనికి చల్లా చదురై మూలదాగిన నౌకర్లుకూడా శాంతమ్మదగ్గరగావచ్చి నిలచారు.

"కాసిన్ని నీళ్లు గుడ్డా తీసుకరా" అని దాసీ సుబ్బులుతో చెప్పి క్రోధావేశాలతో నిండిన రాము మొగంకేసి చూస్తూ "పొరపాటు చేసింది" అని మెల్లగా అంది పార్వతమ్మ.

రాము పార్వతమ్మ మొగంకేసి తీక్షణంగా చూశాడు.

భర్తలోపాల్ని కూడా మధ్యపెట్టి, మంచి

★ దత్తత ★

వాళ్ళే నేరస్థులుగా చిత్రించడానికి సాహసించే పతిభక్తి, పవిత్రమైందిగా ఎవరైనా భావించినా పతివ్రత అనే పదాన్ని చౌర్యంచేయడానికి చేసే స్వార్థపూరిత కృషి తప్ప ఇందులో న్యాయార్జితం లేదని రాము అనుకున్నాడు. "మనిషి తత్వం తెలుసున్నప్పుడు కొస్త జాగ్రత్తగా మెలగాలి" శాంతమ్మ నుదుటను స్రవించబోతున్న రక్తాన్ని చూస్తూ పార్వతమ్మ అంది.

అగమ్యంగా శాంతమ్మ, పార్వతమ్మకేసి చూసింది. రాము బరువుగా నిట్టూర్చాడు. పార్వతమ్మ అటు చూసింది.

"మనిషిని మనిషిగానే చూసి మాట్లాడిందిగాని, మనుష్యుల్లో జంతువులు కూడా దాక్కునుంటాయని ఈమెకు తెలీదు" అన్నాడు రాము.

"ఏమిటన్నావ్?" కొస్త ఎర్రగా రాముని చూస్తూ ప్రశ్నించింది పార్వతమ్మ.

రాము లేచి హాలులోనే ఓ ప్రక్కగా ఉన్న బీరువా తెరచి అయిడెన్ బాటిల్, దూదీతీసుకవచ్చాడు.

సుబ్బులు గుడ్డా నీళ్లూ తీసుకవచ్చింది. ఆపత్తులో కూడా కొంత ఆచారానికి ప్రాధాన్యత యిస్తున్న పార్వతమ్మను చూసిన రాము "తప్పుకోమ్మా" అన్నాడు నమ్రతగా.

పార్వతమ్మ అలాగే చేసింది. రాము శాంతమ్మ నుదుటిపై రక్తాన్ని దూదితో తుడిచి, అయిడెన్‌తో ముంచిన దూది గాయంపై నుంచాడు.

ఆమె ఏమాత్రం బాధపడినట్లుగా రాముగుర్తించలేక పోయాడు.

కాని పార్వతమ్మ అయిడెన్ ద్వారా కలిగేమంట ఆమె అనుభవించక పోయినా బాధగా కళ్లొకసారి చిట్లించింది.

సున్నితమైన స్త్రీ శరీరం సుఖంగా పెరిగేరోజుల్లో స్వల్పగాయాన్నైనా గాకుండా గాయపడిన వాళ్ళ బాధను కూడా చూసి సహించలేదు. గంపంతచేసుక బాధపడ్డంకూడా సహజం. కాని కాలం కలిగించిన కష్టాల్లో, తిండిలేక శోషిల్లుతూన్నా, తూట్లుపడి శరీరాన్నుండి రక్తం స్రవిస్తున్నా ఆస్త్రీమూర్తే నిర్లక్ష్యంగా నిస్సత్తువుగా నవ్వుతుంది.

ఇదే ఆలోచిస్తూ రాము దాసీయిచ్చిన గుడ్డతో మెల్లగా శాంతమ్మ తలకు కట్టు కట్టాడు.

రాము మల్లయ్యకేసి చూశాడు. "కారు 'కీ' తీసుకరా" అన్నాడు.

మల్లయ్య పైకి వెళ్ళాడు.

పార్వతమ్మ నెమ్మదిగాలేచి పదిలంగా మేడమెట్లు ఎక్కబోతోంది.

వెనకనించి "అమ్మా" అని పిలచాడు రాము పార్వతమ్మ అక్కడే నిలబడి రాముకేసి చూసింది.

"నేనుచేసిన తప్పునకు రవి నాకు శిక్ష యిచ్చాడు. దానిగురించి బాధ గలిగిన నాకు బాధ్యతుందిగాని, రవిని అరెస్టు చేయించడానికి నాన్నగారికేం అవసరం?" అని అడిగాడు.

"గట్టిగా అరవకు" అంటూ పార్వతమ్మ చెక్కిళ్ళునొక్కుకొని, రాముదగ్గరగావచ్చి ఈలా అంది" అవసరా నవసరాలు నీకన్నా వారికే ఎక్కువ తెలుసు...తప్పుచేసినవాళ్లు తప్పక శిక్ష అనుభవించాలనే సంగతి ఆయన కెప్పుడూ గుర్తు ఉంటుంది"

శాంతమ్మ ఇక కూర్చోలేక మెల్లగా లేచింది. రాము కూడా లేచాడు. పార్వతమ్మమాటకు నవ్వబోయాడు. కాని నవ్వు పెగల్లేదు. "గుర్తుంటే మంచిదే; అయితే నువ్వు చెప్పినట్లు ఈతప్పుకు కూడా శిక్షన ఉంటుందిగా?" అని పార్వతమ్మకేసి చూశాడు...తాను విడిచిన సంభాషితం తన నోటికే తాళం వేస్తుందని ముందు ఆమె అనుకోలేకపోయింది.

మల్లయ్య తాళం చెవి తీసుకవచ్చి రాము చేతులో పెట్టాడు.

రాము కొస్త కుంటుతూ నడవబోతున్న శాంతమ్మ దగ్గరగా వచ్చి "నేను సాయముంటానమ్మా" అంటూ ప్రక్కగా నిలచి చేయి చాపబోయాడు.

"వద్దు బాబూ" గద్గదికంగా అని పట్టు బలవంతాన నిదానంగానే నడుస్తూ, కళ్ళు ఒక్కసారి తుడుచుకొని గుమ్మం దాటింది. రాము వెనకాలనే వెళ్ళాడు.

చూస్తున్న పార్వతమ్మకు అంత వెలుగులోనూ కళ్లు చీకట్లు కమ్మినట్లు అనిపించి వెంటనే వెనక్కు తిరిగి మేడమెట్లు ఎక్కింది.

25

శాంతమ్మను కారు వెనక సీటులో కూర్చోబెట్టి రామే డ్రైవ్ చేస్తూ మెల్లగా గేటు దాటాడు.

కారు మెల్లగా పోతోంది. శాంతమ్మ ఏమన్నా మాట్లాడుతుందేమో నని రాము ఊహించాడు. ఒకటి రెండుసార్లు వెనక్కి తిరిగికూడా చూశారు. ముద్దగా ఒక మూల కూర్చున్న శాంతమ్మ, కిటికీనుంచి ఆలోచనారహితంగా అంధకారంకేసి మాత్రం చూస్తోంది.

"అమ్మా" డ్రైవ్ చేస్తూనే రాము పలుకరించాడు. ఆ పదంలో ఉన్న మమత శాంతమ్మ దృష్టిని మార్చింది. రాముకేసి చూసింది.

"డాక్టర్ దగ్గరకు వెళదామా?"

"వద్దు"

"రేపటికి గాయం మాపుచేస్తుందేమో."


ఆ చీకట్లో శాంతమ్మ నవ్విందో, దుఃఖించిందో అతనికి తెలీదు. కాని బాధాపూరితమైన విచిత్ర ధ్వని వినిపించింది. ఒకసారి వెనక్కి తిరిగిచూసి, వెంటనే మళ్ళీ కారు నడిపించే బాధ్యతలో ఉండిపోయాడు.

"నా గాయంకోసం నే నాలోచించడం లేదు... కాని..." ఇక మరేమీ చెప్పలేక పోయింది శాంతమ్మ.

రాము కడమాట వినాలని శ్రద్ధగా చెవులు


(24-వ పేజీ చూడండి)

మీరు ఖర్చుపెట్టిన డబ్బుకు ఈవిధములుగా డాల్డా వనస్పతి పూర్తిగా లాభము గలుగజేయును



ప్రతిచోట స్త్రీలు చెప్తారు:

"డాల్డాను కొన్నారంటె మీరు డబ్బును మిగిల్చుకొంటారు మరియు ఇంక రుచికరమైన ఆహారమును వండుతారు."



తెలివైన ఇల్లాలులు ఎల్లప్పుడు డాల్డాను కొంటారు. మన ప్రతిదినపు ఆహారములో వంట క్రొవ్వుపదార్థము తప్పకుండ నుండవలెనని డాక్టర్లు చెప్పుదురు. డాల్డా ఒక దివ్యమైన వంట క్రొవ్వుపదార్థము. దానివలన ఖర్చు తక్కువ. ఒక డాల్డా డబ్బా ఎంతకాలము వస్తుందో, దానితో ఎంత అద్భుతమైన ఆహారమును వండగలుగుతారో మీరే చూడండి! ఒక డాల్డా డబ్బాను ఈ రోజే కొనండి.

నే నేవిధముగా వంట విషయములో ఖర్చును తగ్గించుకోగలుగుతాను ?
ఉచిత సలహాకు ఈవేళో లేక ఏ రోజైనను ఈ క్రింది అడ్రసుకు వ్రాయండి:
ది డాల్డా అడ్వైసరీ సర్వీస్, పోస్ట్ బాక్స్ నంబరు 353, బొంబాయి 1

డాల్డా

10 పౌన్లు, 5 పౌన్లు, 2 పౌన్లు మరియు 1 పౌను టిన్నులలో దొరకును



HVM. 192-X52 TL

ఆలు మగలు

శ్రీ ముద్దంశెట్టి హనుమంతరావు

పాత్రలు : రాజు :
వసంత : రాజుభార్య
లక్ష్మి : వసంత తల్లి
కామేశం: వసంత అన్నయ్య
కాలం : వర్తమానం
స్థలం : రాజు అద్దెకొంప.

రాజు : నేనంటే నీకో వలుసులా కనుపిస్తున్నా కదూ వసంతా! మాటకు మాట జవాబు - అంతకంతకు మితిమీరిపోయి మగవాణ్ణి ధిక్కరించుతున్నావ్ కూడా.

వసం : మీరే కామోసు, నోరు మూసుకుని కూర్చుంటున్నారు. మనుషులమై పుట్టేక ఆమాత్రం మాట్లాడమటండీ!

రాజు : యీ అధిక ప్రసంగమే వద్దంటున్నా - ఏం? అందరు యిల్లాళ్ళు నీలాగే భర్తను యెదిరిస్తున్నారా?

వసం : మీ దృష్టిలో నా తప్పులే అగుపడుతుంటయ్. 'తప్పు లెన్నువారు తమ తప్పు లెరుగ' రన్నట్లు మీ విషయం చూసుకోరేం! మీలాగే అందరు మగాళ్ళు భార్యను వేపుకు తింటున్నారా?

రాజు : అయితే నేను నిన్ను వేపుకు తింటున్నానన్న మాట.

వసం : కాక మరేవిటి? ఎప్పుడూ యేదో తప్పుపట్టుకుని ఒహటే వుపన్యాసం దంచుతారు. ప్రతీ చిన్న విషయానిక్కూడా.

రాజు : తప్పేం లేకుండా నే వూరికనే తప్పు పట్టుతున్నానంటావా? అయినా కట్టుకున్న భార్యను ఆమాత్రం దిద్దే అధికారం కూడా భర్తకు లేదన్నమాట?

వసం : మీలా యెవరూ మగువలమీద యెప్పుడూ మూలుక్కుని మూతివిరుచుకొని వుండటం లేదు.

రాజు : ఎవరుంటున్నారో లేదో నీకెలా తెలుస్తుంది? ఇంతకూ భగవంతు డెంత నిపుణతతో నిన్ను పుట్టించాడో నన్ను వేధించమని. (విసుగ్గా) యీ సుగుణాల రాశిని నా మెడకు చుట్టాడు.

వసం : మీరే గామోసు మహా గుణవంతులు. నా దురదృష్టంకొద్దీ, నన్ను మీ మెడకు కట్టారు...

రాజు : లేకపోతే - నాకు మరి కరువైపోతుంది నీలాంటి సతీలలామ.

వసం : నిజమే! ముమ్మాటికీ దొరకదు. మీ ఆస్తిపాస్తులు, మీ వుద్యోగం చూసి యెవ్వరిస్తారు?

రాజు : మీ వాళ్లు యెలా యిచ్చారంటావ్?

వసం : అక్కడే పప్పులో కాలేశారంటా. దగ్గర సంబంధమని, అరమరలుండక హాయిగా జీవితం గడిచిపోతుందని ఆశతో యిచ్చారు. వారికేం పోయింది. ఇప్పుడు నే ననుభవిస్తున్నా."

రాజు : పాపం: మీ వాళ్లు కనికరించి నాకు ముడికట్టేరు. వాళ్ళిచ్చిన యీ కట్నాలు కానుకల కాసపడి యింకెవరైనా జమీందారు వచ్చేస్తాడనుకున్నావా?

వసం : ఎంతమంది రాలేదు! వాళ్లనందర్నీ నిరాకరించారు మీ రున్నారన్న ధైర్యంతో మానాన్నగారు.

రాజు : నేనేం ప్రతిమలాడలేదుకదూ! నువ్వే నా భార్యగా కావాలని, లేకపోతే నా ప్రాణాలు సహితం నిలువవని ప్రతిన జేయలేదు కదూ——

వసం : మీరలా అంటారని నాకు తెలుసు - యివన్నీ బయటకు లాగి యెత్తిపొడవటానికి నేనేం తప్పు చేశానని...?

రాజు : తప్పులున్నాయి గనుక నేఅనటం వచ్చింది.

వసం : అదే యేవిటో నేనూ చెప్పమంటున్నా-

రాజు : వెటకారంగా యెదురు ప్రశ్నలు వేయటం తప్పుకాదూ?

వసం : నేం చేసిన పనంతా మీకు వెటకారంగానే కనుపిస్తుంది. మీ రెన్నన్నా నోరుమూసుకుని వూరుకోమంటారన్నమాట.

రాజు : ఔను! నువ్వెందు కూరుకుంటావ్! మాటకు మాట జవాబిచ్చి మొగుణ్ణి యెదుర్కొంటావుగాని——

వసం : పల్లెటూరి దానికి బుద్ధులుచెప్పినట్టు నాకు చెప్తారేంవిటి?

రాజు : ఇప్పుడే భరించలేకపోతున్నా- కొద్దిపాటి యింగ్లీషు చదివివున్నట్టయితే నన్ను యేడుచెరువులనీళ్ళు. త్రాగించి వుందువు.

వసం : ఆ చదువు రాకే కదూ - పదిసార్లు మీ చేత మాటలు కాయవలసి వస్తోంది. ఆ మాత్రం చదువు వుంటే నాకేం ఖర్మ!

రాజు : చదువుంటే పెళ్ళి మానేసి వుద్యోగం చేద్దువు గావాలి. నేను చెప్పిందంతా యెగతాళిలా వుంటుంది నీకు. వెనుక తాళం వేస్తుంటాడు మీఅన్నయ్య, నే నెన్నిసార్లు చెప్తున్నా పుస్తకం యేమన్నా ముడుతున్నావా?

వసం : యింటిపనులతో సతమతమైపోతూ వుంటే చదువుకోటానికి తీరిక వుండొద్దూ!

రాజు: రోజంతా పనితో వేగిపోతున్నా వన్నమాట! నేను పదిగంటలకు ఆఫీసుకి పోయిన తరువాత యేంచేస్తున్నావో ఓసారి చెప్పు. శ్రద్ధగా వింటాను - (చేతులు వెనుక వేసుకుంటాడు).

వసం : నాకు మరి పనులు లేవనుకుంటున్నారా?

రాజు : అవే చెప్పమంటున్నా.

వసం : శ్రీరామ దగ్గరినుండి, చిత్తగించిన వరకు యెవడు చెప్పగలడు?

రాజు : అసలు చెప్పేందుకు చేసిన పనులుంటేగా...పడక తప్పిస్తే...

వసం : ఇదొహటి బాగా దొరికింది. మాటాడితే పడుకుంటానంటారు. అందుకే మా అన్నయ్య అంటుంటాడు - మీతో సహచరిణిగా జీవితం గడపటం కష్టమని.

రాజు : నాకు తెలుసు-మీ అన్నయ్యకు, నీకూ, నా అభిప్రాయాలన్నీ మట్టిబుర్రలో పుట్టవల్సినవనీ, నేనో చవటననీ వుంటుంది. నిజమే! మీ కంతకంటె తెల్సిందేముంది? మీ అన్నయ్య వుద్యోగం, వూరుమీది షికారు, పడక తప్పిస్తే, యే ఒక్క పనైనా చేస్తున్నాడా? అవే నీకూ నుప్పుతున్నాడు. అతడు నన్నేమన్నా, యెన్ని వుపన్యాసాలిచ్చినా నే నంతగా పట్టించుకోనని పాపం, అతనికి తెలీదు.

వసం : నన్ను వేధించటం కాకుండా, మా అన్నయ్య నెందుకు యెత్తిపొడుస్తారు?

రాజు : తప్పయింది-క్షమిస్తారనుకుంటా. (వెళ్ళి కుర్చీలో కూర్చుని పేపరు చదువుతుంటాడు.)

వసం : మీతో వాదించే బదులు వూరుకోవటం వుత్తమం.

రాజు : (పేపరు మడతపెట్టి) వాదించమని నేను చెప్పానా?

వసం : లేదు బాబూ! లేదు!! నేనే వుండలేక వాదిస్తున్నా. ప్రతి చిన్న విషయాన్ని ఓ పెద్ద కథగా తయారుచేస్తారు. పోనీగాని...మా అన్నయ్య వచ్చాడిందాక.

రాజు : అలాగా! వచ్చి మరింకేం చెప్పాడు? వంట మానేయమని చెప్ప లేదూ? అది కూడా నువ్వు యెందుకు చేయాలి?

వసం : అంతా మీకో హాస్యంలావుంటుంది. వాడెందుకలా చెప్తాడు? చెప్తే మాత్రం నేను చేస్తానా?

రాజు : ఏమో! అన్నీ యెలా అతని సలహా ననుసరించి చేస్తున్నావో, యిదీ అలాగే ఆచరణలో పెడతావేమోనని——

వసం : (చీదరించుకుంటూ) వూరుకుందురూ - ఎప్పుడూ వేళాకోళమే - ఔనుగానీ, మా అమ్మ నన్నొకసారి రమ్మందిట.

రాజు : నేనూ అదే వూహించాను. వున్న వూర్లో అత్తవారుంటే అల్లుళ్ళకి చెంపపెట్టే. చీటికి మాటికి పిలుపులు - లేకపోతే నువ్వు బయలుదేరటం - యీ రిక్షాలకు పొయ్యలేక చస్తున్నా. కనీసం ఓ రెండు, మూడు రూపాయలయినా నెల బడ్జెట్టులో కలపాలి రిక్షాలకు.

వసం : నే నెప్పుడెళ్ళానుగనుక! కోపంగావుంటే సరి - అన్నీ పాత విషయాలు కెలుకుతారు. యీ ఒక్కసారీ వెళ్లనివ్వండి. మళ్ళీ చూస్తారుగా నెలరోజుల వరకు ఆ వూసెత్తుతానేమో!

రాజు : నీ యిష్టం వసంతా; నేను వద్దంటే మాత్రం మానేస్తావా?

వసం : మానేక వీలవుతుందా?

రాజు : పాపం! భర్త అజ్ఞానుసారం ప్రవర్తించే పతివ్రతవు మరి - వెళ్ళు.

వసం : మీరు రేపు ఆఫీసుకి పోయేటప్పుడే వస్తాను.

రాజు : నేనే తీసుక వెళ్ళాలన్నమాట.

వసం : మరేం...? (నవ్వుకుంటూ పోతూంది)



2-వ రంగం

[వసంత కన్నవారిల్లు. వసంత, తల్లి లక్ష్మ్మ ప్రక్కన కూర్చుని వుంటుంది. కామేశం మంచంమీద కూర్చునివుంటాడు]

కామేశం : నాకు తెలుసు చెల్లీ! నీభర్త ప్రపంచంలో లేనివింత వ్యక్తి అని. అందరి అభిప్రాయాలూ ఒకలా వుంటే, అతని అభిప్రాయాలు విరుద్ధంగావుంటయ్- ఒకరు ఔనంటే అతడు కాదంటాడు. స్త్రీలచదువు గురించి మొన్న నాతో ఓ లెక్చరు దంచాడు. నువ్వు చదవక్షరం లేదని యేమయినా అంటున్నాడా చెల్లీ?

వసం : ఒకటా! ఎప్పుడూ ఎత్తిపొడుపు మాటలాడుతూనే వుంటారు. చదువురాని మొద్దునని, యింగ్లీషు వుత్తరమయినా చదవలేనని, వ్రాతబావుండదనీ నువ్వే యీ అశ్రద్ధకు కారణమని - యింకేమేమో అంటుంటారు.

లక్ష్మ్మ : పోనీలేవే - ఆమాత్రం అనటానికి భర్తకి హక్కు లేదా? అలా అన్న తరువాతయినా చదువంటే శ్రద్ధ తీసుకుంటావేమో నన్న ఆశతో అని వుంటాడు.

కామే : నువ్వూరుకో అమ్మా! నువ్వే దినికంతటికీ కారకురాలవు - అతని పుట్టుపూర్వోత్తరాలు, ఆస్థిపాస్తులు, ప్రవర్తన, పూర్తిగా తెలిసికూడా చెల్లినిచ్చి పెళ్ళి చేయటానికి నీకు బుద్ధుంటేకదూ?

లక్ష్మ్మ : నువ్వింకా చిన్నవాడివిరా కామేశం - ఏం తక్కువయిందతనికి నిక్షేపంలాంటి కుర్రాడు. వుద్యోగం చేసుకుంటున్నాడు. చెడుఅలవాట్లేవీ లేవు. అంతకంటె కావలసిందేవిటి? ధనం శాశ్వతమా?

కామే : అవన్నీ బాగానే వున్నాయ్. కానీ గొప్ప అనుమానపు మనిషి— [illegible]



పద్మప్రియ

—కె. భాగేశ్వర శర్మగారి లినోకట్ చిత్రం.

ఆలుమగలు

బయట అడుగుపెట్టనివ్వను. మళ్ళీ అన్నీ హిరణ్యాక్షువరాలే! పెళ్ళాం అందంగా వుండాలి. చదువుకోవాలి. ఎవరితో మాట్లాడకూడదు. యింకెన్నో వున్నయ్. అవన్నీ చెబితే పెద్ద కథలా తయారవుతుంది.

లక్ష్మి: ఇందులో తప్పేం వుంది? మనమేం యింగ్లీషువాళ్ళమా! భార్యల్ని బయట త్రిప్పటానికి? నీకు తెలీదుగాని, మా నాన్నసలు వీధిముఖం చూడనిచ్చేవారు కాదు.

కామే: అవన్నీ పూర్వపు చాదస్తపు రోజులమ్మ.

వసం: నేనిప్పుడు రావటం ఆయనకేం యిష్టం లేదమ్మ! పోడకూడదూ — నేనొచ్చి రెండురోజు లయిందా? ఒక్కసారైనా తొంగిచూడలేదు. ఇవ్వాళ వస్తానంటుంటా తీసుకుపోవటానికి. అత్తవారిల్లు యీ వూళ్ళోనే వుండటం ఆయనకి మహా బాగా వుండట - అంతేనా! రిక్షాలను పోయలేక చస్తున్నారట కూడాను.

కామే: (కోపంగా) మహా గొప్ప సంబంధం చేశావమ్మ! ప్రతీ విషయానికీ పేచీలే—తరుణం మించిపోయింది, మరేం చేస్తాం? చేతులు కాలినతరువాత ఆకులు పట్టుకుంటే మాత్రం యేం లాభం?

లక్ష్మి: నీకేం తెలుసులేరా! ఆలుమగల మధ్య అనేకం వుంటాయి. దీని తెలివి తక్కువతనంవల్ల చెప్పుతుందిగాని అలా చెప్పకూడదు. అందుకే అతనంటాడు.

కామే: నువ్వెప్పుడూ అతన్ని వెనకేసు కొస్తుంటావులే అమ్మ—

వసం: మాట కెదురుచెప్పకూడదట. యెన్నన్నా నోరుమూసుకుని వూరుకోవాలిట.

కామే: అడగటం మర్చిపోయాను—యెప్పుడైనా చెయ్యిచేసుకుంటాడా చెల్లీ?

వసం: (ఏదో చెప్పబోతుంది.)

లక్ష్మి: నీకెందు కవన్నీ కామేశం—నీమానాన నువ్వు పడుకో (కూతురువేపు తిరిగి) నీ కింకా చిన్నతనమమ్మయీ... నువ్వలా యే సంగతీ యెవ్వరితోనూ చెప్పకూడదు. నీకంతగా కష్టమనిపిస్తే నేను ఒంటరిగా వున్నప్పుడు నాతో చెప్పు. అయినా రాజు అంత మూర్ఖంగా ప్రవర్తించడు.

వసం: ఎప్పుడూ యెత్తిపొడుపుమాట లంటారమ్మ - యెలాభరించేది?

లక్ష్మి: అంత పౌరుషమున్న దానవయితే యేదో చదువుకోకూడదూ?

వసం: చదువుకోవటంతో సరిపోయిందా - రాతబాగుచేసుకోవాలట, వారు వ్రాసినకథలు బాగాదిద్ది మళ్ళీ వ్రాయాలట.

లక్ష్మి: అలాచేస్తే నీకొచ్చిన నష్టం యేమిటి అంటా.

కామే: బావుంది తను కథలు రాస్తాడని భార్య రాత బాగుచేసుకోవాలన్న మాట!

లక్ష్మి: నువ్వూరుకోరా మధ్య నువ్వేమిటి?

కామే: అది కాదమ్మ! యెందుకు దాన్నలా వేధించుకు తినటం అంటా.

[రాజు గేటు తలుపుతీసుకొని లోపల ప్రవేశించటం వసంత చూస్తుంది]

వసం: [మెల్లగా] అమ్మ! వస్తున్నారే...

కామే: ఏమోయ్! యేమిటీలా దయచేశావ్ - రెండురోజులనుండి రావటానికి తీరిక చిక్కలేదేమో (నవ్వుతాడు)

రాజు: (నవ్వుతూ) వూరంతా తిరిగి

తిరిగి కాళ్ళు నొప్పులెట్టాయి. అందుకే రాలేకపోయాను. మరేం అనుకోకేం.

కామే: (చిత్తయిపోయి) ఒహో! (పూరుకుంటాడు)

లక్ష్మి: ఏంబాబూ! ఒక్కసారైనా తొంగిచూశావు కాదు యీ రెండుగోజుల్లో.

రాజు: వీలు చిక్కింది కాదత్తయ్యా.

వసం: ఏదో యివ్వాళ తీసుకపోవాలని వచ్చారు (నవ్వుతుంది)

రాజు: వుండాలంటే వుండు.

లక్ష్మి: ఒకవూళ్లో వున్నాం కాబట్టి యిలావస్తూ పోతూవుంటుంది. పైవూళ్లో వుంటే ఎప్పుడో ఓసారి వస్తుంది.

రాజు: నే ననుకున్నట్టే చెప్పిందన్న

(56-వ పేజీ చూడండి)

★ దత్తత ★

(19-వ పేజీ తరువాయి)

నిగిడ్చి, కారు నడిపిస్తున్నాడు. ఎంతసేపటికీ అంత్యపదం పూర్తికాకపోవడంవల్ల "మరి ఎవరి గురించి" అని ప్రశ్నిస్తూనే, ధర్మయ్యగారి వీధివైపునకు కారుత్రిప్పాడు

శాంతమ్మ సమాధానం యివ్వకముందే, ధర్మయ్య యింటిముందు కారు ఆగింది. రాము తెరచిన తలుపునుండి శాంతమ్మ కారు దిగింది. తలుపు వేసి రాము కారుదగ్గరగానే నిలచిపోయాడు.

"నువ్వు వేసిన ప్రశ్నకు సమాధానం కావాలిగా, లోపలికి రా బాబూ!" అంటూ కాళ్ళు పట్టిపట్టి వేస్తూ మెట్లు యెక్కింది.

శాంతమ్మ గుమ్మందగ్గరకు వెళ్ళి చేర వేసిన తలుపు తెరచింది. ఆమె మనస్సు కల్పించిన అపాయానికి జంకుతూ లోపలకు చూసింది. ధర్మయ్య గదిలో దీపం మిలుకు మిలుకుమంటూ వుంది.

శాంతమ్మ వెనక్కి తిరిగి చూసింది.

రాము కదల్లేదు. గుమ్మంలో అడుగు పెటడానికి అతని మనస్సు వెనుకాడింది. నేరస్తుడుగా తలవంచుక నిలబడ్డాడు.

"ఇంటికి పాతవాడివేగా బాబూ! చుట్టంలా సంశయిస్తావు దేనికి? మీ మాష్టార్ని ఒకసారి చూసి వెళుదువు గాని రా" అంటూ శాంతమ్మ లోపలకు వెళ్లింది. రాము మెల్లగా కదలి మెట్లు యెక్కాడు. శాంతమ్మ ముందుగానే ధర్మయ్య గదిలోకి వెళ్ళింది. తండ్రి మంచం దగ్గరగా క్రింద కూర్చొన్న లక్ష్మి మంచం పట్టెపై తలపెట్టుకొని కళ్ళుమూసుకొని ఉంది. అది నిద్దరోలేక కృతిమించిన దుస్థితికి దురపిల్లిన అనంతరం శరీరాన్ని మరచిన తెలివిలేని పరిస్థితో ఎవరికి తెలుసు?

"లక్ష్మీ" శాంతమ్మ దగ్గరగావచ్చి పలుకరించింది. లక్ష్మి బరువైన రెప్పలు ఎత్తి చూసింది. కాని శిరస్సును ఆ స్థానాన్నుండి కదల్చలేకపోయింది. కాని శాంతమ్మ తల కట్టుకేసి దృష్టినిలిపి కాస్సేపు చూసింది.

"రామువచ్చాడు" అని మళ్ళీ శాంతమ్మ అంది. ఈమాట విన్న లక్ష్మి కాస్త కళ్లు పెద్దవిచేసి గది గుమ్మంవైపు చూసింది. రాము కనిపించాడు. కాని వెంటనే కళ్లు మూసింది. మూసిన కళ్లనుండి కళ్లనీళ్ళు జారిపడ్డం శాంతమ్మ చూసింది. లక్ష్మి కళ్లు తుడుచుకొని అలాగే నిస్సత్తువగా పడి వుంది.

రాము గుమ్మందగ్గరే ఉండి పరిస్థితులన్నీ తొందరగానే అవగాహన చేసుకున్నాడు. లక్ష్మి గుర్తుపట్టలేనంతగా మారిపోయింది. ధర్మయ్య కట్టెలా మంచాన్ని అంటుకొని ఎడ తెరిపి లేకుండా గురక పెడుతున్నాడు.

శాంతమ్మకూ జమిందారుకూ జరిగిన సంభాషణ ప్రక్కగదిలో ఉన్న రాము వినడం జరిగింది. అయితే కడుపు తీపి కొద్దీ రవిని విడుదలచేయించే ఉద్దేశంతోనే ఆమె వచ్చిందనే, అనుకొన్నాడు గాని, ధర్మయ్య దుస్థితి గానీ, లక్ష్మి పరిస్థితి గానీ, ప్రస్తుతం చూస్తున్నంత గాఢంగా ముందు నిర్ణయించుకోలేక పోయాడు.

గుమ్మందగ్గరనే కాస్సేపునిలబడి "లక్ష్మీ" అని పిలచాడు రుద్ధకంఠంతో రాము.

లక్ష్మి మెల్లగా తలెత్తింది. రాముకేసి తడిదేరిన అరమోడ్పు కళ్ళతో చూసింది. ఆ చూపులో ఏ కోరికా లేదు. ఈర్ష్యా ద్వేషాలు కూడా లేవు కాని భయావహమైన ఏదో కాంతి కనిపిస్తోంది.

"క్షమించు లక్ష్మీ" దగ్గరగా వచ్చి గద్గదికంగా అన్నాడు రాము.

ఇప్పుడే స్పృహలోకి వచ్చినట్లుగా లక్ష్మి కళ్లు కాస్త కదలాయి. రాము కళ్లల్లో నీటి తెరలు మెరవడం కూడా గమనించింది. గాని ఏమీ మాట్లాడలేకపోయింది.

"ఊరుకో బాబూ" శాంతమ్మ ఊరడించబోయింది. రాము కళ్లు తుడుచుకొని, ధర్మయ్య మంచం ప్రక్కగా ఉన్న కుర్చీ మీద కూర్చొని "నేను చాలా ద్రోహం చేశానుకదూ?" బాధగా ఉద్వేగంతో అని తల క్రిందుగా వంచుకొని, చేతిలో ఉన్న జేబురుమాలు కళ్ళదగ్గరగా పెట్టుకొని అద్దుకున్నాడు.

అతని మనః పరిస్థితి ఏమీ బాగుండలేనట్లుగా శాంతమ్మ గుర్తించింది. కాని బాగుండాలని రాము కోరుకోడల్లేదని మాత్రం ఆమెకు తెలీదు. లక్ష్మికి ఈలాంటి ఘోరం జరగడానికీ, రవి ఖైదుకి పోవడానికి, ధర్మయ్య మంచం పట్టడానికీ, కారణం తానుగానే గ్రహించుకున్న రాము, వాళ్లు పొందే క్షోభను పదిరెట్లుగా పొంది, అలాంటి వ్యధాపూరితమైన అగ్నిలో నిలచి నాశనం కావడమే మంచిదిగా భావిస్తున్నాడు.

శాంతమ్మ చావిట్లో దీపం వెలిగించడానికి అక్కడనుంచి కదలింది.

"లక్ష్మీ" మళ్ళీ పిలచాడు రాము.

లక్ష్మి చూసింది. ఇక అక్కడ ఉండగల ఓపిక ఆమెలో లేదు. లేచి నిలబడింది. రాము అలాగే లక్ష్మికేసి చూస్తున్నాడు. లక్ష్మి శుష్కవదనంలో, ప్రశాంతమైన ఏదో కాంతి రాముకి కనిపించింది. గంభీరత్వం వహించిన ఆమె నేత్రాల్లో లోతును గుర్తించడానికి యత్నిస్తున్నాడు.

కాని ఏమీ మాట్లాడలేదు. మంచంమీద మగతలో ఉన్న ధర్మయ్య కేసి చూస్తోంది.

రాము యిప్పుడు ధర్మయ్యను చూశాడు. అర్థచూపు పడింది. గురక ఎడతెరిపి లేకుండా సన్నగా ధ్వనిస్తోంది. ఇది ఏలాంటి సమయమో ఎక్కువగా అనుభవంలేని రామునకు - వచ్చే అపాయాన్ని, జరగబోయే అనుభవాన్ని యథాతథంగా గ్రహించలేకపోయాడు. మళ్ళీ తిరిగి యిటు చూశాడు. లక్ష్మి ఎప్పుడు వెళ్లిందో అక్కడ లేదు.

రాము చావిట్లోకి వచ్చాడు. లక్ష్మి గోడ

దగ్గరగా నిలబడింది. ఆమె మొగంపై చీకటివెలుగులు, చావిట్లో గాలికి ఊగే హరికేన్ లాంతరనుండి ప్రసరిస్తున్నాయి.

"నీకు చేసిన ఈ పొరపాటునకు, నువ్వు ఏలాంటి శిక్షయిచ్చినా అనుభవించడానికి సిద్ధంగా ఉన్నాను లక్ష్మీ"

రాముమాటలు విని లక్ష్మిచూసింది. దుఃఖంతో కలిసిపోయి హృదయాన్ని కదలించే బాధామిళితమైన హాసాన్ని విడచి, అక్కడ నిలబడలేక వేరే గదిలోకి వెళ్ళిపోయింది.

ఇంతగా ప్రాధేయపడుతూ అడిగిన అతని మాటలకు తిరిగి లక్ష్మినుండి తీవ్రావేదనతో దూషణతో నాలుగు మాటలు వస్తే, రాము హృదయం కొంత శాంతి పొందేదేమో; కాని కనీసం ఏలాంటిమాట కూడా ఆమెనుండి రాకపోవడంవల్ల సంక్షోభ పూరితమైన రాము హృదయం మరీ మధనపడసాగింది.

"ఏమన్నావ్ బాబూ" లక్ష్మి వెళ్ళిన గదిలోనుంచే శాంతమ్మ వచ్చి రాముని చూస్తూ ఈ ప్రశ్న వేసింది.

రాము ఒకసారి శాంతమ్మకేసి చూశాడు. తన దౌర్బల్యపూరిత హృదయఘోషను, ఏ భాషలో ఆమెకు చెప్పగలడు? తల వంచుకొని సమాధానాన్ని కూడా విస్మరించాడు.

"మాట యిచ్చి తప్పడం వల్ల మాకు వచ్చిన కష్టాలు చూసి కూడా, హామీలివ్వడం తప్పనే సంగతి యింకా గ్రహించలేదూ?" శాంతమ్మ అంది.

మృదువుగా అన్న ఈ భాషణ ద్వారా ఏలాంటి ప్రతీకార వ్యంగ్య శరాఘాతం అతని హృదయంలో తాకిందో; అతని మొగం చూసిన శాంతమ్మ వెంటనే గ్రహించింది. శాంతమ్మ దగ్గరగా వచ్చింది. "బాధపడకు బాబూ! నీ కాళ్ళమీద నువ్వు నిలబడగల శక్తి లేనప్పుడు వాగ్దానాలివ్వడం మంచిది కాదనే సంగతి నువ్వింకా గ్రహించలేదంటే; నా కాశ్చర్యంగానే వుంది. అందుకే అలా అన్నాను" అంది.

"తప్పుచేశానన్నానుగా.. దానికి శిక్షగా నా ప్రాణాన్ని తీసుకోమన్నా తీసుకుంటా" వణుకుతూవచ్చిన ఈమాటలకు శాంతమ్మ భయాశ్చర్యాలతో చూసింది. రామునిజంగా ప్రతిజ్ఞపాలించేపట్టుదలతో ఉన్నట్లుగానే అతని మొగం స్ఫురింపచేస్తుంది. శాంతమ్మ అతని కళ్లనుండి కారే కంటినీటిని తుడుస్తూ "ఛా! అదేం పని బాబూ!"అని అడిగింది.

"నేను లక్ష్మిని హృదయపూర్వకంగా ప్రేమించాను కాని..."అంటూ మొగాన్ని రెండుచేతులతో కప్పుకొని, ప్రక్కగా ఉన్న చాపమీద చతికలబడి వెక్కి వెక్కి చంటిపిల్లవాడులా రాము ఏడుస్తున్నాడు.

శాంతమ్మ స్తంభించిపోయి అలాగే చూస్తోంది. రాము కారే కళ్లనీళ్లను తుడుచుకుని శాంతమ్మకేసి చూసి "నాకు తెలీకుండా లక్ష్మి పెళ్లి నిర్ణయించారు... ఈలాంటి పని చేస్తున్నప్పుడు లక్ష్మి ఎందుకు చెప్పకూడదు" అని అడిగాడు.

శాంతమ్మ మరీ ఆశ్చర్యపడింది. రాము దగ్గరగా కూర్చుని "ఎవరు ఎవరితో చెప్పాలి?" అని అడిగింది.

ఈ ప్రశ్నకు రాము సమాధానమివ్వలేదు. నిజమే! ఎవరికి ఎవరు చెప్పాలి? అని మళ్లీ తనలో అనుకున్నాడు.

"లక్ష్మి ఆడపిల్ల అన్న సంగతి నువ్వు మరచి మాట్లాడుతున్నావ్ బాబూ! ఈ విషయంలో నువ్వే మీనాన్నగారితో చెప్పడానికి జంకినప్పుడు లక్ష్మి ఏవిధంగా వాళ్ళ నాన్నతో చెప్పగలుగుతుంది... కాని నిన్ను ప్రేమించినంతగా లక్ష్మి ప్రపంచంలో మరెవర్నన్నా ప్రేమించి ఉంటే, వాళ్ళు లక్ష్మిగురించి ప్రాణాలిచ్చి నిలబడ్డానికైనా సిద్ధపడతారు. కాని నువ్వు తండ్రిచాటు బిడ్డవు. ఆ సంగతి లక్ష్మికన్నా నువ్వే ముందు తెలుసుకోవలసింది. అయితే ప్రేమనే అజ్ఞానంలో ఆలోచనకు నువ్వు తావివ్వలేదు. లక్ష్మి అయినా, అస్వతంత్రులను ప్రేమించిన అనేకమంది ఆడవాళ్ళు పంకిలులయ్యారనే సంగతి కూడా తెలుసుకోలేకపోయింది. ఇంతకూ నీకేదన్నా శిక్ష యివ్వాలనే అధికారం నువ్వే నాకిచ్చిఉంటే; ఆ శిక్ష చాలా భయంకరమైందిగా ఉంటుంది" అని అంతవరకూ చెప్పి శాంతమ్మ మెల్లగా లేచింది.

గుక్కు వప్ప చెప్పిచూస్తున్న రాము శాంతమ్మలో దాగిన విమర్శనా శక్తికి విస్తుపోయాడు. ఈలోపం ఎవరిదో ఆమె తియ్యని మాటల్లో దాగిఉంది. నిలబడిన శాంతమ్మ కళ్ళల్లోకి తల ఎత్తి చూశాడు. ఉన్మాద పూరితమైన ఆవేశంలో అతని హృదయం కదలిపోయింది. అతని వదనంలో సంతోషం సంతాపం కూడా సందిగ్ధావస్థలో సమరం చేస్తున్నాయి. "నువ్వు యివ్వబోయే శిక్ష నాకు తెలుసు... ఈ పాప పరిహారార్థం నీ పాదాల సాక్షిగా లక్ష్మిని నేను పెళ్ళిచేసుకుంటానమ్మా" అంటూ శాంతమ్మ రెండు కాళ్లూ పట్టుకొని, కన్నీటితో ఆమె పాదాలను తడిపాడు. శాంతమ్మ ఆనందంగా నిట్టూర్చి తలవంచి రాము శిరస్సును, సంతోషంగా స్పృశించింది. గదిలో నిలచిన లక్ష్మి బరువుగా "అబ్బా!" అంది.

విసురుగావచ్చినగాలి, తెరచిన తలుపులను దబాలున నెట్టింది. కిటికీలన్నీ కొట్టుకోడం ప్రారంభించాయి. చావిట్లోలాంతరు అటుయిటు తీవ్రంగా కదిలిపోతోంది. ధర్మయ్య గదిలోనుంచి ఏదో భీకరమైన ధ్వని వినిపించింది.

లక్ష్మిహృదయం భీతాహంతో నిండిపోయింది. తడబడే కాళ్లతో తొందరగా తండ్రి ఉన్న గదిలోకి వెళ్లింది.

మెరుపులాగ వెళ్ళిన లక్ష్మిని శాంతమ్మ రాము చూశారు.

"నాన్నా" అంటూ గదిలోనించి బిగ్గరగా అరచింది లక్ష్మి. శాంతమ్మ ధర్మయ్య గదిలోకి వెళ్లింది. ధర్మయ్యను చూసింది. ఒక్కసారి "అన్నయ్యా!" అంటూ అరచి ధర్మయ్య కాళ్ళమీద పడిపోయింది.

రాము మంచందగ్గర నివ్వెరబడి కొయ్యబారిన ధర్మయ్య శరీరాన్ని చూస్తూ నిలబడిపోయాడు.

గాలి తీవ్రతవల్ల గదిలో దీపకళికకూడా ఆరిపోయింది.

(ఇంకావుంది)



విజ్ఞాన వీధులు

"డాక్టర్"



127. చంద్రబింబానికి వృద్ధి క్షయాలు నిజంగా కలుగుతున్నాయా?

శుద్ధపాడ్యమినుండి పూర్ణిమవరకు క్రమక్రమంగా పెరుగుతూ, పూర్ణిమనుండి అమావాస్యవరకు బహుళపక్షంలో క్రమంగా కళలు కోల్పోయి కృశిస్తూన్న చంద్రబింబాన్ని అందరం చూస్తూన్నప్పుడీ ప్రశ్నకే అర్థంలేదేమో అనిపించవచ్చును. కాని, చంద్రబింబానికి వృద్ధిక్షయాలు కలుగుతున్నాయా, లేక, కలుగుతున్నట్లు కనిపిస్తూందా అన్న విషయం తేల్చుకోవాలి. అయితే, శుక్ల పక్షంలోగాని కృష్ణపక్షంలోగాని చంద్రబింబానికి సహజంగా కళలో ఎట్టిమార్పు కలగడంలేదని సూటిగా చెప్పవలసి వస్తుంది. కలగని మార్పు కనిపించడమెట్లా? అదే విశేషం.

కవులు చంద్రదూషణం జోరుగా చేసేరు. చంద్రుని వృద్ధిక్షయాలను గూర్చి రామరాజభూషణుడు యిలా అన్నాడు:


"ఇందుల నేచు పాతకము
 దింతటనంతట బోదు పాంథలో
కాంతక నిన్ను ఘోరతమ
 మై ఘనమై యజహాత్కళంకమై
వంతుల బెట్టి యారుపది
 ప్రక్కలు సేయక పూర్వపక్షపుం
గంతులకేమి చూచెదవు
 గా తుది నీ బహుకార్తిభేదముల్."

కాని, అది కేవలం కవి చమత్కారమే కాదు. కవి దృష్టికేకాక ఈ వృద్ధిక్షయాలు మనకందరికి కనిపిస్తున్నాయి.

భూమిచుట్టూ చంద్రబింబం తిరుగుతూంది. సూర్యరశ్మి భూమిమీద పడినట్లే చంద్రునిమీద సైతంపడుతుంది; పడి చంద్రగోళంలో సగభాగాన్ని కాంతితో వెలిగిస్తుంది. మనలోకంలో వలె చంద్రలోకంలో సైతం సూర్యోదయ సూర్యాస్తమయాలు సంభవిస్తూంటాయి. మన రోజు 24 గంటలైతే, చంద్రలోకంలో రోజు మన నెలకు సమానం కావచ్చు; ఇప్పుడది అప్రస్తుతం. భూమిచుట్టు ప్రదక్షిణాలు చేస్తూన్న చంద్రుడు ఏస్థానంలో నున్నప్పటికి సూర్యుని వైపున్న గోళార్ధంపై ఎల్లప్పుడు ఎండ పడుతుంది; అందుచేత, ఆసగం వెలుగుతో నిండి ఉంటుంది. చంద్రలోకం జీవాస్పదమైతే ఆ సగంలో నున్నవారికి పగలు, మిగిలిన సగంలో నున్నవారికి రాత్రి అవుతుంది.

భూమి చంద్రుడు కూడా సూర్యునివలె స్వయంగా ప్రకాశించగల గోళాలు కావు. చంద్రునిపై పడిన సూర్యరశ్మియే వెన్నెలగా మనకు ప్రసారమౌతుంది. అనునిత్యం చంద్రునిలో సగంభాగం వెన్నెలలు ప్రసరిస్తునే ఉంటుంది. అయితే, నిజంగా లేని వృద్ధిక్షయాలు మన కెందుకు కనిపించాలో చిత్రంవల్ల స్పష్టమౌతుంది.

సమాంతర కిరణాలగా సూర్యరశ్మి చంద్రునిపై పడుతూన్నట్లు భావింపవచ్చును. భూమికి నిత్యప్రదక్షిణాలు చేస్తూన్న చంద్రగోళంలో 'కచగ' అను అర్థభాగం ఎల్లప్పుడూ సూర్యకాంతిచే భాసిస్తుంది. చంద్రుడే స్థానంలో నున్నప్పటికి 'చకత' అను గోళార్థం మనకు కనిపిస్తుంది. స్థానం 1 లో చంద్రుడున్నపుడు వెన్నెలలేని గోళార్ధమే మనవైపుంటుంది. ఆనాడు అమావాస్య. భూమిచుట్టూ తిరుగుతూన్న చంద్రుడు శుద్ధ చవితినాటికి స్థానం 2 వద్దకు వస్తాడు. అప్పుడు వెన్నెలగల భాగంలో సుమారు నాల్గవవంతు మనకు కనిపిస్తుంది. అదే



చంద్రవంక, శుద్ధసప్తమిఅష్టమినాటికి స్థానం 3 ను చేరుకొంటాడు. వెన్నెలజల్లు గోళార్థంలో మనకు రమారమి సగం భాగం కనిపిస్తుంది. గీతగీసి బింబాన్ని రెండు సమభాగాలు చేసినట్లుంటుంది. శుద్ధ ఏకాదశి ద్వాదశినాటికి మనకి కనిపించే వెన్నెల భాగం మరికొంత ఎక్కువౌతుంది. అప్పటికి స్థానం 3 నుండి 4 కి గమిస్తాడు. మరి 3,4 రోజులకు పూర్ణిమ. చంద్రునిలో పగలుగా నున్న భాగాన్ని అంతటిని ఆనాడు మనం చూస్తాము. అప్పటికి అర్ధప్రదక్షిణ మౌతుంది.

తన కక్ష్యలో చంద్రుడు, సాగిపోతూంటే మనకు కనిపించే వెన్నెలభాగం క్రమంగా తగ్గుతుంది. స్థానం 6 ను చేరుకొనేసరికి బహుళచవితి అవుతుంది. శుద్ధ చవితినాడెంత భాగం వెన్నెలచల్లిందో ఇప్పుడంత భాగం వెన్నెలపోయి నల్లపడినట్లు కనిపిస్తుంది. బహుళ అష్టమినాటికి స్థానం 7 బింబంలో సగంవరకు కళాహీనమైనట్లుంటుంది. బహుళ ద్వాదశి నాటికి స్థానం 8 బింబంలో ముప్పావు నల్లపడినట్లు కనిపిస్తుంది. మరి మూడురోజుల కమావాస్య. అమావాస్యనుండి తిరిగి అమావాస్యవరకు ఈ చక్రక్రమం అవిచ్ఛిన్నంగా సాగుతుంది.

చంద్రుడు నిజంగా ఆరువది ప్రక్కలౌతున్నాడా? పూర్వపక్షంలో గంతులు వేస్తున్నాడా? తుదకు బహుళార్తిభేదాలనుభవిస్తున్నాడా? అని ఇప్పుడు విమర్శిస్తే అందులో ఒక్కటీ నిజంగాదని స్పష్టమౌతుంది. చంద్రునికళ పెరగడం లేదు, తరగడంలేదు. ఎప్పుడైనాసరే చంద్రగోళంలో సగానికి పగలు, సగానికి రాత్రి. భూమివైపున్న చంద్రలోకవాసులకు అమాస్యనాడు రాత్రి, పూర్ణిమనాడు పగలు.

చంద్రుని వృద్ధిక్షయాల యథార్థానికి నిజం గావు! —"వసంత."

128. సిగ్గు చింతమొక్క ఆకుల్ని ముడిచేస్తుందేం?

అని ఎలమంచిలినుంచి అజ్జరపు ప్రకాశరావుగారు అడిగేరు.

మొక్కలకి కూడా నరాల లాంటివి ఉంటాయనీ, బాధపడడము మొక్కలకి కూడా వున్నదనీ జగదీశ చంద్రబోసుగారు నిరూపించారు. సిగ్గుచింత (అత్తపత్తి) మొక్కని ముట్టుకున్నా, అగ్గిపుల్ల వెలిగించి వేడిని చూపించినా దాని దళాలన్నీ ముడిచేసుకుంటాయీ, రెమ్మలన్నీ మనము చేతులు వేలవేసినట్లు వాలిపోతాయీ, మొక్క అంతా ముళ్ళకంపలాగ కనబడుతుంది. (అత్తపత్తికి ముళ్ళు కూడా ఉంటాయి) అందువల్ల ఆ మొక్కని పశువులు వదిలేసి వెళ్లిపోతాయి. ఈ ముడుచుకోడము మొక్కకి ఆత్మరక్షణకోసమన్న మాట.

అయితే, ఇలా ముడుచుకున్నప్పుడు మొక్కలో జరిగే మార్పులేమిటి? ఏ మొక్కైనా తాను వేళ్లద్వారా పీల్చుకున్న నీటిని కొమ్మలకీ రెమ్మలకీ ఆకులకీ సప్లై చేస్తుంది. ఇలా పైకి వచ్చిన నీరు ఆకుల క్రిందివైపుఉన్న స్తోమాలన్న చిన్న రంధ్రాలగుండా నీటిఆవిరి రూపాన్ని బయటికి పోతుంది. అత్తపత్తిలో ఈ నీటి ప్రసారమే ఆకుల్ని చాచినట్టు పట్టి ఉంచుతోందంటారు శాస్త్రజ్ఞులు. పాఠశాలలోని ప్రయోగశాలలో చిన్న పైపుకి రబ్బరుగొట్టాము తగిలించి, వైపు విప్పితే, మెలికలు మెలికలుగా తిరిగివున్న గొట్టాము నీటి ప్రవాహమువల్ల గభీమని తిన్ననౌతుంది. అత్తపత్తి రెమ్మలు నిటారుగా ఉండడానికి కారణము కొమ్మలలోంచి రెమ్మలలోకీ, ఆకులలోకీ ప్రసరించే రసప్రవాహమే అని శాస్త్రజ్ఞుల నమ్మకం.

మనుష్యులుగాని, పశువులు గాని ఈ మొక్కని తాకినప్పుడు దాని నరాలు ఈ రసప్రవాహాన్ని గభీమని ఆపేస్తాయిట. అందువల్ల కొమ్మలలోంచి రెమ్మలకీ, రెమ్మలనించి, తొడిమల్లోంచి ఆకులికీ అందే రసము నిలిచిపోయి, పైన చెప్పిన రబ్బరుగొట్టములాగు, రెమ్మలూ తొడిమలూ వాలిపోతాయి.

నిద్రగన్నేరుచెట్టూ, చిక్కుడు తీగా, పగలు ఆకుల్ని చాపి, రాత్రివేళ ఆకుల్ని వాల్చెయడానికి కూడా ఇలాంటిదే కారణమట. ఆకుల స్తోమాల్లోంచి ఇగిరిపోయే నీరు చల్లనైన నిశీధవేళలో తక్కువగా వుంటుంది. పగలు ఎక్కువ. కనక పగలు చాచుకుని నిటారుగా ఉన్న ఆకులు రాత్రిపూట వాలిపోతాయి.

రసప్రసారపు హెచ్చుతగ్గులవల్ల కాక నరాల క్రియవల్లనే మొక్కలు తమ అవయవాల్ని కదపడము కూడా కద్దు. కొన్ని మాంసాహారి మొక్కలు ఆకులకు మెత్తని ముళ్ళలాంటి కేసరాలుంటాయి. ఈగలుగాని, తుమ్మెదలు గాని ఈ ఆకులమీద వాలగానే ఈ కేసరాలు ముడిగిపోయి ఆ పురుగుని కదలకుండా పట్టేస్తాయి. తర్వాత జీర్ణద్రవాలు ఆ పురుగుచుట్టూ ద్రవించి, దాని 'నెత్తురు'ని జీర్ణము చేసేసుకుంటాయి. ఎందుకూ పనికిరాని ఆ పురుగు 'కళేబరము' ఈ హింసాకాండ అయిపోయిన తర్వాత, కేసరాలు తెరుచుకోడమువల్ల గాలికి ఎగిరిపోతుంది.

మొక్కలలో చలనమున్నది. వేళ్ళు చీకటివైపూ, భూమివైపూ సాగిపోతాయి. కాండము వెలుగువేపూ, పైవైపూ పెరుగుతుంది. లతల కొనలు గాలిలో ఆధారముకోసము చిన్న చిన్న సర్కిల్సు కొడతాయి. కొన్ని ఎడారిమొక్కలు, తమ వేళ్ళకి కావలసినంత నీరు అందనప్పుడు వేళ్ళని భూమిపైకి లాగేసుకుని. గుండ్రంగా తీగల బంతిలాగ తయారౌతాయి. గాలికి యీ 'బంతి' దొర్లిదొర్లి, చివరికి తేమనేల చేరిందంటే, అక్కడ వేళ్ళని భూమిలోకి పంపి, వలస ఏర్పరుచుకుంటుంది. ఇది మొక్క అంటారా? జంతువంటారా?

చిట్టిప్రశ్నలకు జవాబులు

—అవును. మంచుముక్కలతో ఉప్పు కలిపితే మంచు ఇంకా చల్లబడుతుంది. ఉప్పును నీటిలో కరిగించినప్పుడు కూడా ఆనీరు చల్లబడుతుంది. ఇలాగే హైపో అనే లవణాన్ని నీటిలో కరిగించినా ఆనీరు చల్లబడుతుంది. ఈ లవణాలు నీటిలో కరగడానికి కొంతశక్తి అవసరము. ఆశక్తిని నీటియొక్క వేడిమిలోనుంచి గ్రహిస్తాయి ఆ లవణాలు. అందువల్ల నీరు చల్లబడుతుంది. మంచుకూడా నీరే కదూ? ఆ నీటిలో ఉప్పులు కరిగినప్పుడు మంచునీరు కూడా చల్లబడుతుంది.

—కాకికి ఒకే కన్ను ఉంటుందన్న నమ్మక తప్పు. కాకి కళ్లు దాని తలకి ఇటూ అటూఉంటాయి కనక, అది పశువులు తిప్పినట్లే తలతిప్పి చూడాలి ఏవస్తువైనా. ఇది చూచినవారికి అది ఒంటికంటి దృష్టి గలిగినదనే నమ్మకము కలుగుతుంది.

—సంతానము కలుగక పోవుటకు భార్యాభర్తలలో ఎవరిలోనైనా కావచ్చును. సాధారణముగా భార్య గర్భాశయముల తిరకాసే కారణము.

—ఎడారులలో వర్షము తక్కువ. కనక ఒయేసిస్సులలోని నీరు భూగర్భంలోని జలలవల్లే ఏర్పడుతుంది అని ఊహించడము రైటే.

—భూమినుండిసూర్యునికి 9,28,70,000 మైళ్లు. భూమినుండి చంద్రునికి 2,40,000 మైళ్లు. భూగోళపు వ్యాసము (అడ్డకొలత) 7927 మైళ్లు. భూగోళమంత గోళాలు 12,95,000 గోళాల్ని ముద్ద చేస్తేసూర్యగోళమంతటిది ఏర్పడుతుంది. చంద్రుడు భూమికంటె చాలా చిన్న. అయినా చంద్రబింబము అంత పెద్దదిగా కనబడడానికి అది భూమికి చేరువగా ఉండడమే కారణము.

★





యక్షదంపతులు

[అజంతాచిత్రాలకి బి. వి. నరసింహారావుగారు(పాలకొల్లు)
తయారుచేసిన ప్రతికృతులు]

బొమ్మరిల్లు

చక్కని పాపాయి

★

శ్రీ బొడ్డు బాపిరాజు

చిరునవ్వు చిలికేటి చిన్నారి మొగము
ఎక్కడ దొరికెనే? చక్కని పాప!

చుక్కల చెలికాడు సొగసైనవాడు
మనసుచల్లని చందమామ యిచ్చాడు.

కాంతులు వెదజల్లు కలికి కందోయి
ఎక్కడ దొరికెనే? చక్కనిపాప!

నీలాల కోనేట పాల వెన్నెలను
జలకమాడే కలువ చెలువ లిచ్చారు.

పాల నురుగులు తేలు పవడాల మోవి
ఎక్కడ దొరికెనే? చక్కని పాప!

తియ్యన్ని పండ్లేరి తిను రామచిలుక
కెంపుల తనముక్కు గిల్లి యిచ్చింది.

చిన్ని నీ నెన్నుదుట జీరాడు కురులు
ఎక్కడ దొరికెనే? చక్కని పాప!

పైడి తామరలపై పవ్వళించేటి
ఎలతేటి రెక్కలే ఎరువిచ్చినాయి.

భ్రమతలు పుట్టించు బంగారుమేను
ఎక్కడ దొరికెనే? చక్కని పాప!

చూచినంతనె మనసు చూరలాడేట
పనసపళ్లా తొనలు బదులిచ్చినాయి.

ఎవ్వరి దానవే ఎవరివే నీవు
ఎక్కడ దొరికావె? చక్కని పాప!

దేవుణ్ణి వరమడిగి తెచ్చె మా అమ్మ
అమ్మఒడిలో నాన్న అందుకున్నాడు.

అద్దె బోటులో—

ముచ్చటగా ముగ్గురు

(కుక్క సంగతి సరే సరి!)

5

మరునాటి రోజు వుదయం మిసెస్ పోపెట్స్ మమ్మల్ని నిద్దర లేపింది. తలుపుకంతలో నోరు పెట్టి, ఆవిడ 'తొమ్మిది గంటలైంది; నిద్ర లెమ్మ'ని అరవగా అరవగా, నాకే ముందుగా మెళుకువ వచ్చింది.

నిద్రమైకంలో ఆవిడ ఏమంటున్నదో నాకు వెంటనే బోధపడలేదు: "ఏమిటైందంటున్నా" వని గద్దించి అడిగాను.

"గంట; తొమ్మిదైందంటున్నాను" అని ఆవిడ మళ్ళీ చెప్పింది. నాకప్పటికి జ్ఞాపకం వచ్చింది—ఆవేళ మేము ఆరుగంటలకే బయలుదేరి పోవాల్సివుందని. వెంటనే హారిస్నుగాణ్ణి తట్టి, తిట్టి, కొట్టి నిద్రలేపాను.

వాడు ఆవలిస్తూనే "ఆరు గంటలకే లేద్దామని రాత్రి అంతసేపు వాదిస్తివిగదరా?" అన్నాడు—అక్కడికి నన్నేదో ఎద్దేవా చేస్తున్నట్లు.

"అవును; అనుకొన్నాను! మరి నువ్వెందుకు లేపలేదు?" అని వాడిమీదికే తప్పంతా తిప్పేశాను.

"నేనెలా లేప్రనా? నువ్వేమైనా నన్ను లేపి తేగా?" అంటూ వెధవ తెలివితేటలు బయటపెట్టబోయాడు.

"అన్నట్లు—ఒరే—మనం ఎలాగూ యీవేళ మధ్యాహ్నం పన్నెండు దాటాకకానీ నది ఒడ్డుకి చేరుకోలేం కదా?" అన్నాడు—తనని మరికొంతసేపు అలాగే పడుకోనిమ్మనే ధోరణిలో.

"ఏడవలేకపోయావ్! ఇప్పటికైనా నేను లేపబట్టి సరిపోయింది కానీ, లేకపోతే మళ్ళీ కృష్ణపక్షం వచ్చేదాకా యిలాగే పడి నిద్రపోవలసినవాడివి" అన్నాను. దాంతో వాడికీ వొళ్లు మండుకొచ్చినట్లుంది. నన్ను ఛడామడా తిట్టడం మొదలుపెట్టాడు. నేనూ వాణ్ణి అంతకంటే గట్టిగా తిట్టేశాను.

నిరాఘాటంగా సాగిపోతున్న మా తిట్ల దుమారం, వున్నట్లుండి ఒక్కసారిగా ఆ జార్జిగాడు పెట్టిన గురకతో ఆగిపోయింది. ఆ క్షణంలో వాడిగురకే గనక వినిపించకపోతే, జార్జి అనబడేవాడు ఒకడుండే వాడన్న విషయంకూడా మేము మరచిపోయి, హామేషా అల్లా ఒకరినొకరు తిట్టుకొంటూనే వుండిపోయేవాళ్లం. గడచిన రాత్రి మా యిద్దరినీ ఎన్ని గంటలకి నిద్ర లేపమంటారని అడిగిన పెద్దమనిషి, తెల్లవారి తొమ్మిది గంటలైనా లేవకుండా, దాక అల్లే నోరు తెరుచుకొని నిద్రపోతున్నాడు.

అల్లా ఎందుకు జరుగుతుందో చెప్పలేను కానీ-

మూలం :
జెరోమ్ కె. జెరోమ్

★

అనువాదం :
విశ్వాత్ముల నరసింహమూర్తి

★ ముచ్చటగా ముగ్గురు ★

నేను మేలుకొని వుండగా మరొకాడు నిద్రపోతూ వుంటే, నాకు వొళ్లంతా తేళ్లూ జెర్రులు పాకినట్లు అవుతుంది. జీవితకాలం తపస్సు చేసినా తిరిగిరాని కాలాన్ని వాడు ఆవిధంగా వృధాగా నిద్రపోతూ గడిపేస్తున్నాడంటే, నేను పడే మనోవేదన ఇంతాఅంతా కాదు.

జార్జిగాడు ఆ వరసని కాలాన్నంతా నిద్రలో గడిపేస్తుంటే నాకు నిజంగా చాలా బాధవేసింది. అసలే మానవ జీవితం అత్యల్పం. అందులోనూ యిలాగ గంటలకి గంటలు నిద్రలో గడిపేస్తే రేపు ఆస్పృష్టికర్త దగ్గర వీడు ఏమని సంజాయిషీ చెప్పుకొంటాడూ? కాలాన్నంతా యిలా వృధాగా గడిపెయ్యకపోతే, లేచికూర్చొని పొట్ట పగిలేటట్లు తినవచ్చునే; లేదా ఆ కుక్కని ఏడిపించవచ్చు: అది కాకపోతే—ఎవడి దగ్గిరైనా పనికికుదిరి బానిసగా బ్రతుకు వెళ్ల దీసుకోనూవచ్చు. అంతేగాని యిల్లా ఎందుకూ కొరగాని నిద్రపోతే ఏం ప్రయోజనం చెప్పండి!

నామనస్సులో యీమాదిరి ఆలోచనలు మెదలటంతో నాకు ఆ జార్జిగాడి మీదా, వాడిని పుట్టించిన దేవుడిమీదా కోపంవచ్చింది. ఆ హారిస్సుగాడి మెదడులో కూడా సరిగ్గా యివేమాదిరి ఆలోచనలు మెదిలినట్లున్నాయి: వాడూ, జార్జికేసి చూస్తూ బుసలు కొట్టుతున్నాడు. ఎల్లాగైనా సరే జార్జిగాడిని వుద్ధరించాలనే పట్టుదలలో పడి, హారిస్సూ, నేనూ మాపోట్లాట సంగతే మరిచిపోయాం. ఇద్దరం వాడిమీద విరుచుకుపడ్డాం. వాడు కప్పుకొన్న బట్టలన్నీ విసిరిపారేశాం. హారిస్సు వాడి చెంపమీద చెళ్లున కొట్టాడు. నేను వాడిచెవులో నోరుపెట్టి 'గుంయ్' మన్నాను. దాంతో వాడు 'ద..ద్ద..ద్ద..' అంటూ లేచి కూర్చున్నాడు.

"లేవరాగాడిదా! అప్పుడే పావుతక్కువ పది అయింది. లే!" అంటూ హారిస్సు బిగ్గరగా అరిచాడు.

"ఏమిటీ? పావు తక్కువ పదిఅయిందా!" అంటూ అదుర్దాగా లేచిన జార్జి, సరిగా చూసుకోకుండా మంచం క్రింద పెట్టివున్న నీళ్లతొట్టిలో అడుగేశాడు. కింద పడబోయి "ఏగాడిద పెట్టాడురా యీతొట్టి నిక్కడ?" అంటూ మావంక కొరకొరా చూశాడు.



"కళ్లు కనపడక తొట్టిలో అడిగేసి, మామీద పడి ఏడుస్తావేమ"ని వాడికి యింత గడ్డిపెట్టాం, యిద్దరమూ కలిసి.

ఆవిధంగా మరికొంతసేపు కాలక్షేపం జరిగింది. ఇంతలో మేమెవ్వరమూ మొఖాలైనా కడుక్కోలేదనే మాట జ్ఞాపకానికి వచ్చింది. టూత్ బ్రష్‌ల కోసం మామూలుగా పెట్టెగూట్లో వెదికితే, అవి అందులో కనిపించలేదు. ఎలా కనిపిస్తాయి?— నిన్నరాత్రే వాటి నన్నిటినీ కట్టకట్టి బస్తాలో పడేశాముగా! చచ్చినట్లు కాళ్లీడ్చుకొంటూ మేడమెట్లు దిగి, బస్తాకి కట్టిన తాళ్ళన్నీ వూడదీశాం. అందులో సామానంతా కుళ్లగించి, టూత్ బ్రష్‌లు బయటికితీసి, బస్తా మళ్ళీ మామూలుగా బిగించాం.

జార్జి తనకి క్షవరం సామాన్లు కావాలన్నాడు. అవికూడా బస్తాలోనే వున్నాయి. తడవ తడవికీ బస్తా విప్పుతూ కట్టుతూ వుంటే, యీపని ఎప్పటికీ తెగదని, జార్జికాదుకదా, వాడితల్లో జేజెమ్మ దిగివచ్చినాసరే,

యిక బస్తామూతి విప్పటానికి వీలులేదని ఖండితంగా చెప్పేశాం.

"మాసిన గడ్డంతో వీధిలోకి ఎల్లా పోమ్మంటారురా?" అని జార్జిగాడు ఒకశేగోల. నిజమే—ఇల్లాంటి మహాపట్టణంలో మాసిన గడ్డంతో తిరగటం మంచిదికాదు. చూసేవాళ్లు చాలా నొచ్చుకొంటారు. కాని, అప్పటి మా పరిస్థితిలో జనం ఏమైనాసరే, జార్జి మాత్రం గడ్డం చేసుకోవటానికి వీల్లేదని మేము పట్టుపట్టాం.

చప్పు చప్పున ఫలహారాలు పూర్తిచేసేద్దామని ముగ్గురమూ మళ్లా మెట్లుదిగి క్రిందికి వెళ్లాం.

మా మాంటీ మొరస్సీగాడు, ఎక్కడ పోగు చేశాడో కాని, తనతోపాటు విందుకి మరి రెండు వీధి కుక్కలని వెంటబెట్టుకువచ్చాడు. ఆ కుక్కలు రెండూ యీ కుక్కకి ఎంతో కావలసిన మిత్రుల్లే వుంది. తాను ఎలాగూ వూరు వదిలిపెట్టిపోతున్నది కనుక, తనకి వీడ్కోలు యివ్వటంకోసమే ఆ రెంటినీ వెంటబెట్టుకు వచ్చినట్లుంది. మూడూ కలిసి వీధిగుమ్మంలో చేరి కాట్లాడుకోవటం మొదలుపెట్టాయి. వాటిధోరణి మాకు నచ్చలేదు. కొంకికి తగిలించిన గొడుగు తీసి, మూడింటికీ దేహాశుద్ధిచేసి తరిమేశాం.

ముగ్గురమూ టేబుల్ దగ్గర కూర్చున్నాం. హారిస్సు దినపత్రిక తీసి, ఏ నదిలో ఏ పడవ మునిగిపోయిందో, ఎందరెందరూ చచ్చిపోయారో అదంతా బిగ్గరగా చదివి వ్యాఖ్యానించి చెప్పాడు. ఆ పని పూర్తి అయ్యాక వాతావరణ సూచనలు చదవటం మొదలుపెట్టాడు. నాటి వాతావరణంలో వల్లమాలిన మార్పులు రాబోతున్నాయనీ, బ్రహ్మప్రళయంగా వురుములు మెరుపులు పిడుగులతో వర్షించబోతున్నదనీ, మధ్య మధ్య చలిగాలులు వీస్తాయనీ, అపరాహ్ణ

(40-వ పేజీ చూడండి)

దిష్టిచెంబు

వీధిలో గుఱ్ఱబ్బండి ఆగిన చప్పుడయింది... ఎవరొచ్చారా? అని చదువుకొంటున్న నేను, మా గాయిలో ప్రశస్తమైన యింగువ కలుపుతున్న మాబామ్మ, అందరికంటె, ముందర బయటికి వచ్చాము. మావదిన కూడా వచ్చింది; అందరూ వచ్చిన తర్వాత. వాళ్ళతమ్ముడు రేపో మాపో వస్తున్నాడని వుత్తరం అందటంవల్ల వచ్చింది ఆయనేనేమోనని బయటకి వచ్చిందన్నమాట. మా రామంఅన్నయ్య మాత్రం బయటకురాలేదు. వాడి పుస్తకం బాగుంటే ఎవరెలా పోయినా వాడు పట్టించుకోడు. యించుమించు యింటిల్లపాదీ బయటకి వచ్చేశాము...

జట్కాలోంచి గుమ్మంమీద దిగుతున్నాడు లోపలవ్యక్తి. కాళ్ళ జోడు ముందు కనపడింది. గోధుమ వర్ణంలోనున్న కాబూలీ శాండల్స్. ఇంతా చేస్తే మా ప్రభాకరుడు కాదుకదా! అనుకొన్నాను. అతనికీ అట్లాంటి జోడే ఉంది. ఇంకెవరికీ అట్లాంటి జోళ్ళు ఉండవా? దిగాడు ఆవ్యక్తి. మా ప్రభాకరం కాదు. మావదిన తమ్ముడే వస్త. ఇంకేం! మా వదిన మనస్సు ఆనందంతో వుప్పొంగిపోయింది! కాళ్ళు కడుగుకోటానికి నీళ్ళు తెద్దామని లోపలకి వెళ్ళింది. మా బామ్మ "లోపలికి రా నాయనా! అందరూ కులాసాయేనా" అని కుశల ప్రశ్నలు వేసింది. మా అన్నయ్యకి యీయన ఎన్నిరోజులు యింట్లో తిష్ఠ వేస్తాడో అని మనస్సులో పీకుతూనే ఉంది... కాసేపు ఆయన్ని వేళాకోళం చేసి ఏడిపించవచ్చు అని తమాయించుకొన్నాడు.

ఇంతలో కాశీబిందె అంత ఉన్న చెంబుతో నీళ్ళు తెచ్చి యిచ్చింది మా వదినె.

'రాధాప్రియ'

"గుంటూరులో నీళ్ళులేక అలమటిస్తుంటే, నువ్వు ఏకంగా అన్ని గేలన్ల నీళ్ళు యిచ్చావేమిటమ్మా" అన్నాను. మా అన్నయ్య సిగరెట్టు కాల్చుని పెదవులమీద చిరునవ్వు... తాంబూలంచేత ఎఱ్ఱబడ్డ మావదిన పెదవులమీద చిరుకోపం... ఈ రెండూ కనిపించాయి. "ఛా! వూరుకుందూ బాగుండదు. రాక రాక వచ్చేడు" అని కసిరింది మా బామ్మ. సరే! పాద ప్రక్షాళనానికి వీలుగా కొత్తపేంటు మడచి, కాబూలీ శాండల్సు విడిచి చెంబు మొయ్యలేక మొయ్యలేక చేత్తో పట్టుకొని తీరా కాళ్ళమీద వంపుకొనే టప్పటికి, నీళ్ళతో బాటు మిరపకాయ ముచికలు, తలవెంట్రుకల తుక్కు... కాళ్లమీద పడ్డాయి. ఎంత ఆపుకొన్నా నవ్వు ఆగలేదు. మా బావగారి ముఖం అణాకాసంత అయింది. మావదిన ముఖాన్ని నెత్తురు చుక్కలేదు. మా బావగారు గబగబ నూతివద్దకు వెళ్ళారు, కాళ్ళు కడుకొనటానికి. ముందర వెడితే ఏం? బద్ధకం కాకపోతే"

"అదేమిటే! రమకి దిష్టి తీద్దామని ఉంచిన చెంబులోని నీళ్ళు కాళ్ళు కడుక్కోడానికి యిచ్చావా?" అంటూ మా బామ్మ సాగదీసింది.

"నాకేం తెలుసు' మనయింట్లో అల్లాంటి చెంబులు ఉన్నవి. రెండూ ఒకే మోస్తరుగా ఉంటాయి. చాలసార్లు పొరపడ్డాను ...వంటింటి తలుపు వేసే టప్పుడు ఒక చెంబు నిండా నీళ్ళుముంచి గుమ్మం దగ్గర పెట్టి వచ్చాను. ఎందుకైనా అవసరం వస్తుందని. మళ్ళీ తలుపుతీసి వెళ్ళేటప్పటికి అక్కడే ఉంది ఈ చెంబు. అదే అనుకొని తెచ్చేశాను" అంది మా వదిన.

"గొప్పపని చేశావు..." అని వెక్కిరించాడు మా అన్నయ్య.

"అయితే నేను పైన బడ్డీమీద పెట్టిన చెంబు కింద కెలా వచ్చింది?" అని అడిగింది అమ్మమ్మ. ఇంతలో మారంగడు నవ్వుకుంటూ బయటకి పరుగు తీశాడు.

"వెధవ! యింత సేపయింది గదిలోకి వెళ్ళి ఏం చేస్తున్నాడో" అనుకున్నాను. "నువ్వా చేస్త ఈపని?" అని మా అన్నయ్య

★ దిష్టి చెంబు ★


తిట్టాడు వాణ్ణి, లోపల తిట్టాలని లేకపోయినా!

"యివాళ రవుకు కాదు దిష్టి తీసింది. మా బావగారికి" అన్నా నవ్వుతూ.

"ఆ పోనీలెండి ఖంగారులో పొరపాటులెండి" అని వాళ్ళ అక్కయ్య పొరపాటుకి సద్దుకొన్నాడు.

"మనం వేళాకోళం చేస్తే బాగుండదని వాళ్ల అక్కే చేసిందిరా వేళాకోళం" అన్నాడు నన్ను ఉద్దేశించి మా అన్నయ్య.

"ఊ, జరిగిందేదో జరిగింది. భోజనానికి లే బాబూ" అంటూ మా అమ్మ మా వదినని వడ్డించమని చెప్పి తను దొడ్లో చింతకాయలు ఎండవేసుకోటానికి వెళ్ళింది. మా బావ వంటింట్లో నడుస్తుంటే, ఆయన కాలి మడమకు అంటుకొన్న మిరపకాయ తొక్కను చూస్తూ కూర్చుండిపోయాము. ★



"జట్కాలోంచి దిగుతున్నాడు. కాళ్ల జోడు ముందు కనపడింది"

అంగుళిమాల

ఎన్నడో జరిగిన గాథయిది. మన దేశంలో జైన మతస్థులూ, బౌద్ధ మతస్థులూ బాగా బతికిన దినాలలో జరిగిన గాథయిది. గజ దొంగగా పేరుమోసిన ఒక బ్రాహ్మణుడు బౌద్ధ భిక్షువుగా మారి పోయిన వృత్తాంతాన్ని కళ్లకు కట్టినట్లుగా చిత్రిస్తుంది యీగాథ.

పూర్వం కోసల దేశంలో భార్గవుడనే బ్రాహ్మణుడు వుండేవాడు. ఆయన రాజపురోహితుడు. అందువల్ల సిరిసంపదల కేమీ కొరతలేకుండా సౌఖ్యంగా కాలం గడుపుతూ వుండేవాడు. ఆయనకి లేక లేక ఒక కుమారుడు కలిగాడు. భార్గవునికి పట్టపగ్గాలు లేని సంతోషం కలిగింది. తనహోదాకు తగినట్టుగా బంధువులకూ, స్నేహితులకూ విందులు చేశాడు. బీదవాళ్ళకు తిను బండారాలూ, అవీ యివీ పంచిపెట్టాడు. దేవాలయాల్లో అభిషేకాలు చేయించాడు. కుమారునికి హింసకుడు అని పేరుపెట్టాడు. హింసకుణ్ణి చూడవచ్చే పండితులూ, పెద్దలూ- అందరూ కూడా – 'చాలా కాలం బతికివుండు నాయనా' అని మనస్ఫూర్తిగా దీవించేవాళ్లు. కాని భార్గవుడు మాత్రం విచారంగా వుండేవాడు. ఒకనాడు ఒక జ్యోతిష్కుడు వచ్చాడు. హింసకుడి జాతకం చూస్తూ,'మీవాడు గజదొంగ అవుతాడండి' అన్నాడు ఆ జ్యోతిష్కుడు. ఈవిషయం భార్గవుడికి తెలుసు. అందుకనే కుమారునికి హింసకుడని నామకరణం చేశాడు.

పెద్దవాడవుతున్న కొద్దీ హింసకుడు మహాబలశాలి అని పేరు ప్రతిష్ఠలు పొందాడు. బలంలోనే కాకుండా చదువు సంధ్యల్లోకూడా గొప్పవాడనిపించుకున్నాడు. తక్షశిల విద్యాలయంలో హింసకుడు కొంతకాలం విద్యాభ్యాసం చేశాడు. హింసకుని బుద్ధి విశేషాన్ని, బాహుబలాన్నీ గుర్తించి, అతణ్ణి ఎట్లయినా నాశనం చెయ్యాలని సంకల్పించి ఒకనాడు,

శ్రీ చల్లా రాధాకృష్ణ శర్మ

'హింసకా – విద్యాభ్యాసం పూర్తయింది కాబట్టి గురుదక్షిణ కింద ఏమిస్తావు?' అని గురువు ప్రశ్నించాడు. 'తమకేది యిష్టమో అదే కోరండి' అని నిజమైన వీరునివలె హింసకుడు సమాధానంయిచ్చాడు. అందుకు సంతోషించి గురువుగారు 'అట్లయితే వెయ్యమంది మనుష్యుల కుడిచేతుల వేళ్లు గురుదక్షిణగా సమర్పించు' అని ఆజ్ఞాపించారు. హింసకుడు సహర్షంగా సరే అన్నాడు.

కావలసిన పరికరములను సమకూర్చుకుని వెంటనే హింసకుడు కోసల దేశానికి ప్రయాణమై వెళ్లాడు. ఒక పెద్దఅడవి కనబడింది. ఆ అడవిలో ఒక పెద్ద దిబ్బ. ఆ దిబ్బను నివాసంగా చేసుకున్నాడు హింసకుడు. ఆ అడవి మార్గం గుండా వచ్చేపొయ్యే బాటసారులను గమనిస్తూ వుండేవాడు హింసకుడు. ఆబాటసారులను చూసీ చూడటంతోనే అమాంతంగా వారిపై పడి దక్షిణకోసం గురువుగారి ఆజ్ఞను అక్షరాలా నిర్వహిస్తూ వుండేవాడు. ఈవిధముగా నరికిన వేళ్లను ఎండబెట్టేవాడు. అప్పుడు గద్దలు, కాకులు ఆవేళ్లను చుట్టుముట్టు మాంసం తినివైచి ఎముకల్ని మాత్రం మిగిల్చేవి. ఎముకలుగా వున్న ఆవేళ్లను హింసకుడు ఒక దండగా గుచ్చి, ఆదండను మెడలో వేసుకునే వాడు. కొన్నాళ్లయ్యేసరికి హింసకుడిపేరు దశదిశలు మారుమోగి పోయింది. ఎక్కడ విన్నా హింసకుని గురించినమాటలే. పాలుతాగే పసిపాపలు కూడ హింసకునిపేరు వినేసరికి గజగజ వణికిపొయ్యేవారు. అరణ్యంలో వుండే బాటలన్నీ జనశూన్యములైనవి. వేళ్లదండను ధరించడం బట్టి హింసకునికి 'అంగుళిమాల' అనే పేరు కలిగింది.

అంగుళిమాల వృత్తాంతం వినే సరికి కోసలదేశం రాజుగారికి అంతులేని ఆగ్రహం వచ్చింది. బలిష్ఠులైన కొంతమంది సైనికుల్ని పిలిచి, 'అంగుళిమాలను వెంటనే పట్టి తీసుకు రావలసింది' అని ఆజ్ఞాపించాడు. రాజాజ్ఞకు బద్ధులై ఆ సైనికులు అరణ్యానికి వెళ్ళారు.

ఈవిషయం అంగుళిమాల తల్లికి తీరని విచారం కలిగించింది. ఆమె

హృదయం ముక్కలు ముక్కలయింది. ఘోడు ఘోడున విలపిస్తూ ఆమె భర్తతో ఈవిధంగా చెప్పింది: 'ఏవిధంగా నైనను సరే హింసకుడు బ్రతికేమార్గం చూడండి. రాజుగారి కోపాగ్నికి వాడు బలికావడం నేను సహించలేకుండా వున్నాను. కనుక హింసకుడికి బుద్ధులు చెప్పి వాడి జీవితాన్ని కాపాడండి.' కాని కన్న కుమారుడనే మమకారం కూడా లేకుండా గజదొంగ కాబట్టి తప్పక వాడు శిక్షింపబడవలసిందే అని ఆయన సమాధానం యిచ్చాడు. ఇక భర్తను ప్రార్థించడంలో ఆవగింజంతయినా లాభం కలుగబోదని నిశ్చయించి, కన్న కుమారుని శ్రేయస్సుకై, నడుము బిగించి, 'దుర్మార్గుడైనా సరే నాబిడ్డ నాకు బరువు కాదు. వాణ్ణి మందలించి మంచిదోవలోకి తీసుకు వస్తాను' అని భర్తతో చెప్పి, అతని అనుమతిని పొంది ఆమె అంగుళిమాల వున్న దిబ్బ దగ్గరికి వెళ్లింది.

ఈవిషయము లన్నిటినీ బుద్ధదేవుడు తెలుసుకున్నాడు. అంగుళిమాలపై అవ్యాజమగు వాత్సల్యం కలిగింది. 'గురుదక్షిణ కోసం తల్లిని కూడ అంగుళిమాల తప్పక బాధిస్తాడు. ఈజన్మయే అతనికి చివరిది. కనుక యీ సమయంలో అక్కడికి నేను వెళ్లి అంగుళిమాలను సన్మార్గంలోకి తెస్తాను.' అని బుద్ధదేవుడు అనుకున్నాడు. వెంటనే ముప్పదిమైళ్లు నడిచి బుద్ధుడు అంగుళిమాల వుండే ఆ దిబ్బను చేరుకున్నాడు.

అదే సమయానికి అంగుళిమాల తల్లి కూడా దిబ్బ దగ్గరికి వచ్చింది.



''అట్టయితే వెయ్యిమంది కుడిచేతులవేళ్లు గురుదక్షిణగా సమర్పించు.'' అని గురువుగారు ఆజ్ఞాపించారు.

తల్లిని చూచినంతనే అతడికి ఎక్కడ లేని సంతోషం కలిగింది. 'మా అమ్మ వేళ్లను కూడా దండలో గుచ్చుతాను. నేటితో నేను తలపెట్టిన పని పూర్తవుతుంది.' అని అనుకున్నాడు. ఇంతలో బుద్ధుడు వాళ్లిద్దరి మధ్య ప్రత్యక్షమయ్యాడు. 'వేళ్లకోసం అన్యాయంగా మీ అమ్మను చంపడ

(55-వ పేజీ చూడండి)

మామూలు

శ్రీమతి దావులూరి సీతాదేవి

పూర్వంఒక గ్రామంలో సోమయ్య అనే ఒక బీద వైశ్యుడు వుండేవాడు. అతనికి పొలం పుట్రా ఏమీ లేదు. ఒక చిన్న ఇల్లు మాత్రం వుండేది. బీద వారికి సంతానం ఎక్కువ. పాపం తొమ్మిది మంది బిడ్డలను పోషించుకొనుటకు ఆ భార్యా భర్తలు చాలా కష్టపడుతూ వుండేవాళ్ళు.

సోమయ్య తనస్థలంలో ఏహో సాలైదు రకముల కూరగాయలు కాయించి అవి అమ్ముకొని కొంత వరకు సంసారం గడుపుతున్నాడు. ఒక తడవ ఆరు సొరకాయలు తీసుకొని ఒక చిన్న బస్తీకి బయలుదేరాడు. బస్తీలో అడుగు పెట్టగానే సోమయ్యకు ఒక వెట్టివాడు కనబడి, 'ఎవరు నువ్వు ఎందుకొచ్చావు' అని అడిగాడు. సోమయ్య తన సంగతి చెప్పాడు. వెట్టివాడు అది విని "మా కరణం గారికి నాకూ మామూలు చెల్లించనిది, నీవు ఈవూళ్లో సొరకాయలు అమ్మటానికి వీల్లేదు. అట్లా అమ్ముకున్నావా, తర్వాత చాలా చిక్కుల్లో పడతావు జాగ్రత్త. ముందు రెండుకాయ ‿ ఇట్లా పడేసి తర్వాత కదులు" అని గదమాయించాడు. పాపం సోమయ్య నిజమే ననుకొని రెండుకాయలు వాడికిచ్చి ముందుకు సాగాడు.

దోవలో ఒక పోలీసు కనబడి 'ఎవరు నీవు' అని అడిగాడు. సోమయ్య తన సంగతంతా చెప్పి, వెట్టివాడు తన సొరకాయలను కాజేశాడని చెప్పుకొన్నాడు. అది విని పోలీసు "ఈరోజులలో వెట్టివాళ్ళను కరణాలను అడిగేదెవరు? మాది పోలీసు డిపార్టుమెంటు. బియ్యందగ్గరనుంచి బట్టలదాకా మాకు సప్లై కాందే వ్యాపారం సాగదు గదా? ఇక నీసొరకాయల సంగతి వేరే చెప్పాలా! మా ఇన్స్పెక్టరికి రెండు, నాకు తక్కిన రెండు ఇక్కడ పెడితేనే సరి, లేకపోతే నీవు ఇక్కడనుంచి మీ వూరికి కూడా పోలే"వని భయపెట్టాడు. పాపం బీదసోమయ్య తక్కిన నాలుక్కాయలు వాడికి వప్పజెప్పి ఖాళీ గొంగళి నెత్తిన గప్పుకొని వచ్చినదారి పట్టాడు. దారిలో గ్రామమునసబుగారు ఎదురుపడి మామాలు ప్రశ్న వేశాడు. సోమయ్య తాను వచ్చినపని, జరిగిన అన్యాయం చెప్పుకొన్నాడు ఏమన్నా ఆలకిస్తాడేమోనని. దానికి మునసబుగారు కళ్ళెర్రజేసి "నామాటలేనిది ఈవూళ్లో ఒక్క వ్యవహారమే నా సాగదు, నా మామూలు ఇవ్వకుండా అందరికీ పంచిపెట్టావు. ముందు నీమీద వున్న గొంగళి అక్కడపెట్టి రేపు నామామూలు తెచ్చియిచ్చి మరీ నీగొంగళి తీసుకు వెళ్ళు" అని ఆ గొంగళి కాస్తా లాక్కున్నాడు. పాపం సోమయ్య దుఃఖానికి అంతు లేదు-ఇంటికి వెళ్ళేటప్పటికి తొమ్మిది మంది బిడ్డలు, భార్య, ఆకలితో మాడిపోతూ, సోమయ్య యేమి తెస్తాడో కడుపు నింపుకుందామని యెదురుచూస్తున్నారు. సోమయ్య

బిక్క మొహంతో కాళ్ళీడ్చుకొంటూ వచ్చి భార్యతో జరిగిన సంగతంతా చెప్పాడు. పాపం ఆ రోజు అంతా పస్తు

రాత్రంతా సోమయ్య నిద్రపోకుండా ఆలోచించాడు, ఈబీద బ్రతుకు ఎట్లాగా అని. చివరకు సోమయ్యకు ఒక ఉపాయం తట్టింది. తెల్లవారి పొద్దున్నే లేచి తన భార్యను పిలిచి "నీమెళ్ళో వున్న కాసు ఇట్లాయియ్యి నీకు వంటినిండా నగలు చేయించి పెడతాను. చూసుకో నాతమాషా" అని కాసు తీసుకొన్నాడు. ఇద్దరు గూర్ఖాల వద్దకు వెళ్ళి ఇట్లా అన్నాడు, "ఈ ఊరు చివర మంచినీటి బావి మా పూర్వులది. దానిమీద నాకు అధికారముంది. మీరు ఆ భావికి కాపువేసి ఎవ్వరి వద్దనైనా సరే బిందె మంచినీళ్ళకు కాసీ చొప్పున వసూలు చేయండి" అని ఆజ్ఞాపించి ఆ కాసు వారి చేతిలో పెట్టాడు. ఆచుట్టుప్రక్కల రెండు మూడు పల్లె గ్రామాలకు అది ఒక్కటే మంచినీటి బావి కావడంవల్ల సమయంకోసం ఎదురు చూస్తున్న కరణం, మునసబులు కూడ కాసీ చెల్లించి నీరు తీసుకుంటున్నారు. సోమయ్యకి నిర్విచారంగా కుటుంబ పోషణ జరిగిపోతోంది.

ఆదేశపు మంత్రిగారు ప్రజల కష్ట సుఖాలు విచారించే నిమిత్తం బయలుదేరి ఒకపూట ఆవూరులో కూడ బసచేశారు. మంత్రిగారి వంటవాడు మంచినీళ్ళకి ఆబావి వద్దకి వెళ్ళాడు. వాడుకప్రకారం పన్ను చెల్లించవలసివచ్చింది. వంటవాడు తిరిగివచ్చి యీ విషయం



మంత్రితో చెప్పాడు. మంత్రిగారు మండిపడి, సోమయ్యకు కబురు పంపాడు. సోమయ్య తనకు లంచగొండి ఉద్యోగులద్వారా జరిగిన అన్యాయాన్ని మంత్రిగార్కి విన్నవించుకొని "నాకు ఇంతకంటె జీవనోపాధి దొరకలేదు. మోసగించే ప్రపంచాన్ని మోసంతోనే గెలవాలని ఇలా చేశాను. ఏలినవారు న్యాయం విచారించండి" అన్నాడు. న్యాయబుద్ధి గల మంత్రి సోమన్న యుక్తికి మెచ్చుకుని బావిపై పన్ను శాశ్వతంగా సోమన్నను అనుభవింపమని వ్రాసి ఇచ్చారు. ★

★ ముచ్చటగా ముగ్గురు ★

(౩౩-పేజీ తరువాయి)

భాగంలో ఎప్పటికో ఆకాశం ప్రశాంతమయ్యే అవకాశం లేకపోలేదనీ సూచించబడింది.

మనని యీ జీవితంలో అనుక్షణమూ దగా చేసేవి చాలా వున్నాయి. వాటి అన్నింటిలోకీ యీ వాతావరణ సూచన లనబడేవి మరీ దగా చేస్తాయి. వాటితో వచ్చే పేచీ ఏమిటంటే—కావాలంటే మీరు ఏరోజైనా చూడండి—ఈ సూచనలు వ్రాసేవారు నిన్నటి వాతావరణం ఎల్లా వుందో అదంతా జ్ఞాపకం పెట్టుకొని అదే నేటిపరిస్థితిగా సూచించడం జరుగుతూ వుంటుంది.

ఇల్లాంటి దగాకోరు సూచనలు నమ్మకొనే, యిదివరకు ఒకసారి నిక్షేపంలాంటి శెలవు రోజు నాశనం చేసుకొన్నాం. ఆ కథ కూడా వివరిస్తాను. కొంచెం ఓపికతో వినండి. ఒకానొక ఆదివారంనాడు మేము కొంతమంది మిత్రులం కలిసి ఊరికి దూరంగా పోయి పిక్‌నిక్ చేసుకొందా మనుకొన్నాం. అందుకు కావలసిన ఏర్పాట్లన్నీ చేసుకొన్నాం. ఆదివారం వచ్చింది. ప్రొద్దున నిద్దరలేచి స్థానిక దినపత్రిక తిరగేస్తూ, నాటి వాతావరణ సూచనలు చదివాం. ఆరోజున ఏ క్షణంలోనైనా పిడుగుల వర్షం పడవచ్చునని సూచన చేయబడింది. ఒకచెంప పిడుగులవాన పడబోతూవుంటే పిక్‌నిక్ ఏమిటిలెమ్మని, ఆ ఆలోచన విరమించుకొని, వానకోసం ఎదురుచూస్తూ యింట్లోనే వుండిపోయాం.

ఎంతకీ వానరాలేదు. ఫెళ్లున ఎండ కాస్తూనే వుంది. ఆకాశంలో కనుచూపు మేరదూరాన ఎక్కడా మబ్బుతునకైనా కనిపించలేదు. వీధుల్లో ట్రాములు, కార్లు, జట్కాలు. సైకిళ్లు అన్నీ మామూలుగానే తిరుగుతున్నాయి. పట్టణంలోని జనాభా యావత్తూ ఎవరిపని వాళ్లు చేసుకుపోతున్నారు. వాన రాబోతున్నదనే అనుమానమైనా లేకుండా వీధుల్లోబడి చెడతిరిగే యీజనాభాను చూసి మేము చాలా జాలిపడ్డాం—మరికొంత సేపట్లో యీ తెలివితక్కువ దద్దమ్మలందరూ తడిసి ముద్దలైపోతారు కదా అని. ఇప్పుడు తెల్లని చొక్కాలు తొడుక్కొని తిరిగే యీ పెద్దమనుష్యులు మరికొన్ని క్షణాల్లో ఎల్లా వానకితడిసి వజవజ వణకుతారో అదంతా మాలోమేము వూహించుకొని, వాళ్ల తెలివితక్కువకి నవ్వుకొన్నాం. వాన వచ్చేదాకా ఆగటం దేనికని, ముందుగానే ఉన్ని కోట్లు తొడుక్కొని నెగడులో నిప్పువేసి, చేతుల్లో పుస్తకాలు పెట్టుకొని దానిచుట్టూ కూర్చున్నాం. గంట పన్నెండు దాటింది. మేము అంతగా ఎదురుచూస్తున్న వాన కురవకపోగా, ఎండ మామూలుకంటే ఎక్కువగా నిప్పులు చెరగుతోంది. నాటి వాతావరణంలో సూచింపబడిన పిడుగుల వర్షం యింకెప్పటికి వస్తుందా అని మాలోమేము మథనపడ్డాం. సాయంకాలంలోగా వస్తుంది లెమ్మని సామాధాన పరచుకొన్నాం.

మధ్యాహ్నం కూడా దాటిపోయింది. పొద్దు పడమటికి తిరిగింది. మాటవరసకైనా మబ్బు వెయ్యలేదు. ఆదిక్కుమాలిన వాన 'యింకా వస్తుంది' 'యింకా వస్తుంద'ని ఎంతసేపని, కనిపెట్టుకు కూర్చోగలం? విసుగెత్తిపోయి, నాటికి ఆవూసే మానేశాం.

మరునాడు వుదయం పత్రిక మళ్లా చూశాం. వాతావరణం అతి ప్రశాంతంగానూ, ఆహ్లాదకరంగానూ వుంటుందని సూచన చేయబడింది. ఉన్ని బట్టలు వేసుకోవలసిన అవసరం వుండదన్న ధీమాకొద్దీ, ఏవో పులిపిరిబట్టలు తొడుక్కొని వీధిలోకి వెళ్లాం. పట్టుమని అరగంటసేపైనా తిరిగామో లేదో, వున్నట్లుండి ఆకాశానికి చిల్లిపడి కుండపోతగా వర్షం కురవటం మొదలుపెట్టింది. దానికితోడు 'రంయ్ రంయ్' మంటూ చలిగాలి! చప్పగా తడిసిపోయి, చలికి బిర్ర బిగుసుకుపోయాం. ఎప్పటికైనా యీగాలీ వాన తగ్గుతుందేమోనని వెయ్యి దేవుళ్లకి మొక్కుకొన్నాం. కానీ ఎంతకీ తగ్గందే! ఆరోజు రోజు అంతా అల్లా నిలబడి కురిసిందంటే నమ్మండి.

ఇల్లా వుంటాయి వాతవరణ సూచనలు!

పోనీ బరోమీటర్లు వున్నాయికదా,—వాటినైనా నమ్మవచ్చునేమో అనుకొంటే, అవి అంతకంటే దగుల్బాజీ రకం. ఆక్స్‌ఫర్డ్‌లో ఒకానొక హోటల్‌లో బరోమీటర్ ఒకటి వుండేది. నిరుడు నాకేదోపనిబడి

ఆక్స్‌ఫర్డ్‌కి వెళ్లాను. ఆరోజు రోజంతా కుంభవృష్టిగా వాన పడుతూనేవుంది. కాని యీ బరోమీటర్ మాత్రం ఆకాశం ప్రశాంతంగా వున్నట్లు సూచిస్తోంది. ఎంతసేపు చూసినా దాని రీడింగ్ మారక పోయేసరికి, నాకు వొళ్లు మండుకొచ్చి మీటర్ మీద గట్టిగా ఒక్క దెబ్బ వేశాను. దాంతో మీటర్‌లోని పాదరసం గబగబా పైకి పాకిపోయి, అత్యధిక వుష్ణతాపాన్ని సూచించింది. ప్రక్కనున్న వాడొకడు అప్పుడు కలుగ జేసుకొని, యీమీటర్ రేపటి పరిస్థితిని సూచిస్తున్న దేమో ఆలోచించమన్నాడు. మరునాడు వుదయం మళ్లా ఆహోటల్‌కి వెళ్లి మీటర్‌ని పట్టుకు ఆడించే శాను. పాదరసం యింకా పైకిపోయింది. బయట మాత్రం వర్షం యింకా ఎక్కువ జోరుగా కురుస్తునే వున్నది.

కాకపోయినా, వాతావరణం ఎల్లా వుండ బోతున్నదో ముందుగా తెలుసుకొని ఎవరు మాత్రం ఏం చేస్తారు? ముందుగా తెలిసినా, తెలియకపోయినా వాన వచ్చినప్పుడు అనుభవించే బాధ ఒక్కలాగే వుంటుంది.

ప్రస్తుత విషయానికి వద్దాం. మేము ప్రయాణం పెట్టుకొన్న రోజు వుదయాన జార్జిగాడు కేవలమూ మమ్మల్ని హడలగొట్టటానికే వార్తాపత్రిక విప్పి, వాతావరణ సూచనలు బిగ్గరగా చదివాడు. నాడు బ్రహ్మప్రళయంగా వర్షించబోతున్నదని ఆ సూచనల్లో వున్నప్పటికీ, నేనూ, హారిస్సూ ఎంతమాత్రము కలతజెందలేదు. దాంతో జార్జిగాడికి ఆశాభంగం అయింది. నేను కష్టపడి నా చేతులతో చుట్టిపెట్టుకొన్న సిగరెట్టుని కాస్తా కొట్టేసి, గుట్టుచప్పుడు కాకుండా ఆఫీసుకి జారుకొన్నాడు.

వాడు వెళ్లిపోయాక, నేనూ, హారిస్సూ చిల్లర మల్లర సామాన్లు సర్దుకొని, సామానంతా వీధి వాకిట్లోకి జేరవేసి, ఖాళీబండి ఏదైనా వస్తుందేమోనని చూస్తూ నిలబడ్డాం.

ఇంట్లో అక్కడ ఒకటి, యిక్కడ ఒకటిగా పడి వున్నప్పుడు మాకు సామాను అట్టే లేదనే అనిపించింది కాని, తీరా వురుములన్నిటినీ ఒకచోట చేర్చి చూస్తే మాత్రం బండెడు సామాను తయారైంది. రెండు చేతి సంచులు, ఒక పెద్ద గోనెసంచీ, రెండు



"అసలే గాలిలేక ఛస్తుంటే కిటికీతలుపులు అన్నీ మూసేస్తున్నా వేరా?"

"అందుకేనండీ! లోపలవుండే యీ కాస్త గాలి కూడా బయటికి పోతుందేమోనని!"

—'మహేన్' (మద్రాసు)

మేదరబుట్టలు (పే-ద్ధ-వి), గొంగళ్ల చుట్ట, ఐదు ఓవర్ కోట్లు, ఎన్నో కొన్ని గొడుగులు: ఇవన్నీ కాక ఒక పెద్ద పుచ్చకాయ! (ఇది ఎందులో పెట్టటానికీ వీల్లేక పోయింది. విడిగానే అట్టే పెట్టేశాం.) రెండు పౌనుల ద్రాక్షపళ్ల పొట్లం, అట్ల పెనమూ—వీటిని కూడా ఎందులో పెట్టటానికీ కుదరక, కాగితాలు చుట్టబెట్టి చేత్తో పట్టుకొన్నాం.

ఇంత సామాను వేసుకొని వీధిలో నిలబడటానికి నాకూ, హారిస్సుకీ సిగ్గేసింది. 'సిగ్గెందుకు' అని అడిగితేమాత్రం సమాధానం ఏమీ చెప్పలేం – కాని సిగ్గువేసిన మాటమాత్రం నిజం. అసలే పరిస్థితి యింత చికాకుగా వుంటే, అదేమిటో శాపం పెట్టినట్లు, ఎంత సేపటికీ ఖాళీబండి ఒక్కటైనా యిటువైపు రాలేదు. ఈలోగా పనిలేకుండా వీధుల్లో తిరిగే కుర్రవెధవలు మాత్రం మాచుట్టూ పోగడిపోయారు.

మా కూరలమ్మేవాడి అంగట్లో పనిచేసే

★ ముచ్చటగా ముగ్గురు ★

గుంటడే అందరికంటే ముందు అక్కడ తయ్యారయ్యాడు. ఆ అంగడివాడు ఎప్పుడూ యిల్లాంటి కొక్కొరాయి వెధవలనే చేరదీస్తుంటాడు. మా పేటలో కొత్తగా ఎవడైనా పోకిరీ వెధవ కనిపించాడూ అంటే, వాడు తప్పకుండా కూరల అంగడివాడు పట్టుకొచ్చిన శాపతేనని మాకు బాగా తెలుసు. ఇప్పుడు మావంక విచిత్రంగా చూస్తూ నిలబడివున్న ఈ వెధవ కూడా అక్కడివాడే. మేము వాడి దృష్టిలో పడనప్పుడు పెద్దపనిమీద చకచకా పోతున్న ఆ గుంటడు, మేమూ, మా సామానూ వాడి కళ్ల బడగానే ఠక్కున ఆగిపోయాడు. వాడి వాలకం కనిపెట్టి నేనూ, మా హారిస్సూ యిద్దరమూ కళ్లు ఎర్రచేసి చూశాం, వాడివంక! నిజంగా ఆ కుర్రవాడిలో గనుక యింకా ఏమాత్రమైనా సున్నితం మిగిలివుంటే మేమా క్షణంలో చూసిన చూపులోని తీక్ష్ణతకి వాడు నిలువునా కాలి బూడిదై రాలిపోవలసిందే. అంత ఘాటుగా చూశాం. ఎంత ఘాటుగా చూస్తే ఏం? మా కూరల అంగడివాడు ఎప్పుడూ ఫస్టు బండ వెధవలనే చేరదీస్తాడు. ఈ వెధవ, మా వాడి చూపులకి చలించకపోగా, మాకు గజం దూరందాకా వచ్చి అక్కడ నిలబడి, మావంక తేరిపారచూడటం మొదలుపెట్టాడు. నేలమీద ఒక గడ్డిపరక పడివుంటే, దాన్ని తీసి నములుతూ పక్కగా వున్న స్తంభాన్ని ఆనుకొని నిల్చున్నాడు. వాడి ధోరణి చూస్తే, మా అంతు కనుక్కోందే వాడు అక్కణ్ణించి కదిలేలా లేడు.

ఇంతలో వీధికి అటువైపునుంచీ యింకో కుర్రవెధవ వస్తున్నాడు. వాణ్ణి చూడగానే, "ఒరేయ్! నల్లఖై రెండో నెంబరు క్రిందివాటా కదలిపోతోంది రోయ్!" అంటూ పొలికేక ఒకటి పెట్టాడు, యీ వెధవ.

ఆ మాట వినబడగానే అవతలి వెధవ యివతలికి పరుగెత్తుకొంటూ వచ్చాడు. ఈలోగా చెప్పుల దుకాణంలో పనిచేసే పడుచు కుర్రాడు, సీనారేకు డబ్బాలకి అడుగు వేసే మరొకడు, అందరూ వచ్చి మా చుట్టూ చేరిపోయారు. వీళ్లని చూసి, దారే పొయ్యే ప్రతివాడూ నిలబడిపోయాడు. అంతా ఐదు నిమిషాలు గడిచేలోగా మాచుట్టూ పెద్దగుంపు ఒకటి చేరిపోయింది. అసలు సంగతేమిటో ఎవరికీ తెలియక, వాళ్లల్లో వాళ్లే తర్కించుకోవటం మొదలుపెట్టారు.

ఒక బుద్ధిమంతుడు మాకేసి చూస్తూ యిదేదో పెళ్లిబేరమన్నాడు. హారిస్సుకేసి చూపించి బహుశః వాడే పెళ్లికొడుకు అయివుంటాడన్నాడు. అంతకంటే బుద్ధిమంతుడు మాయిద్దరికేసీ మరికొంతసేపు పరీక్షగా చూసి, మేము పెళ్లివాళ్లంకాదనీ, ఏదో దహన సంస్కారానికి పోతున్న వాళ్లమనీ అంటూ, నన్ను చూపించి "బహుశా యీయనే ఆశవానికి తమ్ముడై వుంటా" డన్నాడు.

చివరి కెప్పటికో ఒక ఖాళీబండి వచ్చింది. మావీధిలో ఖాళీ బళ్లు కుక్కలుతిరిగినట్లు తిరుగుతాయి. సగటున నిమిషానికి (అక్కరలేనప్పుడు మూడైనా ఎదురౌతాయి. అల్లాంటిది—అవసరం వచ్చినప్పుడు మాత్రం కంఠానికి వురిపెట్టుకొన్నా ఒక్కటీ కనిపించదు.) బండి కనిపించిందే చాలునని, గబగబా సామానంతా అందులోకి ఎక్కించాం. మాకాళ్లకి అడ్డంవచ్చిన మాంటీ మొరిస్సీ మిత్రు లిద్దరినీ ఎముకలు విరిగేటట్లు తన్ని అవతల పారేశాం. ఇంతసేపటి నుంచీ రెప్ప వాల్చకుండా మావంకచూస్తూ నిలబడివున్న ఆపోకిరీమూక, మాబండి బయలుదేరే సరికి ఒక్కసారిగా కేకలు, అరుపులు మొదలుపెట్టారు. వాళ్లలో ఒకడు మామీదికి కుళ్లిపోయిన కేరట్ దుంప విసిరివేశాడు కూడా.

సరిగ్గా పదకొండు అయ్యేసరికి వాటర్‌లూ స్టేషన్‌కి చేరుకొన్నాం. 'పదకొండూ ఐదునిమిషాలకి బయలుదేరే బండి ఏప్లాట్‌ఫారం మీదనుంచి బయలుదేరుతుంద'ని అక్కడ కొంతమందిని అడిగాం. ఈ వాటర్‌లూ స్టేషన్లో ఏబండి ఎప్పుడు బయలుదేరుతుందో, ఎక్కణ్ణుంచి బయలుదేరుతుందో, బయలుదేరిన బండి ఎక్కడికి వెళ్లుతుందో ఎవ్వరూ చెప్పలేరు. మాసామాను మోసుకొచ్చిన లైసెన్సు కూలీ మాత్రం 'పదకొండూ ఐదుబండి' రెండో నెంబరు ప్లాట్‌ఫారం మీదనుంచి బయలుదేరుతుందన్నాడు. ఆవిషయమై వాడితో వాదించిన మరొక పోర్టరు, ఆబండి వస్తే రెండో నెంబరు ప్లాట్‌ఫారంమీద నుంచీ బయలుదేరదని కొట్టిపారేస్తూ, ఒకటో నెంబరు ప్లాట్‌ఫారం మీద నుంచే బయలుదేర బోతున్నదనే వదంతి ఒకటి



వ్యాపించి వున్నదని మాత్రం బయట పెట్టాడు. స్టేషన్ మాస్టర్‌ని అడిగితే, ఆయన, లోకల్ ప్లాట్ ఫారంమీద నుంచీ బయలుదేరు తుందన్నాడు.

వాళ్లనీ వీళ్లనీ అడిగి లాభంలేదని, మేముభయులమూ కలిసి రెండో అంతస్థులోకి వెళ్ళి అక్కడ వుండే ట్రాఫిక్ సూపరింటెండెంటునీ అడిగాం. ఆయన ఒక క్షణం ఆలోచించి, 'పదకొండూ ఐదు బండి' మూడో నంబరు ప్లాట్ ఫారంమీదనుంచీ బయలుదేర బోతున్నదని తనతో ఎవరో అంతకు ముందే చెప్పారని అన్నాడు. మూడో నంబరు ప్లాట్ ఫారంమీదికి వెళ్ళాం. అక్కడ వుండే రైల్వే వుద్యోగుల నడిగితే, అక్కణ్ణుంచి బయలుదేరే బండి మేము ఎక్కవలసిన కింగ్‌స్టన్ బండితప్ప, మిగిలినదేదైనా కావచ్చునన్నారు.

ఈతర్జనభర్జనలన్నీ విన్న మా కూలీ, అవతల హై లెవల్ ప్లాట్ ఫారంమీద నిలబడివున్న ఆ బండే మా బండి అని ప్రకటించాడు. మమ్మల్ని అక్కడికి తీసుకెళ్ళాడు. ఎందుకైనా మంచిదని ఇంజన్ దగ్గిరికి వెళ్ళి, "ఇది కింగ్‌స్టన్ బండేనా?" అని డ్రైవర్‌ని అడిగాం. కానైతే ఆ మాట గట్టిగా చెప్పలేనని అంటూ, యిదే కింగ్‌స్టన్ రైలు అయితే కావచ్చునని వాడు సమాధానం చెప్పాడు. అదీకాక 'పదకొండూ ఐదు బండీ' కింగ్‌స్టన్ రైలూ ఒకటే కాకపోవచ్చునని మమ్మల్ని బెదరించాడు. మాకు ఏం చెయ్యటానికీ దిక్కుతోచ లేదు. ఆ డ్రైవర్‌కి లంచం ఆశపెట్టి, వాడి రైలునే 'పదకొండూ ఐదు రైలు'గా మార్చేసి, 'కింగ్‌స్టన్ వైపుకి పట్టించమని బ్రతిమాలాము.

"ఈ లైనుమీద అదే సౌకర్యం. ఏ రైలు ఏదో, ఎక్కడికి పోతున్నాదో, ఎవ్వరూ పట్టించుకోరు. నువ్వు కాస్త మామీద కనికరించి కింగ్‌స్టన్— దారి నీకు ఎల్లాగూ తెలుసును కాబట్టి—నీ బండిని గుట్టుచప్పుడు కాకుండా ఆ లైనుమీద నడిపించవద్దూ?" అని వాడి కాళ్ళా వేళ్ళా పడి గోలపెట్టాం.

"అదంతా నాకు తెలియదండీ. కాని—ఏదో ఒక బండి కింగ్‌స్టన్ వైపుకి ఎలాగూ పోవల్సివుంది కాబట్టి, నాబండినే అటువైపు నడిపిస్తాను. ఏదీ మీరు యిస్తానన్న డబ్బు యిలా పడెయ్యండి!" అంటూ వాడు చెయ్యి జాపాడు.

అన్ని తిప్పలూ పడి కింగ్‌స్టన్ చేరుకొన్నాం. ఆతరువాత విచారించగా మేమువచ్చిన బండి యింకేదో మెయిల్ అనీ, యిది ఎక్కడికి పోయిందో ఏమైపోయిందో తెలియక అక్కడ వాటర్‌లూ స్టేషన్‌లో జనం గంటలతరబడి గిజగిజలాడి పోయారనీ తెలిసింది.

కింగ్‌స్టన్‌లో బ్రిడ్జిదగ్గిర మేము ఎక్కవలసిన బోటు మాకోసం సిద్ధంగావుంది. సామానంతా అందులోకి ఎక్కించి, మేమూ ఎక్కి కూచున్నాము.

"అంతా సరిగానేవుందా బాబయ్యా?" అని అడిగాడు, పడవవాడు. "ఆఁ! అంతాసరిగానే వుంది" అన్నాం. హారిస్ తెడ్డు వేస్తున్నాడు. నేను చుక్కాని పట్టాను. మాంట్ మొరన్సీ మాత్రం పడవ ముందు భాగంలో ముడుచుకు కూర్చుంది. దానికి ఎందుచేతనో మనస్సు ఆట్టే బాగుండనట్లుంది; మొఖం ధుమధుమ లాడుతున్నది.

నాటినుంచీ పదిహేను రోజులపాటు మాకు యిల్లూ వాకిలీ అన్నీ ఆ పడవే. నదిమీదనే మా కాపురం.

(ఇంకా వుంది)




త్రీ - డీ తమాషా

(త్రీ-డీ చిత్రాల్లో దృశ్యాలు చాలా యదార్థంగా మనకళ్ల ఎదుటే జరుగుతున్నట్లు వుంటాయి కాని అందువల్ల ప్రేక్షకుల మానసికోద్రేకాలు పైకి వుబికిపోయే ప్రమాదం మాత్రం వున్నది. ('టైమ్' పత్రిక ముఖచిత్రం ఆధారంగా ఈ కార్టూన్ వేయబడింది)

దొంగ ? దొర ?

త్రీ-డీ చిత్రాల తమాషా—రచన: ఎన్నార్

తొడలవరకూ నగ్నంగావున్న యువతి ఉయ్యాల ఊగుతోంది. ఆమె ఒక ఊపులో వెనక్కిపోయి, ఒక ఊపులో మన దగ్గిరికి వస్తున్నది. దగ్గిరికి వచ్చినప్పుడల్లా ఆమె కాళ్లు మన మొహాలమీదికి వస్తున్నాయి...



పోలరైజ్‌డ్ గ్లాసెస్. కుడికంటికి ఎర్రఅద్దం, ఎడమకంటికి ఆకుపచ్చ అద్దం ఉండేట్లు ధరించాలి.

ఒక పెద్దమనిషి వైన్ తాగుతున్నాడు. మనకేసి చూసి మద్యనిషేధచట్టాన్నికూడా ఉల్లంఘించి "తాగండి, మొహమాట పడకండి," అని వైన్ కప్పు అందిస్తున్నాడు. "చెయ్యి జాపితే అందుతుంది," అని ఊరిస్తున్నాడు...

మిడ్‌లాండ్ థియేటర్లో ప్రదర్శించబడుతున్న "మెట్రోస్కోపిక్స్" చిత్రంలో ఇలాంటి చిత్రాలనేకం కనిపిస్తాయి. యువతి కాళ్లు నిజంగా మనదగ్గిరికి వచ్చినట్లు, వైన్‌కప్పు చెయ్యిజాపితే అందేటట్లు, ఆటగాడు విసిరిన బంతి మన మొహానికి కొట్టుకున్నట్లు, ఎవడో నీళ్ళుజల్లితే మనమీదే చిందినట్లు, ఇంకా ఎన్నో ఇంద్రజాలాలు ఈచిత్రంలో కనిపిస్తాయి.

ఇదే త్రీ-డీ, లేక త్రీడైమన్షనల్ చిత్రం. మామూలుగా మనం చూసేవి 'టూడైమన్షనల్' చిత్రాలు. వాటిలో ప్రతిబింబానికి పొడుగూ, వెడల్పూ మాత్రమేకనిపిస్తాయి. ఈచిత్రంలో లోతుకూడా కనిపిస్తుంది. లోతు అనేది ఒక వస్తువుకూ మరొకవస్తువుకూ గల దూరాన్ని తెలిపే కొలత. త్రీ-డీ చిత్రంలో కేవలం బొమ్మలుమాత్రమే కదులుతున్నట్లు కనిపించదు. తెరమాయమైపోయి, దాని స్థానంలో నిజమైన మనుషులు, రైళ్ళు, కార్లు కదులుతున్నట్లు కనిపిస్తుంది. రోడ్డుమీద నుంచుంటే, దూరానవున్న కారు క్రమంగా మనదగ్గిరికి వచ్చినట్లే, ఈచిత్రంలోకూడా కారు మన సీటుదగ్గిరికి వచ్చేసినట్టే కనిపిస్తుంది. తుపాకి మనకేసి చూపించి పేలిస్తే, మనల్నే పేల్చినట్టు అనిపిస్తుంది. అందుకే ఈచిత్రం చూస్తున్నంతసేపూ ప్రేక్షకులలో అంతే సంచలనం, అంత సంరంభం!

ఈ ఇంద్రజాలం ఎలా సంభవమైంది? "మెట్రోస్కోపిక్స్" చిత్రంలోనే ఈ విషయం వివరంగా తెలుపబడింది.

మానవ నేత్రాలు ఒకదానికొకటి 2½ అంగుళాల దూరంలో వున్నాయి. రెండు కళ్ళూ దూరదూరంగా వుండడంవల్ల, ఒక కన్ను ఒక కోణంలోనుంచి, రెండో కన్ను ఇంకొక కోణంలోనుంచి వస్తువును చూస్తాయి. ఇలా వేర్వేరు కోణాల్లోంచి గ్రహించబడిన రెండు ప్రతిబింబాలనూ మన మెదడు ఒకే ప్రతిబింబంగా మారుస్తుంది. ఈ ఏక ప్రతిబింబంవల్ల మనం చూసిన వస్తువుయొక్క పొడుగూ, వెడల్పూ మాత్రమే కాక, అది మన కెంతదూరంలో

ట్వంటియత్ సెంచరీఫాక్సువారి *How to marry a millionaire* లో మేరిలిన్ మన్రో. సినిమాస్కోప్ కెమారాతో 35 మి. మీ. ఫిలింమీద ఫొటోతీస్తే పై బొమ్మలో మాదిరిగా ప్రతిబింబం కుదించుకుపోయి వుంటుంది. అదే ఫిలిమును విశాలమైన తెరపై ప్రొజెక్టు చేస్తే కిందిబొమ్మలో మాదిరిగా మామూలు ప్రతిబింబం కనిపిస్తుంది. ఆ ప్రతిబింబం త్రీడైమన్షనల్ "భ్రాంతి" కలిగిస్తుంది.





★



“జబ్బు నాకుకాదు. ఆ బ్రాహ్మడికి,” అంటున్నాడు యింటి యజమాని ప్రకాష్ వారి “బూరెల మూకుడు”లో రామం, రామకృష్ణ.

★ త్రీ-డీ చిత్రాల తమాషా ★

వుందోకూడా తెలుస్తుంది. రెండు కళ్ళు ఉండడంవల్ల ఉపయోగం ఇదే.

ఒక కన్ను మూసి చూడండి; వస్తువు యొక్క పొడుగూ, వెడల్పూ తెలిసినంత స్పష్టంగా దాని దూరం తెలియదు. ఒక కన్ను మూసుకుని, సూదిలోకి దారం ఎక్కించడం కష్టమని అందరికీ తెలిసిందే. రెండు కళ్ళతో చూస్తేనే సూదిబెజ్జం ఎంత దూరంలో వున్నదీ తెలుస్తుంది.

సినిమా కెమేరాకు ఒకటే లెన్సు వుంటుంది. ఈ లెన్సుతోనే అది వస్తువులను చూసి ఫోటో తీస్తుంది. అంటే మనం ఒక్క కన్నుతో చూస్తే వస్తువు ఏమాదిరిగా కనిపిస్తుందో, ఒక్క లెన్సుతో చూసినా అదేమాదిరిగా కనిపిస్తుందన్నమాట. అందుకే మామూలు కెమేరాతో తీసిన చిత్రాల్లో పొడుగూ, వెడల్పూ తెలుస్తాయిగాని, లోతు తెలియదు. లోతుకూడా తెలియాలంటే మనిషికివలెనే కెమేరాకుకూడా రెండు లెన్సులుండాలి.

రెండు లెన్సులూ మనిషి కళ్ళలాగానే దాదాపు $2\frac{1}{2}$ అంగుళాల దూరంలో అమర్చి రెండు ఫిలిములమీద ఫోటో తీస్తే ఈ సమస్య పరిష్కార మవుతుంది.

రెండు లెన్సులూ రెండు వేర్వేరు కోణాల్లోంచి ఫోటో తీస్తాయిగనక రెండు ప్రతిబింబాలకూ కొద్ది తేడా వుంటుంది. ఈ రెండు ప్రతిబింబాలను రెండు ప్రొజెక్టర్ లెన్సులద్వారా తెరమీద ప్రొజెక్టుచేస్తారు. అప్పుడూ ప్రతిబింబాలు విడివిడిగా కనిపిస్తాయి. ఇలా కనిపించకుండా ఒక రకం కళ్ళజోడు పెట్టుకోవాలి. ఈకళ్ళజోడు సినిమాహాల్లోనే సప్లయి చేస్తారు. దానిపేరు ‘పోలరైజ్‌డ్’ కళ్ళజోడు. ‘మెట్రోస్కోపిక్స్’ చిత్రానికి సప్లయిచేయబడిన కళ్ళజోడులో కుడి కంటికి ఎర్రటి అద్దం, ఎడమ కంటికి ఆకుపచ్చ అద్దం వుంటాయి. తెరమీద పడే రెండు ప్రతిబింబాల్లో ఒకటి ఎర్రదీ, ఒకటి నీలందీ. ఎర్రటి అద్దం తెరమీద పడిన ఎర్రటి ప్రతిబింబాన్ని మాత్రమే గ్రహించి రెండో బొమ్మను వడబోత (ఫిల్టర్) పోస్తుంది. ఆకుపచ్చ అద్దం నీలపు ప్రతిబింబాన్ని మాత్రమే గ్రహించి రెండో దాన్ని వడబోతపోస్తుంది. అంటే ఒక్కొక్క కన్ను ఒక్కొక్క బొమ్మను మాత్రమే చూడగలుగుతుంది. ఈవిధంగా రెండు బొమ్మలూ విడివిడిగా మెదడులో ప్రవేశించి ఒకే ప్రతిబింబంగా మారుతాయి. సహజంగా మామూలు కళ్ళతో చూసినప్పుడువలెనే ఈ ఏకప్రతిబింబంవల్ల మూడవ కొలత అయిన లోతుకూడా తెలుసుంది.

‘పోలరైజ్‌డ్’ కళ్ళజోడు పెట్టుకుని ఒక కన్ను మూసి చూస్తే ఒక బొమ్మే కనిపిస్తుంది. కాని అది మామూలు సినిమాలో వలెనే బల్లపరుపుగా వుంటుంది.

కళ్ళజోడు లేకుండా చూస్తే రెండు బొమ్మలూ విడివిడిగా కనిపిస్తాయి. జోడు పెట్టుకుంటే రెండూ సింక్రొనైజ్ అయి మూడు కొలతలు కనిపిస్తాయి. ఇదే ఈ కళ్ళజోడు ఉపయోగం.

2


మిడ్‌లాండ్‌లో ప్రదర్శించబడుతున్న ‘మెట్రోస్కోపిక్స్’ మెట్రో గోల్డ్విన్ మేయర్ కంపెనీతయారుచేసిన త్రీ-డీ చిత్రం. రంగుల్లో టెక్నికలర్, సినీకలర్ గేవాకలర్ అని రకరకాల పేర్లున్నట్లే, ఎమ్ జి ఎమ్ వారు తమ త్రీడీ ప్రొసెస్ విధానానికి “మెట్రోస్కోపిక్స్” అని పేరు పెట్టుకున్నారు. రెండురీళ్ళ పొడుగున్న ఈ చిత్రం పదిహేనేళ్ళకిందటే తీయబడిందని తెలుస్తోంది. ఆ రోజుల్లోనే మన ప్రాంతాల్లో ఇది ప్రదర్శించబడింది. అంచేత ఇందులో కొత్తదనం ఏమీలేదు. అయితే ఇంతకాలం అజ్ఞాతంగావున్న ఈ త్రీ-డీ చిత్రం ఇప్పుడు మళ్ళీ పైకిరావడానికి ఏమిటి కారణం ? ఈ కారణం హాలీవుడ్ సినిమారంగంలో వెదికితే కనిపిస్తుంది.

వ్యాపారరంగంలో పది, పదిహేనేళ్ళకొకసారి ‘డిప్రెషన్’ వచ్చినట్లే సినిమా రంగంలో కూడా ఒక్కొక్కసారి తీవ్రమైన ‘డిప్రెషన్’ వస్తూవుంటుంది. మొదటి ప్రపంచయుద్ధంలోను, ఆ తరవాతనూ హాలీవుడ్‌లో సినిమా పరిశ్రమ బాగా అభివృద్ధి చెందింది. 1925 ప్రాంతాలకు పెద్దమాంద్యం ఏర్పడింది. పరిశ్రమ పూర్తిగా పతనమయ్యే పరిస్థితు లేర్పడ్డాయి. ఆ సమయంలో శబ్ద గ్రహణం వచ్చి హాలీవుడ్‌ను రక్షించింది. 1927 లో వార్నర్ బ్రదర్స్‌వారు ‘జాజ్ సింగర్’ అనే మొదటి టాకీచిత్రం విడుదలచేశారు. అతిత్వరలో సైలెంటు చిత్రాలు తగ్గిపోయి వాటి స్థానంలోకి టాకీలు వచ్చాయి. టాకీల కొత్తదనంవల్ల హాలీవుడ్‌కు ఇదివరకటి ప్రేక్షకులేకాక అంతకు మూడింతల ప్రేక్షకులు లభ్యమయ్యారు. టాకీలు పాతబడిన తరవాత మళ్ళీ ‘డిప్రెషన్’ ఏర్పడింది. అప్పుడు టెక్నికలర్ పద్ధతివచ్చి తిరిగి హాలీవుడ్‌ను రక్షించింది. ఈలోగా రెండో ప్రపంచయుద్ధం ప్రారంభమైంది. యుద్ధకాలంలో హాలీవుడ్ చిత్రాలు ప్రపంచమంతటా, ప్రతి మారుమూలదేశంలోకీ చొచ్చుకుపోయి రాజ్యంచేశాయి. యుద్ధానంతరం కొంతకాలం బాగానే వున్నదికాని, తిరిగి ‘డిప్రెషన్’ ఏర్పడింది. దీనికి ముఖ్యకారణంగా హాలీవుడ్ అర్థిక శాస్త్రజ్ఞులు టెలివిజన్‌ను పేర్కొంటున్నారు. యుద్ధం తరవాత ముఖ్యంగా

అమెరికా దేశంలో టెలివిజన్ బాగా విజృంభించింది. ఇప్పుడు అమెరికాలో రెండు కోట్ల టెలివిజన్ సెట్లున్నాయి. సినిమా ప్రదర్శనానికి లేని కొన్ని సౌకర్యాలు టెలివిజన్ కున్నాయి అందుచేత ప్రజలు సినిమాలకు వెళ్ళడం తగ్గించేశారు. పూర్వం వారానికి 8 కోట్లమంది సినిమాలకు వెళ్ళేవారు. ఇప్పుడు ఈ సంఖ్య 4½ కోట్లకు తగ్గిపోయింది. ఇంకా తగ్గిపోతూనే వుంది. 1946 నుంచి ఇప్పటివరకూ అమెరికాలో సుమారు 5 వేల సినిమాహాళ్లు మూసివేయబడినవి.

స్వదేశంలో టెలివిజన్ ఒత్తిడివల్ల ప్రేక్షకులు తగ్గిపోయారు. ఇక విదేశాల్లో వ్యాపారం బాగుందేమో అంటే అదీ లేదు. యుద్ధానంతరం ప్రతిదేశంలోనూ సినిమా పరిశ్రమ బాగా అభివృద్ధి అయింది. యూరపియన్ దేశాల్లోను, ఆసియా దేశాల్లోను ఆయా భాషల్లో సినిమాలు తయారవుతున్నాయి. అందువల్ల హాలీవుడ్ సినిమాలకు గిరాకీ తగ్గింది.

ఈ రీతిగా హాలీవుడ్‌ను మరొక 'డిప్రెషన్' ఎదుర్కొంది. గత సంవత్సరం హాలీవుడ్‌లోని పెద్ద స్టూడియోలు చాలామటుకు ఖర్చు, రాబడి సరిపెట్టుకోవడంతో సంతృప్తిపడి ఊరుకున్నాయి. శామ్సన్ అండ్ డెలీలా, కోవాడిస్ మొదలైన పెద్ద చిత్రాలు బాగా లాభాలు తీసినప్పటికీ, పది లక్షల డాలర్లకు తక్కువ పెట్టుబడిగల చిత్రాలకు ఏమీ గిట్టడం లేదనే తెలుస్తోంది. ఎమ్ జి ఎమ్ మొదలైన పెద్ద స్టూడియోలు సిబ్బందిని బాగా తగ్గించివేస్తున్నాయి. తారలు, డైరెక్టర్లు యూరపియన్ దేశాలకు వలస పోతున్నారు.



చదువుకుంటూన్న పుల్లయ్యను తన వలపుతో గిలిగింతలు పెడుతూన్న - కాంతం.

ఎన్. టి. రామారావు, కృష్ణకుమారి

ఈ ప్రమాద పరిస్థితుల్లో హాలీవుడ్‌కు సంజీవిని లాగా సినిరమా, త్రీ-డీ అవతరించాయి. వీటివల్ల సినిమా పరిశ్రమ తిరిగి ఆయుర్దాయం వృద్ధిచేసుకోవచ్చునని చాలమంది ఆశిస్తున్నారు. శబ్దగ్రహణం, టెక్నికలర్ లవలెనే త్రీ-డీవల్ల కూడా సినిమాకళలో మరొక విప్లవం వస్తుందనీ, సినిమాకళ ఇంకా బాగుపడుతుందనీ కొందరు ఆశావాదులు భావిస్తున్నారు. వీరి అంచనా సరియైనదే కావచ్చు. న్యూయార్క్ బ్రాడ్వే థియేటర్లో సినిరమా ప్రదర్శనానికి లక్షలాది ప్రజలు హాజరయ్యారు. అలాగే యునైటెడ్ ఆర్టిస్ట్సు వారి "బ్వానా డెవిల్" అనే త్రీ-డీ చిత్రం ఇదివర కెప్పుడూ ఎరగనంత బాక్సాఫీసు విజయం సాధించింది.

3

త్రీ-డీ చిత్రాలు ఏ ప్రాథమికసూత్రంపై ఆధారపడివున్నాయో పైన వివరించబడింది. ఈ చిత్రాలకు కళ్ళజోడు ధరించవలసిన అవసరం ఉన్నది. ఈ కళ్ళజోడువలన ప్రేక్షకుల కళ్ళు అనతికాలంలో దెబ్బతినే అవకాశం ఉన్నది. అదీగాక, సినిమాహాలు యజమానులు కళ్ళజోళ్లను వాపసు చెయ్యవలసిందని కోరినప్పటికీ, ప్రేక్షకులు వాటిని ఇంటికి పట్టుకుపోతారుగాని వాపసు చెయ్యరు. మొదట్లో వీటిఖర్చు అట్టే తెలిసిరాకపోయినా సంవత్సరాల తరబడి వాటిని సప్లయి చెయ్యడం ఖర్చుతోకూడిన పనే. పోనీ వాటిని ఖరీదుకు సప్లయి చేద్దామంటే, ఇప్పటికే సినిమారేట్లు ఎక్కువగా ఉన్నాయని భావించే ప్రేక్షకులు ఈ అదనపు వ్యయం భరించే స్థితిలో లేరు.

దీనికి తరణోపాయంగా 'సినిరమా'



పక్షిరాజా వారి "ఒకతల్లి పిల్లలు" లో కౌశిక్, లలిత.



నటుడు ప్రేమ్‌నాథ్ నిర్మిస్తున్న "షగూఫా" చిత్రంలో యశోధర కట్జూ, బీనారాయ్, ప్రేమనాథ్. డైరెక్టరు హెచ్. ఎస్. రావైల్; సంగీతం సి. రామచంద్ర; జులైలో విడుదల

★ త్రీ-డీ చిత్రాల తమాషా ★

సినిమాస్కోప్ అనే రెండు పద్ధతులు బయలుదేరాయి. ఇవి అసలు త్రీడైమన్షనల్ చిత్రాలు కావు. వాటికివి నకలుమాత్రమే. వీటిలో సౌకర్యం ఏమంటే, కళ్లజోడు ధరించవలసిన అవసరంలేదు. మూడు కొలతలు యథార్థంగా కనిపించకపోయినా, మూడుకొలతలు ఉన్నట్టే అనిపిస్తుంది; ఒక విశాలమైన దృశ్యం మన మూడు వేపులా కనిపించి, ఆ దృశ్యంలో మనంకూడా పాల్గొంటున్న భావం కలుగుతుంది. అయితే ఈ రెండుపద్ధతుల్లోనూ కొన్ని అసౌకర్యాలున్నాయి. ఈ పద్ధతుల్లో తయారైన చిత్రాలకు మామూలు తెర పనికిరాదు. సినిరమాకు 64 అడుగుల వెడల్పు, 28 అడుగుల ఎత్తుకలిగి అర్ధచంద్రాకారంగా వంకర తిరిగిన తెర కావాలి. ఇంత పెద్దతెర పట్టాలంటే ఇప్పటి సినిమాహాళ్ళు పనికిరావు; కొత్తవి కట్టుకోవాలిసిందే. సినిమాస్కోప్‌కు 65 అడుగుల వెడల్పు, 25 అడుగుల ఎత్తుగల తెర కావాలి. దీనికికూడా ప్రస్తుతపు హాళ్ళు పనికిరావు.

సినిరమా షూటింగ్‌కు మూడు కెమేరాలు కావాలి. మూడూ మూడు కోణాల్లో వుంచి మూడు వేర్వేరు ఫిలిములమీద ఏకకాలంలో షూట్ చేస్తారు. ఈ ఫిలిములను మూడు ప్రొజెక్టర్ల ద్వారా తెరమీద ప్రొజెక్టు చేస్తారు. తెరమీద విశాలమైన దృశ్యం కనిపిస్తుంది. ఈ దృశ్య వైశాల్యం వల్లనే త్రీడైమన్షనల్ 'భ్రాంతి' కలుగుతుంది.

సినిరమాలో మరికొన్ని అసౌకర్యాలున్నాయి. చిత్రనిర్మాణానికీ, ప్రదర్శనానికీ అమిత ధనవ్యయం అవుతుంది. ఒకే దృశ్యం షూట్ చెయ్యడానికి మూడు కెమేరాలు, ముగ్గురు కెమేరామెన్, మూడురెట్ల ఫిలిము, ఎనిమిది మైక్రోఫోన్లు, ఆరు సౌండు ట్రాక్‌లు కావలసివస్తుంది. ప్రదర్శనానికి మూడు ప్రొజెక్టర్లు, ముగ్గురు ఆపరేటర్లు, ఎనిమిది లౌడ్‌స్పీకర్లు కావాలి. ఇంత ఖర్చు భరించడానికి హాలీవుడ్ నిర్మాతలే వెనకాడుతున్నారంటే మిగతావారిమాట చెప్ప నక్కరలేదు. అదీగాక సినిరమాకు పేటెంట్ హక్కు లుండడంవలన హాలీవుడ్‌లో కూడా ప్రతి స్టూడియోవారూ దానిని ఉపయోగించడానికి వీల్లేదు. సినిరమా కంపెనీ తన చిత్రాలు తనే తయారుచేసుకుని తాను నిర్మించిన థియేటర్లలోనే ప్రదర్శిస్తుంది.

ఇకపోతే సినిమాస్కోపు వున్నది. ఇది సినిరమాకంటే చాలా తక్కువఖర్చుతో తయారవుతుంది. దీనికికూడా కళ్ళజోళ్లు అవసరంలేదు. సినిరమాలోవున్న ఒక లోపం దీనిలో కనిపించదు. సినిరమాలో తెరమీద ప్రొజెక్టు చెయ్యబడిన మూడు ప్రతిబింబాలూ ఒకదానితో ఒకటి సరిగా సింక్రొనైజ్ కావు. వాటిమధ్య నిలువుగా చారలు కనిపిస్తాయి. సినిమా స్కోపులో ఒకే ప్రతిబింబం వుంటుంది గనక ఆబాధ లేదు.

ట్వంటియత్ సెంచరీ ఫాక్సువారు సినిమాస్కోపు ఉపయోగిస్తున్నారు. ఇకముందు తాము తయారు చెయ్యబోయే చిత్రాలన్నీ ఈ పద్ధతిలోనే తయారుచేస్తామని వారు ప్రకటించారు.

సినిమాస్కోప్‌లో ఒకటే కెమేరా ఉంటుంది. దానికి మామూలు లెన్సులు కాక ప్రత్యేకమైన లెన్సు ఉంటుంది. ఈ లెన్సు మామూలు లెన్సు చూసేదానికంటే విశాలమైన దృశ్యం చూస్తుంది. ఈ విశాల దృశ్యాన్ని మామూలు 35 మిల్లిమీటర్ల ఫిలిమ్‌మీదనే కుదించి ఫోటో తీస్తుంది. అంటే ఫిలిమ్‌మీద ప్రతిబింబం *distort* అయివుంటుందన్నమాట. ఈ ఫిలిమును వంకర తిరిగిన పెద్ద తెరమీద మరొక ప్రత్యేకమైన లెన్సుద్వారా ప్రొజెక్టు చేసినప్పుడు *distortion* తొలగిపోయి సహజమైన ప్రతిబింబమే కనిపిస్తుంది. ఈ ప్రతిబింబం చాలా విశాలంగా, వంకర తిరిగివుంటుంది గనక నటీనటుల మధ్య, వస్తువుల మధ్య దూరం కూడా కనిపిస్తున్నట్లు 'భ్రాంతి' కలుగుతుంది.

సినిమాస్కోపుకు కెమేరా ఒకటే. సౌండుట్రాక్‌లు నాలుగు ఉంటాయి.

సినిరమా, సినిమాస్కోప్ కాక మరొక పద్ధతి కూడా కనిపెడుతున్నారట. మామూలుగా తీయబడిన ఏ 35 మిల్లిమీటర్ల ఫిలిమునైనా ప్రత్యేకంగా నిర్మించబడిన పెద్ద తెరమీద ప్రొజెక్టు చేస్తే త్రీడైమన్షనల్ "భ్రాంతి" కలిగించవచ్చునట. లండన్ "ఎంపైర్" థియేటర్లో "యంగ్ బెస్" అనే చిత్రం ప్రదర్శింపబడుతోంది. తెర మామూలు తెరకంటే 1½ రెట్లు పెద్దది. ఈ చిత్రంలో నటించిన జీన్ సిమన్స్ కంటి వెంట్రుకలు క్లోజప్‌లో ఒక అడుగు పొడుగున్నాయనీ, ముక్కు రెండు గజాల పొడుగుందనీ, కళ్లు రెండు సరస్సులలాగ ఉన్నాయనీ ఒక ఫిలిం సమీక్షకుడు రాశాడు. ఈ పెద్ద తెరవల్ల కొంతమాత్రమే త్రీ-డీ "భ్రాంతి" కలిగించవచ్చునట.

త్రీ-డీ చిత్రాలలో ఇప్పటికి విడుదలైనవి "బ్వానా డెవిల్", వార్నర్ వారి "హౌస్ ఆఫ్ వాక్స్", కొలంబియా వారి "మాన్ ఇన్ ది డార్క్" చిత్రాలు. పారమౌంట్, ఆర్ కె ఓ, ఫాక్స్, యూనివర్సల్, ఎమ్ జి ఎమ్, మొదలైన కంపెనీ

లన్నీ త్రీ-డీ చిత్రాలు తీయడంలో నిమగ్నమై ఉన్నాయి. వార్నర్స్ కంపెనీవారు మొత్తం 22 చిత్రాలు త్రీ-డీలో తీస్తామని ఇటీవల ప్రకటించారు.

త్రీ-డీ చిత్రాల భూకంపం పారమౌంట్ స్టూడియోకు చేరే సమయానికి, వారు 'సంగారీ' అనే చిత్రం షూట్ చేస్తున్నారు. అప్పటికి 12 రోజుల షూటింగ్ జరిగిందట కూడాను. అదంతా బుట్టదాఖలు చేసి వెంటనే త్రీ-డీ టెక్నికలర్‌లో అదే చిత్రం షూట్ చేయడం మొదలెట్టారట.

అలాగే సినిమాస్కోప్ పద్ధతిలో కూడా పైన చెప్పిన కంపెనీలు ఫిలిములు తీస్తున్నాయి.


4

త్రీ-డీ, సినిరమా, సినిమాస్కోప్ చిత్రాలమూలంగా సినిమా పరిశ్రమ ఆయురారోగ్యాలు అభివృద్ధి అవుతాయా అని ఒక ప్రశ్న ఉన్నది. ఇదివరలో శబ్దగ్రహణం వల్లా, టెక్నికలర్ వల్లా ఆ పనికొంతవరకూ జరిగింది. తిరిగి తిరిగి డిప్రెషన్ ఏర్పడడం కూడా జరిగింది. అలాగే కొంతకాలంవరకూ ఈకొత్తచిత్రాలకు విరివిగా ప్రేక్షకులు హాజరై నిర్మాతలకు లాభాలు చేకూర్చిపెట్టవచ్చు. కాని కొంతకాలానికి ఇవి కూడా మామూలైపోతాయికదా! అదీగాక, టెలివిజన్ పోటీని తప్పించుకోడానికి ఈ కొత్త పద్ధతులు అనుసరించబడుతున్నాయో, ఆ టెలివిజన్ కూడా ఈపద్ధతులే అనుసరించవచ్చునుగదా! అప్పుడు మళ్ళీ టెలివిజన్ పోటీ తయారవుతుంది.

యాంత్రికమైన అభివృద్ధిమీద ఎక్కువ కాలం ఆధారపడలేమనీ, త్రీ-డీలో తయారుచేసినా, అంతకంటే గొప్పపద్ధతిలో తయారుచేసినా మంచి చిత్రాలూ, చెత్త చిత్రాలూ అనే విభేదం ఉండి తీరుతుందనీ, ఈ సమస్యకు పరిష్కారం మంచిచిత్రాలు తయారుచెయ్యడమేననీ బ్రిటిష్ నిర్మాత సర్ అలెగ్జాండర్ కోర్డా అన్నాడు.

పెద్దతెరలు ఉపయోగించడంవల్ల మరొకసమస్య ఏర్పడుతుందని ప్రఖ్యాత ఫ్రెంచి దర్శకుడు రీనీ క్లెయిర్ అన్నాడు: మామూలు తెర చిన్నది గనుక దృశ్యాలను ఎంత వేగంగానైనా మార్చడానికి వీలవుతున్నది. ఎడిటింగ్‌లో దృశ్యాలను అతివేగంగా మార్చడమనేది ఒక ముఖ్య పద్ధతి. ఈ పద్ధతి సినిమాస్కోప్ తెరమీద సాధ్యం కాకపోవచ్చును. అంత పెద్ద తెరమీదపడే పెద్ద ప్రతిబింబాన్ని ప్రేక్షకుడు వివరంగా చూడడానికి కొంత టైము పడుతుంది. అందుచేత 'క్విక్ కటింగ్' అనేది సాధ్యం కాదు. ఇది ఎప్పుడైతే సాధ్యం కాదో, అప్పుడు సినిమాస్కోప్ చిత్రం నాటకంలాగ తయారవుతుంది. దర్శకుని పని వాడితనంకంటె నటీనటుల అభినయం, సంభాషణలు ముఖ్యమవుతాయి.

(53-వ పేజీ చూడండి)



హెచ్. ఎమ్. ఫిలిమ్స్‌వారి "ఛోటీ మా"లో మీరా మిశ్ర, అసిత్ బరన్, ఆనంద్.



[illegible] "[illegible]"లో ఒక మధుర సన్నివేశం — [illegible]

క్లోజప్‌లో ఇంద్ర ధనుస్సు

సినిమా ఎల్లా తీస్తారు —6

జెకోస్లోవాకియన్ రచయిత కారల్ చాపెక్ రచనకు అనుసరణ :

([illegible])

ఫి[illegible] [illegible]

నికి నటీనటులు విడివిడి సీను మాత్రమే నటిస్తారు. ఈ సీను కూడా క్రమంలో ఉండవు. [illegible]

ఈ ముక్కల [illegible]